

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 233 పేజీలు: 10+4 వెల: 6.50



ఇడి కస్టడీకి కారుమూరి.. జైలు నుంచి తరలింపు 3

చైనాలో 45 గంటల్లో 4 రాకెట్ ప్రయోగాలు 5





ఇరాన్‌లో 'కోడ్ 100' భీకర దాడులు జరిగే అవకాశం 5






దీపావళికి పెరిగిన విమాన ఛార్జీలు 5






పౌరసత్వం కేసులో సోనియాకు షాక్
ఎసిజెఎం కోర్టు ఉత్తర్వు కొట్టివేత పునర్విచారణకు ఆదేశాలు


## వరంగల్లు ఆసుపత్రి పనుల వేగం పెంచండి

### జిల్లా కలెక్టర్ రోజూ పర్యవేక్షించాలి

### సిఎంఒ అధికారులు కూడా వెళ్లాలి

### అత్యవసర సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సోమవారం సమీక్షలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు21:** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు మెల్లగా సాగడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఈమేరకు సోమవారం సాయంత్రం ఎంసిఆర్ హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసరంగా సమీక్ష చేశారు. హాస్పిటల్ భవనం నిర్మాణం పైన పలు సూచనలు చేసిన ముఖ్యమంత్రి...గ్రీన్ ఛానల్ లో నిధులు మంజూరు చేస్తున్నా ఎందుకు పనులు వేగంగా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే 30 రోజుల్లో 24 గంటల పాటు పని జరగాలని, వర్క్ షెడ్యూల్ తయారు చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సిఎంఒ అధికారులు నిరంతరం గ్రౌండ్‌కు వెళ్లి సమీక్ష చేయాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి రోజు కలెక్టర్ ఆస్పత్రి పనులను పర్యవేక్షించాలని చెప్పారు.

>>2



## ఉద్యోగుల చర్చల్లో ప్రతిష్టంభన

### సిఎస్ జాజుతో జెఎసి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల భేటీలో చర్చలు అసంపూర్తిగా జరగడంతో ప్రతిష్టంభన నెలకొంది. సచివాలయం వేదికగా సోమవారం జరిగిన ఈ కీలక భేటీలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చలు జరిగినప్పటికీ, ఇరువర్గాల మధ్య స్పష్టత రాకపోవడంతో భేటీ ఎలాంటి తుది నిర్ణయం లేకుండానే

>>2

# మరిగిన జూరాల



సోమవారం జూరాల ప్రాజెక్టు వద్ద రైతులు, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



కాలువలోకి దిగి నిరసన తెలుపుతున్న రైతులు

### ప్రాజెక్టు వద్ద తీవ్ర ఉద్రిక్తత

### నీరు వదిలేదాకా కదలబోమన్న రైతులు

### కాలువలోకి దిగి నిరసన

### లాఠీఛార్జి, పలువురు నేతల అరెస్టు

### కొందరు మాజీ మంత్రులను ముందుగానే హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయినిగా పేరుగాంచిన జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. జూరాల ఆయకట్టు రైతులకుసాగునీరు విడుదల చేయాలని బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో జూరాల ప్రాజెక్టుపరిసరాలు ఆదివారం

>>2



## ఎకరం ఎండినా ఊరుకోం

### పెద్ద ఉద్యమం చేపడతాం: కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు21, ప్రభాతవార్త:** జూరాల రిజర్వాయర్‌లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ ఆయకట్టు పంటలకు సాగునీరు విడుదల చేయక పోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఒక్క ఎకరం పంట ఎండినా అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించడం దారుణమన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన

>>2

## మాజీ మావోయిస్టుల రాజకీయపార్టీ

### 15 డిమాండ్లతో ముసాయిదా మేనిఫెస్టో

### వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ!

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి,తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదక శక్తిగా జన తెలంగాణ పార్టీ రూపుదిద్దుకుంటోంది.లంకా పాపిరెడ్డి (లచ్చన్న), అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్, గురిజాల రవీందర్‌రావు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అజయ్ బాల్నె, కరీంనగర్ జిల్లాకు చెందిన సదానందంలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే, ఆపరేషన్ కగార్ అనంతర పరిణామాల్లో బయటకు వచ్చిన దేవ్‌జీ- సంగ్రామ్, సోనూ-ఆశన్న వర్గాలు ఈ పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావడం లేదని తెలుస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య

>>2


ఎర్రవల్లిలో క్షేత్రస్థాయి భూ సర్వే 3




సోమవారం అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సిఎస్ తదితరులు

## హుటాహుటిన పునరావాస చెల్లింపులు

### 813 కోట్ల పరిహారం తక్షణమే రైతులకు చేరాలి

### కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలి

### అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** భూసేకరణ, పునరావాసం- పునర్నిర్మాణం ఇప్పటికే విడుదల చేసిన రూ.813 కోట్లను ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత రైతులకు అందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాసం-పునర్నిర్మాణం చెల్లింపుల పురోగతిపై సోమవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ సుల్తానియా, భూసేకరణ కమిషనర్ శివకుమార్‌నాయుడు, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు రూ.3,101 కోట్ల విలువైన టోకెన్లు సమర్పించగా, ప్రభుత్వం రూ.2,504 కోట్లు విడుదల

>>2

# నిమజ్జనం టెన్షన్

### ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలను వ్యతిరేకిస్తున్న భాగ్యనగర్ ఉత్సవ సమితి

### పోలీసులతో ఘర్షణ, తోపులాట

### సంప్రదాయాన్ని వదలం, ట్యాంక్‌బండ్‌లోనే నిమజ్జనం అంటున్న నిర్వాహకులు

### పిఒపి విగ్రహాల కోసం కృత్రిమ కొలనుల ఏర్పాటు



సోమవారం ట్యాంక్‌బండ్‌పై ఆందోళన చేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. పోలీసులు ట్యాంక్‌బండ్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను ఉత్సవ సమితి ప్రతినిధులు తొలగించారు. దీంతో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, స్వల్ప తోపులాట చోటు చేసుకున్నాయి. ఈక్రమంలో పలువురు పోలీసులు కిందపడిపోయారు. నిమజ్జనంపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్‌బండ్ వద్ద బైఠాయించారు. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో

>>2



## దానం పిటిషన్‌పై రేపు 'సుప్రీం' విచారణ

**హైదరాబాద్, సెప్టెంబరు21, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్

>>2


పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్ -మంత్రి పొంగులేటి 6 హైదరాబాద్‌లో రెండు థియేటర్లకు జరిమానా


## దళితుల ఆలయ ప్రవేశానికి వందేళ్లు

### అక్టోబరు 11 నుంచి మూడు రోజులు తిరుపతిలో శతాబ్ది వేడుకలు

### ఎస్టీ, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్లను పునరుద్ధరించాలి: కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్




సోమవారం మీడియాతో చింతా మోహన్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** శతాబ్దం క్రితం తిరుచానూరు ఆలయంలో దళితుల ప్రవేశం కోసం జరిగిన పోరాటం నుంచి నేటి వరకు సామాజిక, ఆర్థిక హక్కుల కోసం పోరాటం కొనసాగుతూనే ఉందని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. 1925 అక్టోబర్ 13న తిరుచానూరు ఆలయంలోకి ఓ దళితుడు ప్రవేశించి కర్పూర హారతి ఇవ్వడంతో

>>2

## కృష్ణా, గోదావరి.. ఎంతెంత దూరం!



### యేటేటా తగ్గుతున్న నీటి వాడకం

### ఎడారిగా మారిన తుంగభద్ర ఆయకట్టు

### కన్నెపల్లి, దేవాదుల లిఫ్టుల గరిష్ట వినియోగంలో విఫలం

### గోదావరి డెల్టా నుంచి 1172 టిఎంసిలు సముద్రంలోకి

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** 'తలాపునా పారుతోంది గోదావరి మా చేను మా చెలకా ఎడారి' ప్రజాకవి సదాశివుడి గీతం ఇక పాడుకోనవసరం లేదని ఉత్తర తెలంగాణ రైతుల సంతోషం ఎంతో కాలం నిలువలేదు. నీళ్ళు,నిధులు,నియామకాల కోసం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంచడంతో జూరాల, శ్రీశైలం,నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు వచ్చిన నీరు కల్వకుర్తి,నెట్టంపాడు,కోయిల్‌సాగర్ భీమా, తదితర మధ్యతరహా ప్రాజెక్టులతోపాటు కృష్ణాబేసిన్ పరిధిలోని చెరువులు జలాశయాలు నింపి సాగునీరు వస్తోందని దక్షిణ తెలంగాణ అన్నదాతలు ఆశలు అడియాశలైనాయి. రాష్ట్ర ఆవిర్భాం తరువాత కూడా కృషా గోదావరినది జలాలు దక్కడంలేదు.కళ్ళ ముందు గలగలా గోదావరి కదిలిపోతూనే ఉంది.. బిరబిర కృషమ్మ పరుగులిడుతూనే ఉంది. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ఎల్‌నీనో ప్రభావంతో ఈ యేడు తుంగభద్ర నదిలో ఉండే చిన్నచిన్న మడుగుల్లో సైతం నీరు ఆవిరైంది. భూమిని నమ్ముకుని బతుకుతున్న తెలంగాణ అన్నదాతను ఒవైపు ప్రకృతి మరోవైపు మన పాలకుల నిర్లక్ష్యం నిలువునా ముంచింది. గోదావరి కృష్ణా జలాలను వినియోగించుకోని దుస్థితి నెలకొంది. మేడిగడ్డ కుంగుబాటుతో గోదావరి నీళ్ళు ఎత్తిపోయని అశక్తత ఓవైపు, కృష్ణానీటిలో బ్రజేశ్‌కుమార్

>>2



వారణాసిలో భారీ వరదలతో ఘాట్‌లలో పేరుకు పోయిన బురదను సోమవారం శుభ్రం చేస్తున్న కార్మికులు

## రేపు 'సుప్రీం' విచారణ

>> సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానంలోకి చేరుకుంది. కాగా, పాడి కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి సుప్రీంకోర్టులో కేవియట్ పిటీషన్ దాఖలు చేశారు.
కాగా, దానం నాగేందర్ మీడియాతో మాట్లాడుతూ మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసినంత మాత్రన ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు కాదని తెలిపారు. తనను ఇప్పటికీ బిఆర్ఎస్ పార్టీ తమ ఎమ్మెల్యేగానే గుర్తిస్తోందని స్పష్టం చేశారు.

## మావోయిస్టుల రాజకీయపార్టీ

>> విధానంలోకి అడుగుపెడుతున్న ఈ కొత్త పార్టీ, త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. భారీ ప్రాజెక్టులు, జీడీపీ గణాంకాలే అభివృద్ధి కాదని, సామాన్యులకు ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ప్రశ్నించే స్వేచ్ఛే అసలైన అభివృద్ధి ప్రామాణికాలని తమ విధాన,పత్రంలో పొందుపరచనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలమైనా ప్రజా సమస్యలు తీరలేదన్న అభిప్రాయంతో ఉన్న ఈ బృందం, త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పార్టీ నమోదు కోసం అధికారికంగా దరఖాస్తు చేయనుంది. కాగా, శాసనమండలి స్థానాలకు గ్రాడ్యుయేట్ కోటాలో త్వరలో జరిగే ఎన్నికల్లో పార్టీ తన అభ్యర్థులను బరిలో దింపేందుకు కసరత్తు చేయనున్నట్లు సమాచారం. అయితే ఈ కొత్త పార్టీ సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్‌కు చెందిన పలు గ్రూపులు, వివిధ పక్షాలతో కూడిన జస్టిస్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న వామపక్ష-ప్రజాతంత్ర ఐక్య వేదికతో కలిసే అవకాశం ఉందని కూడా చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర మార్పుకోసం నాణ్యమైన ప్రజా విద్య, బలోపేతమైన ప్రజారోగ్య వ్యవస్థ, గౌరవప్రదమైన స్థిర ఉపాధి, సామాజిక-ఆర్థిక న్యాయం, ప్రజాస్వామ్య-సమాఖ్య హక్కుల పరిరక్షణ, అవినీతి రహిత పారదర్శక పాలన, పర్యావరణ పరిరక్షణ అనే ఏడు ప్రాథమిక అంశాలపై పార్టీ తన విధానాన్ని ప్రకటించబోతున్నది. తక్షణ కార్యక్రమంగా ప్రజల ముందు 15 కీలక డిమాండ్లను ఉంచనున్నది. బడ్జెట్‌లో విద్యతకు అత్యధిక నిధులు, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం, ప్రభుత్వ ఉద్యోగాలు కాలపరిమితితో భర్తీ, పరిశ్రమలకు ప్రతి జిల్లాకు విస్తరణ, యువ పారిశ్రామికవేత్తలు, చిరు వ్యాపారులకు బ్యాంక్ రుణాలు, రైతుకు స్థిరమైన ఆదాయం కలిగేలా సమగ్ర వ్యవసాయ విధానం, జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన, గ్రామాల్లో వ్యవసాయేతర ఉపాధి పెంపు, నైపుణ్య-ఉపాధి అనుసంధానం, మహిళల ఆర్థిక స్వావలంబన, ఆర్థిక, ఉపాధి రంగాల్లో సామాజిక న్యాయం, స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు, విధులు, ప్రాజెక్టు టెండర్లలో అవినీతి రహిత, పారదర్శక విధానం, పౌరహక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో సమాఖ్య హక్కుల కోసం పోరాటం తదితర డిమాండ్లతో కూడిన ముసాయిదా మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు సమాచారం.

## ఉద్యోగుల చర్చల్లో ప్రతిష్టంభన

>> ముగిసింది. ఈ సమావేశంలో ముఖ్యంగా 5 పెండింగ్ డీఏల విడుదల, పీఆర్సీపై పురోగతి, ఉద్యోగులు పెన్షనర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. పీఆర్సీ నిర్ణయం, పెండింగ్ బిల్లుల చెల్లింపు, పదవీ విరమణ ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని సంఘాలు కోరాయి. వీటిపై సీఎస్ సంజయ్ జాజు స్పందిస్తూ ఈ నెలాఖరు నాటికి పీఆర్సీ నివేదికను తెప్పిస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తెలిపారు. అయితే, కేవలం పీఆర్సీ నివేదిక ప్రకటనతో సరిపోదని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు సంవత్సరాలుగా రావాల్సిన పెండింగ్ ఐదు డీఏలను కూడా తక్షణమే విడుదల చేయాలని స్పష్టం చేశారు. డీఏల సాధనే ప్రధాన లక్ష్యంగా ఉద్యోగ సంఘాలు గట్టి పట్టుపట్టడంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇక ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన ఈ డిమాండ్లపై వెంటనే ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో, ఈ అంశంపై మరోసారి సమావేశమై అన్ని విషయాలు చర్చిద్దామని సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు.

## పనుల వేగం పెంచండి

>> శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలి, కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలని చెప్పారు. త్వరలో ఓపి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, హాస్పిటల్ చుట్టూ మంచి వాతావరణం ఉండేలా పరిసరాల్ని తీర్చి దిద్దాలని చెప్పారు. సనత్ నగర్ టిమ్స్ తరహా లో ఓపి సేవలు వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వాటర్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. తక్షణమే స్టాఫ్ క్వాటర్స్ పనులు ప్రారంభం కావాలని పేర్కొన్నారు. హాస్పిటల్ మెయింటెన్స్‌ను ఏజెన్సీకి అప్పగించాలని ఆదేశించారు.
సిఎం వద్ద జరిగిన సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జె. చోంగ్తు, మున్సిపల్ శాఖ సెక్రటరీ టి.కె శ్రీదేవి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దళితుల ఆలయ ప్రవేశానికి వందేళ్లు

>> ఆయనపై ఐపీసీ సెక్షన్ 295 కింద కేసు నమోదు చేసినట్లు చింతా మోహన్ తెలిపారు. ఈ కేసులో చక్రవర్తుల రాజగోపాలాచారి(రాజాజీ) అప్పటి సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఎదుట వాదనలు వినిపించారని చెప్పారు. అనంతరం మహాత్మా గాంధీ తిరుపతికి వచ్చి సత్యాగ్రహం చేపట్టడంతో 33 మంది దళితులకు తిరుచానూరు ఆలయ ప్రవేశం లభించిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘటనకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అక్టోబర్ 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రముఖ నాయకులు, న్యాయమూర్తులు, తెలంగాణకు చెందిన నాయకులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 స్ఫూర్తికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, విద్యాభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్లు చాలా కాలంగా పనిచేయడం లేదని ఆరోపిస్తూ వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వరుస ప్రభుత్వాలు కార్పొరేషన్లను పునరుద్ధరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఇదే సమయంలో దేశంలో, రెండు తెలుగు రాష్ట్రాల్లో పత్రికా స్వేచ్ఛ క్షీణిస్తోందని చింతా మోహన్ ఆందోళన వ్యక్తం చేశారు. మీడియాపై వివిధ రకాల ఆంక్షలు, కార్పొరేట్ సంస్థల ప్రభావం పెరగడంతో జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు తగ్గుతున్నాయని ఆరోపించారు. గతంతో పోలిస్తే ప్రభుత్వాలు, రాజకీయ నాయకులపై విమర్శనాత్మకంగా రాసే స్వేచ్ఛ తగ్గిందన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు వంటి సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.

### వారం - వర్జ్యం

22-09-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి. ఏకాదశి రా. 9.40, న.ఉత్తరాషాఢ ఉ.7.06
వ.ఉ.11.26 - మ.1.10
దు.ఉ.8.22 - ఉ.9.11
రాహు.మ.3.00-4.30
శుభ స. ఉ.7.30-ఉ.8.00

### వార్తాఫలం

**మేషం:** దూరప్రాంతాలలోని ఆత్మీయవర్గంతో సంభాషణలు సాగిస్తారు. సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటారు.

**వృషభం:** క్షణం తీరిక లేకుండా కాలాన్ని గడుపుతారు. దైవ దర్శనం చేసుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు.

**మిథునం:** ప్రకృతి వైద్యం పట్ల మక్కువను చూపుతారు. క్లిష్టమైన సమస్యలకు కూడా కొన్ని పరిష్కారమార్గాలు లభిస్తాయి.

**కర్కాటకం:** వ్యక్తిగత ప్రతిష్టను పెంపొందించుకోవడానికి ప్రాముఖ్యత నిస్తారు. రాజకీయాలు ఆకర్షిస్తాయి.

**సింహం:** ఉద్యోగాభివృద్ధిని సాధించుకోవడానికి గాను క్రొంగొత్త మార్గాలను అవలంభిస్తారు. స్వల్ప ధనలాభ సూచన.

**కన్య :** జీవిత భాగస్వామి సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. న్యాయపరమైన అంశాలను సానుకూల పరచుకోగలుగుతారు.

**తుల :** ఆశించిన ఋణాలు లభిస్తాయి. మిత్రులతోటి కలిసి కష్టసుఖాలు చెప్పుకుంటారు. ఒకింత పురోభివృద్ధిలో ఉంటాయి.

**వృశ్చికం:** మానసిక ప్రశాంతతకు గాను వినోద కార్యక్రమాలపైన దృష్టిని సారిస్తారు. నూతన గ్రంథపఠనం చేస్తారు.

**ధనుస్సు:** విహారయాత్రలు చేస్తారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

**మకరం:** ఆశించిన ఋణాలు లభిస్తాయి. స్తంభించిన అమ్మకాలలో కదలిక ఏర్పడుతుంది.

**కుంభం:** బహుమతులను ఇచ్చిపుచ్చుకుంటారు. మధ్యవర్తి వ్యవహారాలు, రాయబారాలు, చర్చాగోష్ఠులను సాగిస్తారు.

**మీనం:** న్యాయపరమైన అంశాలను సానుకూల పరచుకోగలుగుతారు. దైవ దర్శనం చేసుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కృష్ణా, గోదావరి.. ఎంతెంత దూరం!

>> కుమార్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టిఎంసిలలలో తెలంగాణకు పంపిణీ చేసిన 299 టిఎంసిల వాటాను ఒడిసిపట్టుకోవడానికి సరైన మౌళిక వసతులు లేక గత దశాబ్దకాలంగా వదులుకొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు కేటాయించగా ఆంధ్రప్రదేశ్ గరిష్ఠంగా 771టిఎంసిల వరకు వాడుకొంటున్నది. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఆగస్టు 31ప్రారంభించడంతో శ్రీశైలం నుంచి మరింత అధికంగా నీటిని తరలించేందుకు అవకాశం ఏర్పడింది. 2014 రాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటి వరుకు కేవలం 2016-17లో మాత్రమే అత్యధికంగా 45.5శాతం కృష్ణనీటిని మాత్రమే తెలంగాణ గడ్డ వినియోగించింది. ప్రతి సంవత్సరం కళ్ళముందునుంచి నీరు ఇతర బేసిన్‌లకు తరలిపోతుంటే తెలంగాణ రైతు మాత్రం శిశువుకు దక్కని సన్యంలా దుఖించాల్సిన పరిస్థితి నెలకొంది. 2014-15లో కృష్ణా నదిలో 757.53టిఎంసిలు అందుబాటులో ఉండగా ఆంధ్రప్రదేశ్ 529.35టిఎంసిలు అంటే 69.91శాతం వాడుకోగా తెలంగాణ 227.743 టిఎంసిలు అంటే 30.09 శాతంనీటిని వాడుకొంది. అదే విధంగా 2015-16లో కృష్ణానదిలో 194.648 టిఎంసిల నీరు అందుబాటులో ఉండగా ఆంధ్రప్రదేశ్ 124.96 టిఎంసిలువాడుకొంది. మొత్తంవాటాలో64.2 శాతం నీరు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర బేసిన్‌లకు తరలించారు. అదేయేడు తెలంగాణ 69.688 టిఎంసిల నీటిని అంటే 35.8శాతం వినియోగించుకొంది. ఈ పదేళ్ళలో అత్యధికంగా 45.5శాతం నీటిని తెలంగాణ, అత్యల్పంగా ఆంధ్రప్రదేశ్ 54.2శాతం వినియోగించిన సంవత్సరం ఏదైనా ఉందా అంటే అది 2016-17 అని చెప్పుకోవచ్చు ఆ సంవత్సరం 334.898 టిఎంసిల నీరు కృష్ణనదిలోఅందుబాటులో ఉంటే 182.512 టిఎంసిలు ఆంధ్రప్రదేశ్ వాడుకోగా 152టి ఎంసిలు తెలంగాణ వాడుకొంది. 2017-18లో కృష్ణలో 543టిఎంసిలనీటిని ఆంధ్రప్రదేశ్ 359.857 టిఎంసిలు, తెలంగాణ 183టిఎంసిలు వాడుకొంది. 2018 నుంచి 2023వరకు ఆంధ్రప్రదేశ్ 71శాతం నీటిని వాడుకొంటే తెలంగాణ 29శాతం నీటిని వాడుకొంది. 2023-24లో తెలంగాణ 35శాతంనీటిని వాడుకొంటే ఆంధ్రప్రదేశ్ 65 శాతం నీటిని ఉపయోగించుకొంది. 2024- 25లో 1004 టిఎంసిలు కృష్ణా రిజర్వాయర్‌లో అందుబాటులో ఉంటే తెలంగాణ 286టిఎంసిలు అంటే 28.48 శాతం ఆంధ్రప్రదేశ్ 718 టిఎంసిలు 72 శాతంవాడుకొంది. 2025-26లో 1038 టిఎంసిల నీరు కృష్ణలో అందుబాటులో ఉంటే 771 టిఎంసిలు అంటే 74శాతం నీటిని ఆంధ్రప్రదేశ్ వాడుకోగా తెలంగాణ 267.73 టిఎంసిలు అంటే 25శాతం వాడుకొంది. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం ఉన్నా నీటిని ఒడిసిపట్టుకొనే విషయంలో ఆంధ్రప్రదేశ్ తోపోల్చితే మనం వెనుకబడిఉన్నాం. పది రోజుల క్రితం పోతిరెడ్డిపాడు గేటు రోప్ తెగి నీరు వృధాగా పోయింది. మరోవైపు తుంగభద్ర నది మొత్తం ఎడారిని తలపిస్తోంది. దీనిపై ఆధారపడి రైతులు తీరం వెంట పత్తి, వరి, మిరప సాగు చేశారు. వీటికి తడులు లేక ఎండిపోతున్న పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తుంగభద్ర జలాశయం నుంచి నీటి విడుదల జరిగినా పంటలకు అందించుకోగలమనే ఆశ వారిలో సన్నగిల్లుతోంది. జలాశయం నుంచి విడుదలైన నీరు 180 కి.మీ.లు దూరం పారితే గానీ తెలంగాణ రైతులకుఅందుబాటులోకి రాదు. నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి ఎనిమిది టిఎంసిల నీటిని ఇటీవల విడుదల చేసుకొన్నా ఆయకట్టు అంతటికి పారకం జరగలేదు. ఇదిఇలా ఉంటే గోదావరి డెల్టా నుంచి 1172.72 టిఎంసి నీరు సముద్రంలోకి వెళ్ళింది. మరోవైపు పోలవరం నుంచి కృష్ణాబేసిన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని గరిష్టంగా కృష్ణాపెన్న బేసిన్‌లకు నీటిని తరలించినా మన పాలకులు మాత్రం కన్నెపల్లి పంపు ఆన్‌చేయకపోవడం, దేవాదుల లిఫ్ట్‌లను గరిష్టంగా వినియోగించకపోవడంతో ఉత్తర తెలంగాణలో కూడా చెరువులు కుంటలు భారీ, మధ్యతరహా రిజర్వాయర్లు నీరు నిండకుండా పోయాయి. హైదరాబాద్ తాగునీటి పై కూడా ప్రభావం చూపేలా పరిస్థితి దాపురించింది. ఏదీ ఏమైనా జూలై నెలలో కన్నెపల్లి నుంచి రివర్స్‌పంపింగ్ ఎస్కారేప్కికి చేసి వుంటే పరిస్థితి మరోలా బాగుండేదేమో అని రైతుల అభిప్రాయం.

## మరిగిన జూరాల

>> ఉద్రిక్తతకు దారితీసాయి. బీఆర్ఎస్ నాయకులతో పాటు రైతులు పెద్ద ఎత్తున ప్రాజెక్టు వద్దకు చేరుకోవడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నీళ్ల వదిలే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముందస్తుగా పలువురు నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డిని మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని అప్పన్నపల్లి వద్ద తిరుమలహిల్స్ లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ను హైదరాబాద్ లోని వారి నివాసంలో, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని వనపర్తిలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు పెద్ద ఎత్తున అరెస్ట్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని జూరాల ప్రాజెక్టు దగ్గరికి వెళుతున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని నందిమల్ల క్యాంపు దగ్గర అరెస్ట్ చేసి కొత్తకోట పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు, రైతులు అడ్డుకోవడంతో పోలీసులకు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. నందిమల్ల క్యాంపులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆగ్రహంతో జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ గేట్లను ఎత్తడానికి వెళుతుండగా పోలీసులు నివారించారు. రైతులు జూరాల సమాంతర కాలువలో దిగి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నా ఆయకట్టు రైతులకు సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదని, రైతులకు సాగునీరు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నేతలు డిమాండ్ చేశారు. జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు ఇచ్చే దాకా బీఆర్ఎస్ పార్టీ ఉద్యమం చేస్తుందని, రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్న ఎందుకు విడుదల చేయలేదని నేతలు ప్రశ్నిస్తున్నారు.

**జూరాల ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ సునీత రెడ్డి...**

జూరాల ప్రాజెక్టు దగ్గర బీఆర్ఎస్ చేపట్టిన సాగునీరు ఉద్యమ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి పర్యవేక్షి ంచారు. జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ దగ్గర నీటి నిల్వను పరిశీలించారు. ఎస్పీ వెంట వనపర్తి డీఎస్పీ గిరిబాబు, ఆత్మకూర్ సీఐ శివకుమార్, అమరచింత ఎస్సై స్వాతి, ఆయా మండలాల ఎస్సైలు, సీఆర్పీఎఫ్ బలగాలు భారీగా మోహరించాయి.



యుపి టిజిటి-పిజిటి రిక్రూట్‌మెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా సోమవారం ప్రయాగ్‌రాజ్‌లో నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న అభ్యర్థులు

## ఎకరం ఎండినా ఊరుకోం

>> కేటీఆర్.. వరద జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీళ్లు తీసుకెళ్తుంటే, తెలంగాణలో నికర జలాలపై నిర్మించిన ప్రాజెక్టుల కింద ఉన్న రైతాంగానికి సాగునీరు అందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏపీ నీళ్లు తీసుకెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. ఎల్‌నినో కంటే ఎల్‌కాంగ్రెస్‌తోనే తెలంగాణకు ఈ దుస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది కృష్ణా నదిలో తెలంగాణకు అందుబాటులోకి వచ్చిన 248 టీఎంసీల నీటిలో కేవలం 28 టీఎంసీలను మాత్రమే వినియోగించుకోవడం సిగ్గుచేటని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటిని వినియోగించుకోకుండా రైతుల పంటలను ఎండబెట్టడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంటే ఎందుకంత చిన్నచూపు? పాలమూరు బిడ్డనని గొప్పగా చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పాలమూరు రైతులకు మొదటి శత్రువుగా మారారని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. సొంత జిల్లా రైతులు సాగునీటి కోసం అరిగోస పడుతుంటే వారి సమస్యలను పరిష్కరించకుండా ముఖ్యమంత్రి చిల్లర రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. నీళ్ల కోసం ఆందోళనకు దిగిన జూరాల ఆయకట్టు రైతాంగానికి సంఘీభావంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని కేటీఆర్ ఖండించారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ద్వారా రైతుల గొంతును అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. అక్రమ అరెస్టులకు బీఆర్ఎస్ భయపడబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని కేటీఆర్ హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ మోటర్లను, కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి మోటర్లను వెంటనే ఆన్ చేసి రైతులకు నీటిని అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చి పంటలను కాపాడాలని కోరారు. రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని కేటీఆర్ విమర్శించారు. తాగునీటి అవసరాలకు కేవలం 2 టీఎంసీల నీరు సరిపోతుందని తెలిసినా మిగిలిన నీటిని ఆయకట్టు పంటలకు విడుదల చేయకుండా రైతులను సంక్షోభంలోకి నెట్టడం క్షమించరాని పాపమన్నారు. పంటలను కాపాడుకునే ఏకైక తపనతో గుండెపగిలిన రైతులు జూరాల గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న జూరాల ప్రాజెక్టు పరిసరాల్లోకి రైతులు రాకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, వందలాది మంది పోలీసులను మోహరించడం ముమ్మాటికీ సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. రైతులను అడ్డుకునే బదులు వారికి నీరు అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కళ్ల ముందే పంటలు ఎండిపోయి అల్లాడుతున్న అన్నదాతల గోసను తీర్చాల్సిన ప్రభుత్వం. న్యాయమైన డిమాండ్‌తో నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. పాలనలో విఫలమైన రేవంత్‌రెడ్డి తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు జిల్లాలోని అనేక మండలాల్లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలకు ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు. భూముల విషయంలో బీఆర్ఎస్ నేతలు ఎవరైనా తప్పు చేసి ఉంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చట్టప్రకారం ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చని కేటీఆర్ అన్నారు. అయితే కాంగ్రెస్ నాయకులు భూముల వద్దకు వెళ్లి చేస్తున్న డ్రామాలు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలకు దీటుగా బదులిస్తామని హెచ్చరించారు.

## నిమజ్జనం టెన్షన్

>> పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు. అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్రమానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది. మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**నిమజ్జనాన్ని నిషేధించడం దారుణం: బండి సంజయ్**

ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాన్ని నిషేధించడం దారుణమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల అరెస్టు దుర్మార్గమని ఆయన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. ప్రతి ఏడాది ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం జరుపుకోవడం అనవాయితీగా వస్తోందని తెలిపారు.

## పునరావాస చెల్లింపులు

>> చేసినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో చెల్లింపులకు పెండింగ్‌లో ఉన్న రూ.813 కోట్లలో రూ.502 కోట్లు భూసేకరణ అధికారుల వద్ద, మరో రూ.311 కోట్లు జిల్లా కలెక్టర్ల వద్ద ఉండటం పట్ల మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్లు వ్యక్తిగతంగా చొరవ తీసుకొని రైతులతో సంప్రదింపులు జరపడంతోపాటు అవార్డులప్రక్రియను పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు భూములు కోల్పోయిన రైతులకు చేరాలనీ, మరే ఇతర కారణంతో చెల్లించడం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేసి నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపాలేగానీ, నెలల తరబడి ఖాతాల్లో నిరుపయోగంగా ఉంచడానికి వీల్లేదు" అని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్నవారికి చట్టపరమైన నియమనిబంధనలకు అనుగుణంగా సాధ్యమైనంత వరకు మార్కెట్ ధరలకు దగ్గరగా పరిహారం అందించాలి" అని మంత్రి పేర్కొన్నారు. అవార్డు ప్రకటించిన తరువాత కూడా పరిహారం చెల్లింపులు ఆలస్యమైన కేసుల్లో నిబంధనల ప్రకారం రైతులకు వడ్డీ చెల్లించాలని ఆదేశించారు. కోర్టు కేసులు, యాజమాన్య వివాదాల కారణంగా నిలిచిపోయిన భూసేకరణ కేసులన్నింటినీ ప్రత్యేకంగా నమోదు చేసి, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించి వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలవారీగా సమస్యలపై సమీనల్గొండ, యాదాద్రి భువనగిరి, నారాయణపేట, సిద్దిపేట, వికారాబాద్, జగిత్యాల, హనుమకొండ తదితర జిల్లాల్లో భూసేకరణకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి జిల్లాలవారీగా సమీక్షించారు. నల్గొండ జిల్లాలోని చింతపల్లి రిజర్వాయర్, పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉదయసముద్రం, నెల్లికల్లు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో జాప్యంపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తయిన తరువాత దాని ప్రయోజనాలు రైతులకు అందాలంటే పెండ్లిపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూసేకరణను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఎల్‌బిసి సొరంగం పూర్తయినా, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణ పూర్తికాకపోతే పెట్టిన పెట్టుబడికి ఆశించిన ప్రయోజనం దక్కదు" అని మంత్రి హెచ్చరించారు. భూసేకరణ ప్రక్రియలో రెండు, మూడు వారాల సమయాన్ని సాధారణ పరిపాలనా జాప్యంగా భావించవద్దని కలెక్టర్లకు సూచించారు. ప్రతి దశకు నిర్దిష్ట గడువు పెట్టుకొని సాధ్యమైనంత తక్కువ సమయంలో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అనేక సాగునీటి ప్రాజెక్టుల ప్రధాన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, పంపిణీ కాలువలు, అనుసంధాన పనులు, కొద్దిపాటి భూసేకరణ పెండింగ్‌లో ఉండటంతోనే వాటి ఫలాలు రైతులకు అందడం లేదని మంత్రి తెలిపారు. అందువల్ల భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని స్పష్టం చేశారు.

# మూడెకరాల జగదీశ్‌రెడ్డికి వందల ఎకరాలు ఎలా వచ్చాయి?

## మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నేతలపై మండిపడిన కాంగ్రెస్ నేతలు

**షాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలోని మద్దూరు గ్రామంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి సంబంధించి 50 ఎకరాలు ఆ పదేళ్లలో దోచుకుని దాచుకు న్నటువంటి డబ్బులతో కొనుగోలు చేసిన ఈ భూమిని సందర్శించామని తెలిపారు. ఇనాం భూములు, మాఫీ ఇనాం భూములు పేదలకు చెందాలి తప్ప వీళ్లకు ఎలా చందాయని ప్రశ్నించారు ఇందులో 12 ఎకరాలకు పైగా ఇనాం భూమి ఉన్నట్టు ప్రభుత్వం తెలిసిందన్నారు. వీటన్నింటినీ ప్రజలకు తెలియ జేసేందుకు ఎమ్మెల్యేలు ఎంపీల బృందంతో ఇక్కడికి వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పది ఉమ్మడి జిల్లాలో పరిధిలోని 24 మండలాల్లో 33 గ్రామ పంచాయతీల్లో 400 ఎకరాలకు పైగా భూములు కెసిఆర్ కుటుంబం ఆధీనంలో ఉన్నట్లు చెప్పారు. ఒకప్పుడు నిజాం నవాబు పాలించినప్పుడు ఆస్తులు కూడా కొట్టుకోనికే 200 యేళ్లు పట్టిందని తెలిపారు. కానీ కెసిఆర్ కుటుంబానికి కేవలం 10 సంవత్సరాల్లో వందల ఎకరాలు భూములు ఫామ్ హౌస్‌లు ఏర్పాటు చేసుకున్నట్లు మండిపడ్డారు. కెసిఆర్ ఎర్రవల్లిలో ఎలాగో ఫామ్ నిర్మించు కున్నాడు. రంగనాయక సాగర్ వద్ద హారీశ్‌రావు జన్వాడలో కేటీఆర్ మొయినాబాద్ మండలంలోని అజీజ్ నగర్ లో మరొకటి ఫామ్ హౌస్ ఇక్కడ జగదీశ్ రెడ్డి ఇంత పెద్ద ఫామ్ హౌస్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. కెసిఆర్‌కు తమ ఫామ్‌హౌస్ పక్కన ఉన్న 300 ఎకరాల భూము లను పేదలకు పట్టాలు ఇవ్వాలని ఆలోచన ఇప్పటివరకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో ఉన్న నాయకులు అంతా దానధర్మాలు చేసి ఆస్తులు కోల్పోయారని చెప్పారు. గద్దర్ లాంటోళ్లు ప్రొఫెసర్ జయశంకర్, కోదండరాం లాంటి వాళ్లు ఏం సంపాదించు కున్నారని, ఉద్యమ సమయంలో ఆస్తులు కోల్పోయారని తెలిపారు. జగదీష్ రెడ్డి 2009 మొదటిసారిగా ఎమ్మెల్యేకు పోటీ చేసిన సమయంలో 12లక్షల ఆస్తులు చూపించినట్లు తెలిపారు. అంచలంచలుగా 2014, 2018 ఎన్నికల్లో ఆస్తులు పెరిగినట్లు స్పష్టం చేశారు. 2023 ఎలక్షన్ కు వచ్చేసరికి ఆయన ఆస్తులు కోట్లకు చేరాయన్నారు. ఉద్యమం కొన్న ముందు నాలుగు సార్లు ఎమ్మెల్యే పదవి చేసినోళ్లు అదే సూర్యాపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు అప్లికేషన్ పెట్టు కుంటున్నారని వీళ్లకు ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. సూర్యాపేట నుంచి వచ్చి షాబాద్‌లో 54 ఎకరాలు ఆస్తులు సంపాదించడం ఏంటని అడిగారు. తెలంగాణలో ఎక్కడ చూసినా కూడా వీళ్ల ఆస్తులే ఉన్నాయని చెప్పారు. సర్వే నంబర్ 162, 223 లపై రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు, ఇందులో ఏమైనా ఇనాం భూములు ఉంటే అవి తక్షణమే పేదలకు చెందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దొర దొర చుట్టూ ఉన్నటువంటి వాళ్ళు చేసినటువంటి ఈ దందాలు తెలంగాణ ప్రజలకు తెలియాలన్నారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ అధికారం అడ్డం పెట్టుకొని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అడ్డగోలుగా సంపాదించారని మండిపడ్డారు. నల్గొండ జిల్లాలో 110 ఎకరాలు సంపాదించాడు. వాళ్ళ అయ్య వెనకటికి పట్వారి ఉండేవాడని, తోళ్ల మడిలో తోళ్ళు సాపు చేసేదాన్ని కూడా కబ్జా చేశాడన్నారు. వాళ్ళ తమ్ముని పేరు మీద సూరాయి కుంటను కూడా కబ్జా చేసుకున్నారన్నారు. నల్ల చెరువును కూడా 75శాతం ఆక్రమించుకున్నాడు అన్నారు.

ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు చేసిన అక్రమాలను మీడియా ద్వారా ప్రత్యక్షంగా చూపించడానికి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. భూమి కోసం భుక్తి కోసం పేదవాడి కోసం పోరాటం చేసిన కమ్యూనిస్టు మిత్రులందరికీ నేను తెలియజేస్తున్న ఒకటి మీరు ముందుకు రావాలన్నారు. నిన్న నల్గొండ జిల్లా పర్యటనకు వెళ్లిన హరీష్ రావు ఇక్కడ కరెంటు లేదని ఎంపీ ఎమ్మెల్యే వేరే చోట్ల ఎందుకు తిరుగుతున్నారని మమ్మల్ని అనడం ఏంటని ప్రశ్నించారు. మరి ఆయన ఎందుకు నల్గొండకు



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

వెళ్లారని సమాధానం చెప్పాలన్నారు. ప్రజా సంఘాలు కుల సంఘాలు పేదవారి కోసం పోరాటం చేసే ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమాన్ని గమనించాలని సూచించారు. ఇది ఇప్పట్లో అయిపోయేది కాదని ముఖ్యమంత్రి ఏదో 22ఏ దానికనో బీఆర్‌ఎస్ నాయకులు విసిగిస్తున్నారు అనో ఇది తేలేదు అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కూడా మాట్లాడారు.

# ఇడి కస్టడీకి కారుమూరి.. చంచల్‌గూడ జైలు నుంచి తరలింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఎపి లిక్కర్ స్కాంలో నిందితుడుగా వున్న ఆ రాష్ట్ర మాజీ మంత్రి, వైకాపా నాయకుడు కారుమూరి నాగేశ్వరరావును కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు రెండు రోజుల కస్టడీ నిమిత్తం సోమ వారం అదుపులోకి తీసుకున్నారు. మొదట ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించారు. నెల రోజుల క్రితం కారుమూరి హైదరాబాద్‌లో అరెస్టవడం తెలిసిందే. ఆయన ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో రిమాండు ఖైదీగా వున్నారు. ఎపి లి క్కర్ స్కాంలో ఆ రాష్ట్ర ఖజానాకు వాటిల్లిన 195.33 కోట్ల రూపాయల నష్టం గురించి ఆరా తీసేందుకు కారుమూరిని ఈడీ అధికారులు రెండు రోజుల పాటు విచారించనున్నారు. మంగళవారం సాయంత్రం వరకు ఆయనను విచారించిన తరువాత ఇడి అధికారులు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో కారుమూరి కుమారుడు సునీల్ రెడ్డితో పాటు మరికొందరిని కూడా ఇడి అరెస్టు చేయడం తెలిసిందే. ఈ కేసును ఓవైపు ఎపి పోలీసులు విచారిస్తుండగా మనీలాండరింగ్ కోణంలో ఇడి వేరుగా విచారిస్తోంది.

# ఎర్రవల్లిలో క్షేత్రస్థాయిలో భూసర్వే

## 80 మంది రైతుల భూముల పరిశీలన

## మరో 60 మంది రైతులకు నోటీసుల జారీ

**మర్కుక్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ శివారులోని 325 సర్వే నెంబర్ భూముల వ్యవహారంలో రెవెన్యూ అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. ఈ సర్వే నెంబర్‌లోని భూములకు సంబంధించిన 80 మంది రైతులకు శనివారం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా సోమవారం ఆ రైతుల భూముల్లో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. అలాగే గ్రామానికి చెందిన మరో 60 మంది రైతులకు అధికారులు నోటీసులు జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

దీంతో ఇప్పటి వరకు నోటీసులు అందుకున్న రైతుల సంఖ్య మరింత పెరిగింది. ఆయా భూములకు సంబంధించిన రికార్డులు, హక్కులు, హద్దులు తదితర అంశాలను పరిశీలించే ప్రక్రియలో భాగంగానే నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. 325 సర్వే నెంబర్‌లో దశల వారీగా భూ సర్వే కొనసాగిస్తున్నారు. ఇప్పటికే రికార్డుల పరిశీలన చేపట్టడంతో పాటు క్షేత్రస్థాయిలో భూముల కొలతలు నిర్వహించారు.

నోటీసులు జారీచేసిన భూముల వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత 325 సర్వే నెంబర్ పరిధిలోని భూములకు సంబంధించి హద్దులు, విస్తీర్ణం, రికార్డుల్లో నమోదైన వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని, సర్వే నోటీసులకు సంబంధించి పూర్తి



నోటీసులు అందుకున్న మహిళా రైతులతో మాట్లాడుతున్న సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్య నాయక్

వివరాలను రెవెన్యూ అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## నిమజ్జనం సమస్యను పరిష్కరించాల్సిన సర్కారు

# భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల అరెస్టు దుర్మార్గం


## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పెంచాలని డిమాండ్ చేస్తున్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పదాధికారులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గణేశ్ నిమజ్జనానికి సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ సమితి సభ్యులను అరెస్టు చేయడం దుర్గార్గం అన్నారు. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణ మొదలుకుని నిమజ్జనం వరకు క్రమశిక్షణతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయడంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి 47 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తోందని, ప్రభుత్వానికి, పోలీసులకు, వివిధ శాఖలకు సహకరిస్తూ.. లక్షలాది మంది భక్తులు పాల్గొనే నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పనిచేస్తుందన్నారు. ఈసారి కూడా నగరవ్యాప్తంగా దాదాపు 1,40,000 గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. సెప్టెంబర్ 25న జరిగే ప్రధాన నిమజ్జనోత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఇంత భారీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వం చాలా ముందుగానే స్పష్టత ఇవ్వాల్సి ఉండగా, ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనానికి సంబంధించిన అంశాన్ని గణేశ్ ఉత్సవ సమితి ముందుగానే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం సరైన సమయంలో చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపడంలో విఫలమైందన్నారు. న్యాయపరమైన అంశాలు ఉన్నప్పుడు వాటిని ముందుగానే పరిశీలించి, చట్టపరిధిలో ఏం చేయవచ్చో నిర్ణయించి, ఉత్సవ సమితితో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కానీ నిమజ్జనోత్సవానికి కొద్ది రోజుల ముందు ఆంక్షలు విధించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. పెద్ద సంఖ్యలో, భారీ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, ప్రభుత్వం భక్తుల మనోభావాలను గౌరవించా లన్నారు. ఉత్సవ సమితితో ఘర్షణకు దిగడం, అరెస్టులతో సమస్యను అణచి వేయాలని చూడడం సరైన విధానం కాదు.

# హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లో హారీశ్‌రావుకు ఫామ్‌హౌస్

## రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** హారీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడే అధికార దుర్వి నియోగం చేస్తూ హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లో ఫామ్ హౌస్ కట్టుకు న్నారని రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆరోపించారు. సోమవారం రైతు వ్యవసాయ కమిషన్ మెంబర్ భవాని రెడ్డి, అధికార ప్రతినిధి రవళిరెడ్డి కోట్ల శ్రీనివాస్, భాస్కర్‌లో కలిసి గాంధీభవన్‌లో కోదండరెడ్డి మాట్లాడూ కెటిఆర్ మంత్రిగా ఉన్నప్పుడే పుల్కాపూర్ నాలా నుంచి వర్షం నీరు గండిపేటకు వెళ్లే నాలా కుదించి అక్కడ ఫామ్ హౌస్ కట్టుకున్నారనీ విమర్శించారు. చట్టాలను అతిక్రమించి అడ్డగోలుగా దోచుకున్నారనీ ఆవేదన చెందారు. జన్వాడ లోప్రదీప్ రెడ్డి అనే వ్యక్తి కెటిఆర్ మిత్రులని అన్నారు. పేదలకు ఒక రకమైన చట్టాలు కెటిఆర్, హారీశ్‌రావులకు ఒక రకమైన చట్టాలు ఉంటాయా అని ఆయన ప్రశ్నిం చారు. ఇదీ అక్రమాలు కాదా అని అన్నారు. తెలంగాణ అనే అంశాన్ని సెంటిమెంటును అడ్డం పెట్టుకొని వేల కోట్లు దోచుకున్నారని ఆయన చెప్పారు. తెలంగాణ సోనియాగాంధీ ఇస్తే పదేళ్ల కెసిఆర్ అధికారంలో ఉండి తెలంగాణ సొమ్ము దోచుకున్నారని ఆవేదన చెందారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలు ఆస్తులు, ప్రాణాలు, జీవి తాలు త్యాగం చేస్తే కెసిఆర్ కుటుంబం అడ్డ గోలుగా దోచుకున్నారని అన్నారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, ధరణి పేరుతో దోచుకున్నారనీ ఆరోపిం చారు. ధరణి దోపిడీని





గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న రైతు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి.

అడ్డుకుంటామని పిసిసి అధ్యక్షులుగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడే ప్రకటించారనీ గుర్తుచేశారు. ధరణిని అప్పుడే బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామనీ అన్నారు. ఇప్పుడు పేదలకు న్యాయం చేస్తూ దోపిడీ దారులను అడ్డు కుంటున్నామనీ అన్నారు. భూ భారతిని అప్రతిష్ట పాలు చేయడానికి కెటిఆర్ హరీష్ రావు లు కుటిల ప్రయత్నాలు చేసారనీ ఆరోపించారు. రేవంత్ రెడ్డి భూముల విషయంలో అసెంబ్లీ లో చేసిన ప్రసంగం చారిత్రాత్మక ప్రసంగం అని కొనియాడారు. జన్వాడలో కెటిఆర్ ఫామ్ హౌస్ పై రేవంత్ రెడ్డి పరిశీలనకు వెళితే ఆయనపై కేసు పెట్టి జైల్లో వేశారనీ గుర్తుచేశారు. మరినిప్పుడు అది మీ భార్య పేరు మీద ఉన్నది కదా ఏమంటారనీ ఆయన నిలదీశారు.

# బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతామధు, నవీన్‌రెడ్డికి హైకోర్టు నోటీసులు

## స్పీకర్‌ను దూషించిన కేసు..

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కులం పేరుతో దూషించిన కేసులో బిఆర్‌ఎస్ ఎంఎల్ సిలు తాత మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు సోమవారం నాడు నోటీసులు జారీ చేసింది. ఈ నెల ఏడవ తేదీన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు నల్ల చొక్కాలు ధరించి, వాటిపై నినాదాలు రాసి అసెంబ్లీలోకి వచ్చేందుకు యత్నించడం, దీనిని పోలీసు లు అడ్డుకోవడం, ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ జరగడం తెలిసిందే. ఇది కాస్త పెద్దదిగా మారడంతో తోపులాట జరిగి బిఆర్‌ఎస్ ఎ ంఎల్ఎలు, ఎంఎల్‌సిలపై పోలీసులు కేసులు నమోదు చేయడం వరకు వెళ్లడం విదితమే. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను ఎంఎల్ సిలు తాత మధు, నవీన్ రెడ్డిలు కులం పేరుతో దూషించినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ ఎంఎల్‌ఎలతో పాటు ప్రత్యక్ష సాక్షులుగా వు న్న పోలీసుల ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో వీరిపై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదయ్యింది. ఈ కేసులో పోలీసులు తమను అరెస్టు చేయకుండా వీరిద్దరు నాంపల్లి కోర్టు నుంచి స్టే పొందారు. అయితే ఈ స్టేను వెంటనే తొలగించాలని పోలీసులు హైకోర్టులో పి టిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం నాడు వాదనలు కొనసాగాయి. పోలీసుల తరపున వాదనలు వినిపించిన న్యాయవాది రాజ్యాంగ ప దవిలో వున్న స్పీకర్‌ను కూలం పేరుతో దూషించడంతో పాటు అసభ్య పదాజాలం వాడారని హైకోర్టుకు తెలిపారు. ఇదే సమయంలో వీరు విధి నిర్వహణలో వున్న పోలీసుల పైనా దాడులు చేశారని ఆయన తెలిపారు. దీనిపై విచారించిన హైకోర్టు పోలీసుల వాదనలపై వెంటనే కౌంటరు దాఖలు చేయాలని తాత మధు, నవీన్ రెడ్డిలకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది.


# యుపిఎస్సీ పరీక్షల ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

## ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రాహుల్

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** కేంద్రం నిర్వహించే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ పరీక్ష 2027లో ప్రవేశం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వాలని భద్రాచలం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రకటించింది. యూపీఎస్సీ ప్రవేశం కోసం నిర్వహించే ఎనిమిది నెలల రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ ప్రోగ్రామ్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, మానసహిల్స్‌లో ఉన్న ఎస్టీల కోసం ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో, యూపీఎస్సీ ప్రిలిమినరీ, మెయిన్ మరియు పర్సనాలిటీ టెస్టుల కోసం ఎనిమిది నెలల పాటు లేదా ప్రిలిమినరీ పరీక్ష జరిగే వరకు, ఏది ముందు అయితే అది వరకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్, మార్గదర్శకత్వం అందించబడుతుందని తెఇపారు. దరఖాస్తులను ఈ నెల 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. హాల్ టిక్కెట్లను ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని వివరించారు. స్క్రీనింగ్ పరీక్ష ఇదే నెల 27న జరుగుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగా ఉదయం 9 నుండి 11:30 వరకు జనరల్ స్టడీస్ పేపర్, మధ్యాహ్నం 2:30 నుండి 4:30 వరకు సిఎస్టీ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అక్టోబర్ 1న సర్టిఫికేట్ వెరిఫికేషన్ మరియు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు, తుది ఫలితాలను అక్టోబర్ 2న ప్రకటిస్తారు మరియు అక్టోబర్ 5 నుండి తరగతులు ప్రారంభమవుతాయి. ఆగష్టు 1, 2026 నాటికి అభ్యర్థులకు కనీసం 21 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గరిష్ట వయస్సు 32 సంవత్సరాలు, దివ్యాంగులకు 35 సంవత్సరాలు ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ లేదా దానికి సమానమైన అర్హతను కలిగి ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలకు మించకూడదు. మొత్తం 100 సీట్లు అందుబాటులో ఉన్నాయి, వీటిలో ఎస్టీలకు 75, ఎస్సీలకు 15, బీసీ అభ్యర్థులకు 10 సీట్లు ఉన్నాయి. ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యేందుకు సంక్షేమ శాఖ ఉచిత భోజనం, వసతి, అబ్బాయిలకు నెలకు రూ. 1,000, అమ్మాయిలకు రూ. 1,250 పాకెట్ మనీ, రవాణాభత్యంగా రూ. 300 అందిస్తుందని ఆయన తెలిపారు.

# ట్యాంక్‌బండ్ హుస్సేన్‌సాగర్‌లోనే వినాయక నిమజ్జనాలు జరుపుకుంటాం

## భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి నేతలు



నిరసన తెలుపుతున్న భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ట్యాంక్ బండ్‌పై హుస్సేన్‌సాగర్‌లోనే వినాయక నిమజ్జ నాలు జరిపితీరుతామని భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి నేతలు స్పష్టం చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్‌పైకి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారు లకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటుచేసిన బారికేడ్లు, పోస్టర్లు చించివేశారు. పోలీసులు ఉత్సవ సమితి నేతలను అడ్డుకునేందుకు ప్రయ త్నించగా, ఇరువురి మధ్య వాగ్వివాదం, తోపులాట జరగటంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసు కుంది. ఉత్సవ సమితి నేతలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై భైఠాయిం చటంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డుపై భైఠాయిం చిన నేతలను పోలీసులు అరెస్ట్ చేసి, వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్, ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు అలే భాస్కర్, యమన్‌సింగ్‌లు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వినా యక నిమజ్జనాలను ట్యాంక్ బండ్‌పైనున్న హుస్సేన్‌సాగర్‌లో చేయ టం సాంప్రదాయంగా వస్తోందని, జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు చేయరాదని, బారికేడ్లు పెట్టి, పోస్టర్లు అతికించి, హిందూ పండగలకు విఘాతం కలిగిస్తూ, హిందువుల మనోభావాలు దెబ్బతీస్తు న్నారని ఆరోపించారు.

జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూడా వినాయక విగ్రహాలను ఇక్కడే నిమజ్జనం చేస్తూ ఉంటారని, కానీ ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఏది ఏమైనా, వినాయకనిమజ్జనాలు ఇక్కడే జరిపి తీరుతామని, అడ్డుకోవాలని చూస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. యధావిధిగా గణేష్ నిమజ్జనాలకు వినాయక్‌సాగర్‌పై క్రేన్‌లు ఏర్పా టుచేసి, అన్ని సౌకర్యాలు కల్పించి, నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నేతలు మహేందర్, మద్దూరి శివాజీ, ఎంసీ మహేందర్‌బాబు, శక్తిసింగ్, అనిల్, రాంరెడ్డి, సుదాన్షు తదితరులు పాల్గొన్నారు.

# కడెం గేట్లు ఎప్పుడైనా ఎత్తేఅవకాశం ఉంది అప్రమత్తంగా ఉండండి:అధికారులు

**హైదరాబాద్,సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో3.5టిఎంసిలనీరు రావడంతో నిండి నిండుకుండలా ఉంది. దీంతో ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. నదీ పరివాహక ప్రాంతంలోకి కడెం ప్రాజెక్టుదిగువన పశువులు, గొర్రెలు తీసుకెళ్లకుండా కాపరులు,రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# పోటీ పరీక్షల సెలబస్‌లో ఎలాంటి మార్పులు లేవు: టిజిపిఎస్‌సి

**హైదరాబాద్,సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు సంబంధించి సెలబస్‌లో ఏలాంటి మార్పులు చేయలేదని కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల సిలబస్ మార్పుపై జరుగుతున్న ప్రచారంలో నిజంలేదని పేర్కొంది. తాము ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని స్పష్టం చేసింది. సిలబస్ మార్పు ప్రచారంతో ఆందోళన చెందుతున్న అభ్యర్థుల నుంచి వచ్చిన వినతులు, సందేహాలపై స్పందించిన కమిషన్ పోటీ పరీక్షల సిలబస్‌లో పెద్దగా ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే ఏడాది ముందే తెలియజేస్తామని పేర్కొంది.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం
కలెక్టరేట్: మహబూబ్‌నగర్
ఫారం - VII,
రూఢీ ప్రకటన
(2013 యొక్క చట్టం-30 యొక్క 19(1) సెక్షన్ మరియు నిబంధన-25 యొక్క ఉప నిబంధన(1) చూడండి)

No. Rev/G1/LAG/0017/2026-G-Section తేది: 10.09.2026

ఇది ఇలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ వారి మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం యొక్క వెలుగోముల గ్రామంలోని ఎక.8.18 గుంటలు మొత్తం విస్తీర్ణం, ప్రజా ప్రయోజనం నిమిత్తం మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం క్రింద డిస్ట్రిబ్యూటరీ 46 ML 2 కెనాల్ త్రవ్వకానికి ఆ భూమి అవసరమైందని భావించారు.

కావున మహబూబ్‌నగర్ జిల్లా యొక్క మిడ్జిల్ మండలం వెలుగోముల-గ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద ప్రామాణిక కొలత యొక్క ఎక.8.18 గుంటలు ఎక్కువ లేదా తక్కువగా భూమి కొలతకు రూఢీ ప్రకటన చేయబడింది. దాని సవివర వివరణ ఈ క్రింది విధంగా:

గ్రామం : వెలుగోముల మండలం : మిడ్జిల్ జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర. సం. | సర్వే నెం. | మెట్ట/ ఐ.డి/ తరి | భూమి రకం | సేకరణకింద ప్రతిపాదిత ఏరియా (ఎ.లలో) ఎక.గుం. | ఆస్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | కట్ట డాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 211 | మెట్ట | పట్టా | 0.24 | 1) బుద్దారం శ్రీశైలం తండ్రి గెట్టె బీరయ్య 2) బుద్దారం నాగయ్య తండ్రి గెట్టె బీరయ్య 3) బుద్దారం మల్లయ్య తండ్రి గెట్టె బీరయ్య | - | - | - | - | - | - |
| 2 | 215 | మెట్ట | పట్టా | 0.22 | 1) లక్ష్మీనారాయణ తండ్రి పెంటయ్యగౌడ్ 2) సత్యనారాయణ గౌడ్ తండ్రి పెంటయ్య గౌడ్ 3) శివ శంకర్ గౌడ్ తండ్రి పెంటయ్య గౌడ్ | - | - | - | - | - | - |
| 3 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.16 | పెంటయ్య గౌడ్ తండ్రి సత్యనారాయణ | - | - | - | - | - | - |
| 4 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 1.00 | బాలిలి పర్వతం భర్త ఎల్లయ్య | - | - | - | - | - | - |
| 5 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.18 | బాలిలి నర్సమ్మ భర్త ఖాదర్ (బుచ్చయ్య) | - | - | - | - | - | - |
| 6 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 1.07 | 1) పోలేపల్లి నర్సింహులుగౌడ్ తండ్రి నాగయ్యగౌడ్ 2) పోలేపల్లి రమేష్ గౌడ్ తండ్రి నాగయ్యగౌడ్ | - | - | - | - | - | - |
| 7 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.24 | బుద్దారం నాగయ్య తండ్రి బి.కిష్టయ్య | - | - | - | - | - | - |
| 8 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.24 | మల్ల బాలయ్య తండ్రి పెద్దబాల వెన్నయ్య | - | - | - | - | - | - |
| 9 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.33 | వీరారెడ్డి చిన్నజంగారెడ్డి తండ్రి చంద్రారెడ్డి | - | - | - | - | - | - |
| 10 | 217 | మెట్ట | ప్రభుత్వ భూమి | 0.16 | 1) రజియా భర్త బబ్బర్ 2) జహంగీర్ తండ్రి బదేశ్ 3) యాకుబ్ తండ్రి షేక్ ఇమామ్ 4) జహంగీర్ తండ్రి బదేశ్ | - | - | - | - | - | - |
| 11 | 24 | మెట్ట | పట్టా | 1.00 | పట్టాదారులు : 1) వేముల రేణమ్మ భర్త వేముల శ్రీశైలం 2) యన్నం రవి కుమార్‌రెడ్డి తండ్రి మధ్యంరెడ్డి 3) బుద్దారం మల్లయ్య తండ్రి భగవత్ 4) బిక్కొండ రాములమ్మ భర్త బిక్కొండ బుచ్చయ్య 5) నాగేలు మల్లికార్జున్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి 6) వేష్ణ చిన్న లక్ష్మయ్య తండ్రి ముత్తయ్య 7) బుద్దారం నాగమ్మ భర్త మాసయ్య 8) మదన్ మోహన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి చింతల సంజీవ తండ్రి యాదయ్య 9) ఠాకూర్ శివసింగ్ తండ్రి ఠాకూర్ వీరా సింగ్ 10) యెన్నెం యశ్వంత్ కుమార్‌రెడ్డి తండ్రి రామ్‌రెడ్డి స్వాధీన కర్త 1) వెంకటయ్య తండ్రి జంగయ్య (0.06) 2) కృష్ణయ్య తండ్రి జంగయ్య (0.06) 3) బాలస్వామి తండ్రి అల్లం లక్ష్మయ్య (0.20) 4) అల్లంవెన్నయ్య తండ్రి లక్ష్మయ్య (0.08) | - | - | - | - | - | - |
| 12 | 27 | మెట్ట | పట్టా | 0.34 | చింతల మల్లమ్మ భర్త యాదయ్య | - | - | - | - | - | - |
| | మొత్తం : | | | 8.18 | | | | | | | |

2013 నాటి చట్టం నం. 30లోని సెక్షన్ 15 ప్రకారం, సంబంధిత వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ జరిపిన తర్వాత ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలకూ పునరావాసం కల్పించాల్సిన అవసరం లేదు.

భూసేకరణ చేపట్టబడిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనియెడల స్వీకరించబడవు.

ఈ భూమికి సంబంధించిన ప్లాన్‌ను మహబూబ్‌నగర్‌లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, యూనిట్-II, నీటిపారుదల ప్రాజెక్ట్ కార్యాలయంలో ఏ పని దినంలోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R యూనిట్-II ఇరిగేషన్ (ప్రాజెక్ట్స్), మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్
సం/-. కుమ్మగుప్తా IAS జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO.NO: 895/LA/PP/Advt/Pub/2026-27

మానవత్వం విజయం పొందాలంటే, సాత్వికశక్తి అవసరం.

- బాబా సాహెబ్

# జారుకున్న నైరుతి!

రుతుపవనాల తిరోగమనం దేశాన్ని మరింత అల్లకల్లోలం చేసే పరిస్థితి కనపడుతోందని భారత వాతావరణ సంస్థ ప్రకటించేసరికి ప్రభుత్వాలు 'ఎల్‌నినో' విషయంలో ఏం చేద్దాం? అని సీరియస్‌గా ఆలోచించడం మొదలెట్టాయి. దేశవ్యాప్తంగా ఇప్పటికే 15 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. ఎల్‌నినో ప్రభావంతోచాలా నెలల్లో తగిన వర్షాలు కురువలేదు. 'నైరుతి' బైబై చెప్పిందంటే అసలు వర్షాలు పడవని కాదు. అవసరమైనా అవసరం లేకపోయినా ఎవరి పని వారు చేయాలి.వరుణ దేవుడు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కుంభవృష్టి వానలు కురిపించేస్తున్నాడు. నీళ్లల్లోకి గణేశ్ విగ్రహాలను జారవిడవనక్కర్లేకుండానే తడిసిపోతున్నాయి. నిమజ్జనం జరిగిపోతోంది. పశ్చిమ రాజస్థాన్ నుంచి శనివారం 'నైరుతి' రుతుపవన నిష్క్రమణ ప్రారంభమైపోయింది. లోటు వర్షపాతం ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఈ సీజన్ మొత్తంలో దేశవ్యాప్తంగా సగటున 817.2 మిల్లీమీటర్ల వర్షం కురవాలి. కానీ కేవలం 695-6 మి.మీ వర్షపాతమే నమోదైంది. దక్షిణ భారతంలో బాగా లోటు కనపడుతోంది. ఈ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 28 శాతం మేరకు కనపడుతోంది. రుతుపవనాల సమయంలో వానలు సరైన విధంగా తగినంతగా కురవలేదు. దాంతో ఖరీఫ్ పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడి ఆహార ఉత్పత్తులు తగ్గుతాయని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను బేరీజు చేసుకుని 'ఎల్‌నినోను తట్టుకోవడమెలా? అంటూ తెలుగు రాష్ట్రాలు విశ్లేషించుకుని ప్రణాళికలు రూపొందించుకుంటోంది. ఎల్‌నినో తట్టుకుని రైతాంగానికి సాయం చేయడానికి కనీసం రూ. 20వేల కోట్లు కావాలంటూ తెలంగాణ సర్కారు కేంద్రానికి అభ్యర్థనలు పంపింది. ఎవరేం చెప్పినా తెలుగు రాష్ట్రాలు కరువు ఛాయల్ని మాపుకునే పరిస్థితుల్లో పడ్డాయి. గత పదిహేడేళ్లలో ఎన్నడూ లేనంత కరువు పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటికే కాక తాగు నీటికి కూడా ఇబ్బందులు ఏర్పడినట్లు ఇప్పటికే శాస్త్రజ్ఞులు, ప్రభుత్వాలు గుర్తించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 43 శాతం, కర్ణాటకలో 31 శాతం, కేరళలో 28 శాతం, తమిళనాడు, తెలంగాణలో 22 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అన్ని రాష్ట్రాల కన్నా అధికగా పంజాబ్‌లో అత్యధికంగా 39 శాతం లోటు వర్షపాతం రికార్డు అయింది. తూర్పు ఈశాన్య ప్రాంతా ల్లో సగటు కన్నా 26 శాతం తక్కువ వర్షపాతం 2009 లో దేశం యావత్తూ వర్షపాతం లెక్కలు గమనిస్తే 18 శాతం లోటు నమోదైంది. ఆ తర్వాత ఇప్పుడే అంత తక్కువ వర్షపాతం మరోసారి ఎదురు చూడాల్సిన పరి స్థితులు దాపురించాయి. కొత్తగా ఏర్పడే అల్పపీడనాల వల్ల భారీ వర్షాలు వచ్చినా లోటు భర్తీ కాగలిగే పరిస్థితి లేదు. పసిఫిక్ మహా సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగిపోతున్నాయి. రానున్న కాలంలో ఎల్‌నినో, సూపర్ ఎల్‌నినోగా మారుతోంది. ప్రచండ వాయువేగంతో భారతీయుల్ని కరువు ముప్పు చుట్టబెడుతోంది. దేశంలో అడవుల దగ్ధం, పగడపుదిబ్బలు నశించడం, వర్షపాతలోటు వలన కలిగే ఆహారోత్పత్తులు దిగుబడుల తగ్గుదల రైతుల్ని తీవ్రవిషాదంలో ముంచెత్తుతుంది. దేశంలో మత్స్యకారులు, గొర్రెల కాపరులకు జీవనోపాధికి ఎసరు కలుగుతుంది. ఎల్‌నినో పర్యావరణంపై ప్రభావం చూపడంతో జంతువుల ప్రవర్తనలో మార్పులు, మొక్కలలో ఉత్పత్తులు ఆలస్యంకావడం, వంటి పరిణామాలతో జీవవైవిధ్యం దెబ్బతింటుంది కూడా. తెలంగాణలో వర్షాలు పడుతున్నట్లు కనిపించినా ఇవి పంటల సాగుకు ఏ మేరకు ఉపయోగపడుతుందన్నదీ అనుమానం. వర్షానికీ వర్షానికీ మధ్య సుదీర్ఘ అంతరాలు కారణంగా పంటలు మాడిపోయాయి. వర్షాధారం పంటలు పత్తి, వేరుశనగ వంటి వాటిపై దుష్ప్రభావాలు పడి ఉత్పత్తి ఆశాజనకంగా ఉండే పరిస్థితుల్లేవు.ప్రత్యామ్నాయ ప్రణాళికలు తయారు చేసుకున్నా అవి కొంతవరకే రైతును గట్టెక్కిస్తారు. పంటల దిగుబడులు తగ్గితే వాటి ధరవరలను అదుపులో ఉంచగలిగే పరిస్థితి కానరాదు. దీర్ఘకాలిక నీటి సంరక్షణ పద్ధతులను పాటించడం అవసరం. త్వరలో సంభవించనున్న సూపర్ ఎల్నినో మన దేశ సహజ వాతావరణ వ్యవస్థపై చూపే తీవ్ర ప్రభావాలను నమోదు చేయడంతో పాటు దాని దుష్పరిణామాలపైపరిశోధనల విస్తృతిని పెంచాలని తోటి పరిశోధకులకు 180 మందికి పైగా శాస్త్రవేత్తలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రూపొందించిన ఓ లేఖపై సంతకాలు చేసిన వారిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ సైంటిస్ట్ రాకీ మాథ్యూకోల్ తదితరులు ఉన్నారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరిగిపోవడంతో ఎల్ నినో ఏర్పడిన విషయం తెలిసిందే. ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో దీని దుష్పరిణామాలను ఎదుర్కోవడానికి శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని ఈ లేఖ వివరించింది. మన దేశ వాతావరణంలో సంభవించే మార్పులతోపాటు ప్రపంచవ్యాప్త పరిణామాలను, సామాజిక వ్యవస్థలతో ముడిపడిన అంశాలను నిశితంగా గమనించాలని కోరింది. కార్చిచ్చులు పెరిగిపోవడం, వృక్షసంపద హరించుకోవడం, భారతీయ రైతులను తీవ్రంగానష్టపరిచే కరువులు ఏర్పడడం,మత్స్యకారులు, పశుపోషకుల ఉపాధి దెబ్బతినడం, పండ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోవడం, జంతువుల ప్రవర్తనలో మార్పులు వంటి ఎన్నో దుష్పరిణామాలు జరిగే అవకాశం ఉందని, వీటన్నింటినీ నిశితంగా పరిశీలించి అధ్యయనం చేయగలిగితతేనే మానవాళి ఉనికి సురక్షితంగా ఉంటుందని వారి మనవి.



వ్యర్థమైన మాటలు వేలాదిగా చెప్పడం కన్నా శాంతిని, కాంతిని ప్రసాదించే ప్రయోజనకరమైన మాట ఒక్కటి చాలు.

గౌతమ బుద్ధుడు



యుద్ధంలో విజయలక్ష్మి ఒక పక్షాన్నే వరిస్తుంది. కాని శాంతిమాత ఇరుపక్షాల వారిని గెలిపిస్తుంది.

ఎమర్సన్

# ప్రజావాక్కు



### ప్రలోభాలకు లొంగకుండా తిప్పికొట్టాలి

ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రోజురోజుకూ పొలిటికల్ హీట్ పెరుగుతుంది. ఈఏడాది అక్టోబర్‌లోనే ఎన్నికలునిర్వహించేందుకుప్రభుత్వం సన్నాహాలుచేస్తుందనే వార్తలతోఅధికార, ప్రతిపక్షపార్టీల నాయకులు క్షేత్ర స్థాయిలో పార్టీలు వ్యూహ ప్రతి వ్యూహాలపై దృష్టి సారించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే నిజమైన పాలకులుగా విరాజిల్లాలంటే తమ ఓటును నిజాయితీపరులు, సమర్థులైన నాయకులకు వేయాలి. ప్రస్తుతం రాజకీయాలు వ్యాపారపరమైన తరుణంలో నోట్లతో, మద్యంతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కొన్ని పక్షాలు తీవ్ర ప్రయత్నాలు చేయవచ్చు. కావున ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా తిప్పికొట్టాలి.

- దాసం వెంకటరెడ్డి,బెంగుళూరు

### మహిళా బిల్లు

గతంలో ఒకసారి బిజెపి ప్రభుత్వం లోక్‌సభలో మహిళా బిల్లు ప్రవేశపెట్టింది. అదికాస్తా వీగిపోవడంతో అందుకు కారణం విపక్ష. మహిళలంటే ద్వేషం ఉన్నవారు అందకే బిల్‌పాస్ కాకుండా అడ్డుకున్నారు. అదే పనిగా ప్రచారం చేశారు. అబ్బే అలాంటిదేమీ లేదని మేం డీ లిమిటేషన్‌కి మాత్రమే వ్యతిరేకులం కాని మహిళా బిల్లుకి కాదని విడిగ మహిళా బిల్లు ప్రవేశపెడితే ఖచ్చితంగా మహిళా బిల్లుకు మద్దతు ఇస్తామని విపక్ష నేతలు చెప్పుకున్నారు. ఇప్పటికే వారు అదే మాట మీద నిలబడ్డారు. అయితే తమ సంఖ్యాబలం పెంచుకునే ఎలాగైనా బిల్లులను ఒకేసారి పాస్ చేసుకోవాలని బిజెపి ప్రయత్నిస్తోంది. మహిళా బిల్లు విడిగా పెడితే బిజెపికి జరిగే నష్టం ఏంటో అర్థంకావటం లేదు.

- రాశి, హైదరాబాద్

### యువత పుస్తక పఠనం చేయాలి

నేటి యువత గంటల తరబడి సామాజిక మాధ్యమాలు అయిన వాట్సప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో గంటలతరబడి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. కనీసం మెదడుకు కొంచం అయిన విరామం ఇవ్వకుండా ఆలోచన చేయకుండా నిరంతరం చరవాణిలో నిమగ్నమవుతూ ఏకాగ్రతను దెబ్బతీసుకుంటున్నారు. యువత మహనీయుల పుస్తకాలు చదవాలి. అవగాహన పెంచుకోవాలి. ఎప్పుడు అభివృద్ధి చెందుతూ ఉండాలి. యువత అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. దీనిని అందరూ గమనించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### విద్యావ్యవస్థలో సవాళ్లు

ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం, పాఠశాల సమాచార నివేదిక (యుడైస్+) నిబంధనల పేరుతో ఉపాధ్యాయులపై పెరుగుతున్న పరిపాలనాపరమైన నిబంధనలు విద్యావ్యవస్థ లోసవాలుగా మారుతున్నాయి.పాఠ్యాంశాల బోధన, పాఠాల ప్రణాళికల రూపకల్పన, జవాబు పత్రాల మూల్యాంకనం, విద్యార్థుల ప్రగతి పర్యవేక్షణ వంటి ప్రాథమిక బాధ్యతలతో ఉపాధ్యాయులు నిరంతరం బిజీగా ఉంటారు. దీనికితోడు అదనపు కాగితపు పని, డిజిటల్ డేటా నమోదు, నివేదికల సమర్పణ వంటి బాధ్యతలు వారిబోధనా సమయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రతి సమాచారాన్ని నిర్ణీత గడువులోగా నమోదు చేయాలనే ఒత్తిడి వల్ల ఉపాధ్యాయులు తరగతి గదిలోవిద్యార్థులకు కేటాయించాల్సి నసమయాన్ని కోల్పోతున్నారు.ఆమార్టీఈ,యుడైస్+వంటి వ్యవస్థల ముఖ్య ఉద్దేశం విద్యావ్యవస్థ నాణ్యతను మెరుగుపరచడమే అయినప్పటికీ, ఆచరణలో ఇవి ఉపాధ్యాయులకు అదనపు భారం.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### మౌనమేలనోయి..

దేశ ప్రధాని విదేశాల్లో తిరుగుతు అక్కడి నాయకుల ప్రశంసలు వారిచ్చే పురస్కారాలు, సన్మానాలు, సత్కారాలు అందుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడికి దాసోహమంటున్నారు. అడుగుతున్న ప్రతిపక్ష నేతలకి సమాధానం చెప్పకుండా మౌనం వహిస్తున్నారు. మాకిస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీస్తున్న యువతకు సమాధానం మౌనమే. పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు ఇలా పెంచేస్తున్నారేంటని అడిగే సామాన్య జనాలకి ఆయన సమాధానం చెప్పకుండా మౌనం పాటిస్తున్నారు. రూపాయి విలువ రోజురోజుకి పతనమవుతుంటే పరిష్కారం చెప్పకుండా అదే మౌనం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏ చిన్న తప్పు జరిగినా అరిచిగగ్గోలు పెట్టే మోడీ అయోధ్య రామాలయంలో రూ.200కోట్లకిపైగా మాయమైనా మౌనం వహించారు.

- శాస్త్రి, హైదరాబాద్

### తీరు మారాలి

హోటల్‌లో రుచికరమైన ఆహారం తినాలని అందరికీ ఉంటుంది.కానీ ఆ ఆహారం ఎంతపరిశుభ్రంగా తయారవుతోంది, ఉపయోగించే పదార్థాలు తాజాగా ఉన్నాయా అనే విషయాలను కూడా గమనించాలి. కొన్ని చోట్ల అపరిశుభ్ర వాతావరణంలో, నిల్వ చేసిన పదార్థాలతో ఆహారం తయారవుతోంది.కల్తీ పూర్తిగా తగ్గాలంటే హోటళ్ల, రెస్టారెంట్ల యాజమాన్యాలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# 'మమత'ల దేవిడీలో విధి విన్యాసం!

**గెలుపోటములు దైవాధీనాలైనా మమత విషయానికొస్తే మెజారిటీ సూత్రం ఆధారంగా ఎన్నికల సంఘం నిర్ణయిస్తే అది కూడా సరికొత్త రాజకీయానికి తెరతీస్తుంది. అప్పుడెప్పుడో 1969లో కాంగ్రెస్ చీలిక నాటి సంగతులను గుర్తుకొస్తున్నాయి. ఆనాటి విషయాల నేపథ్యంలోనే నిర్ణయం తీసుకోవడానికి ఎన్నికల సంఘం ఉపక్రమిస్తే, మమతకు మళ్లీ నిరాశే. అయినా రేపొచ్చే తీర్పుకు ఈనాడే ఊహాగానాలు మంచిది కాదను కుంటూ మమత సైతం కాలం గడపాల్సిందే. ఈలోగా ఎన్ని రాజకీయ విన్యాసాలను చూడాల్సి వస్తుందో! ప్రస్తుతం 'ఫుట్ బాల్ ప్లేయర్' గుర్తు గతేడాది పశ్చిమబెంగాల్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ 'మెస్సీ' టోర్నమెంట్ అభాసుపాలై క్రీడాభిమానుల నిరసనలను మమతకు వ్యతిరేకంగా ప్రచారంలోకి తెచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ గుర్తు కూడా మమతను ఎక్కిరిస్తుందేమో చూడాలి.**

వరిగొండ నవీన్ కుమార్

ఓడిగెలిచినా, గెలిచి ఓడినా ఎప్పటికప్పుడు రాజకీయాలు అప్పుడే మధ్యలో ఆట ఆపేందుకు వీలుండదు. వచ్చే ఐదేళ్లూ తన పార్టీ ఉనికిని కాపాడుకు నేందుకు పరిశ్రమించాల్సిందే. శ్రీరామ చంద్రానారాయణా! ఎన్ని కష్టాలు వచ్చాయిరా నాయనా! అనుకుంటూ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తలగోక్కుంటున్నారు. సాధారణ ఎన్నికల్లో చతికిలబడిన వారు, ఏ సన్నటి అవకాశం ఉన్నా ఉప ఎన్నికల వంటివి వచ్చినప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత మీద గెలిచి చట్టసభల్లో దూరచ్చునని ఎదురు చూస్తుంటారు. కానీ మమతకు నమ్మకమైన అభ్యర్థులే దొరకలేదు. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్, రెజీనగర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్న వేళ మమత వ్యూహాలన్నీ బెడిసి కొడుతున్నాయి. ఈ రెండుస్థానాలకూ తృణమూల్ కాంగ్రెస్ తరపున అభ్యర్థులను ప్రకటించారు. కానీ ఇద్దరూ రెండు రకాల వ్యూహాలతో 'దీదీ'ని చావుదెబ్బకొట్టారు. వారి వ్యూహాలను గమనిస్తే ఇక ప్రతివ్యూహానికి దిక్కుమొక్కు ఉండదు. నందిగ్రామ్ అభ్యర్థిని అధికార బిజెపి ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత మనసు మార్చుకొని తన అభ్యర్థిత్వాన్ని విరమించుకున్నట్లు ప్రకటించేశారు. రెజినగర్ అభ్యర్థి మరోలా ప్రవర్తించారు. ఉదయాన్నే మమతకు 'బైబై' చెప్పి కాస్సేపటికే తూచ్ చెప్పేసి మళ్లీ పోటీలో ఉంటానని చెప్పారు. అలా చెప్పి ఇలా మాట మార్చడం వెనుక ఎవరి వ్యూహం ఉంటుందో ఈపాటికి జనానికి అర్థం కాకపోదు. ఇలాంటివి కూడా ఫిరాయింపుల కిందకే వస్తాయి. మమత పరిస్థితి 'శ్లేష్మంలో పడ్డ ఈగ' మాదిరి ఉంది. ఆమె పశ్చిమబెంగాల్ సామ్రాజ్ఞిగా వెలుగొందినంత కాలం 'ఆమె ఆడింది ఆట పాడింది పాట' ఎవరూ కిక్కురుమనేవారుకాదు. చుట్టూ తిరిగిన వారంతా ఆమె అడుగులకు మడుగులొత్తేవారు. ఇప్పుడు ఒక్కరంటే ఒక్క నమ్మకస్తులూ కనబడుటలేదు. కనీసం మాజీ ముఖ్యమంత్రికి దక్కే గౌరవమూ దక్కడం లేదు. రాజకీయాల్లో ఏదీ అసంభవం కాదు. కాలం కర్మం కలిసొస్తే ఒకలా, అవి కలిసి రాకపోతే మరోలా రాజకీయ పార్టీల వ్యవహారాలు ఎంతటివారినైనా 'ఫుట్‌బాల్' ఆడుకుంటాయి. రాజకీయాల్లో తనదైన బాణీలో 'బెబ్బులి పులి'లా అహంకారపు రాజకీయాలు నడిపి ఇప్పుడు ఎటూ తోచక సతమతమవుతున్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వాలకం చూస్తే అయ్యో! అనిపించక మానదు. అన్నీ కలిసి రాకపోతే 'ఓడలు బళ్లు, బళ్లు ఓడలు' అ వుతాయనే జనశృతి ఉండనే ఉంది. దశాబ్దాలుగా ఉవ్వెత్తున ఎగసిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అస్తిత్వ సంక్షోభంలో చిక్కుకుంది. నిన్నమొన్నటి పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఆమెను అధఃపాతాళానికి తొక్కేసాయి. ఎన్నికల్లో ఆమె ఓటమి తర్వాత తృణమూల్ తరపున గెలిచిన శాసనసభ్యులు కొందరు ఆమెకు జెల్లగొట్టి చీలిక వర్గంగా ఏర్పడ్డారు. వేర్వేరు పార్టీలుగా గుర్తించాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.అది తేలేలోగానే రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలొచ్చాయి. ఈసారి ఎవరి ప్రోద్బలంతోనైతేనేమి ఆ రెండు వర్గాలు ముఖాముఖి తలపడనున్నాయి. పార్టీలో ఏర్పడిన చీలికతో కేంద్ర ఎన్నికల సంఘం ఆ రెండు వర్గాలను కట్టడి చేయడం కోసం పార్టీ అధికారిక పేరును 'జోడురా ఘాస్ ఫూల్' చిహ్నాన్ని స్తంభింపచేసింది. అయినా మమతా బెనర్జీ



అదరలేదు. బెదరలేదు. అక్టోబరు అన నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికలో ఉభయ వర్గాలు పోటీలో దిగనుండగా మమతా బెనర్జీకి ఇక్కడా తన పాచిక పారే పరిస్థితి కనబడటం లేదు. ఆమె తన పార్టీ తరపున ఓ టీచర్‌ను బరిలోకి దించారు. ఎందుచేతనో ఆమె ముఖ్యమంత్రి సువేందు రాయ్‌ని కలిసి వచ్చాక తాను పోటీలోంచి ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు కూడాఆమె ప్రస్థానంలో మరో ఆటంకం అడ్డు తగులుతోంది. ఎంతో నమ్మకమని తలచి ఆ రోజున ఎన్నికలలో ఎవరైతే 'బి' ఫారమ్ లిచ్చి గెలిపించారో తీరా గెలిచాక హ్యాండ్ ఇచ్చారు. పోటీగా నిలబడి సతాయిస్తున్నారు. రాజకీయాల్లో తలపడే వారికి ఉత్థానపతనాలు మామూలే. దానికి దడిసేవారు రాజకీయాల్లో ఉండడం దండుగే. అన్నీ తెలిసిన మమత ఉప ఎన్నికల్లో తన పార్టీ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూశారు. కానీ ఈసారి కూడా తనకు అత్యంత సన్నిహితు రాలిగా ఉన్న అభ్యర్థిని సంచితా ప్రధాన్ దే గుడ్ బై చెప్పేసింది. నేపథ్యమేమిటంటే అంతే అధికార బిజెపి పావులు కదిపిందన్న మాట. ఎన్నికల కమిషన్ రూపంలో మమతను తాడే పామై కరచింది. కొంతకాలంగా కాంగ్రెస్ కూటమికి దూరంగా ఉన్న మమతా మళ్లీ ఆ కూటమికి చేరువై తనపంతాన్ని గెలవాలనే ప్రయత్నానికి 'గేట్లు' తీసారు. నందిగ్రామ్ నియోజకవర్గంలో 'కాంగ్రెస్' అభ్యర్థికి వత్తాసు పలికారు. ఇలా మద్దతు పలికారోలేదో రాజకీయం బుసలు కొట్టింది. కాంగ్రెస్ అభ్యర్థి మీద ఉన్న పాత కేసులు దుమ్ముదులుపుకుని బయటకొచ్చాయి. ఇంక మమతను చావుదెబ్బ కొట్టాలని ముఖ్యమంత్రి సువేందు రాయ్ వర్గం నిర్ణయించుకున్నట్లుంది. రాజకీయాల్లో ఇలాంటి నాటకీయ పరిణామాలన్నీ మామూలే. రాజకీయాల్లో ఉన్నవారికే దాని లోతు తెలుస్తుంది. అందుకే సర్వవేళల సకలావస్థలందు రాజకీయం రాజ్యమేలుతుందని పశ్చిమబెంగాల్ పరిణామాలే తేటతెల్లం చేస్తున్నాయి. తుదినిర్ణయం తీసుకునేలోగా తృణమూల్ కాంగ్రెస్ పేరు, ఎన్నికలగుర్తు రెండుపూల గుర్తును స్తంభింపచేస్తూ ఆ రెండు వర్గాలు వేర్వేరు పార్టీల పేరు, స్వతంత్ర గుర్తుతో పోటీ చేయవచ్చునని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఏదైనా పశ్చిమబెంగాల్‌లో తన పార్టీని బలోపేతం చేసుకోవడం మమతా బెనర్జీకి కత్తిమీదసాము వంటిదే. ఇక్కడ విచిత్రంగా మమతా 'ఫుట్ బాల్ ప్లేయర్ గుర్తు అపూర్వ రాయ్ చీలికవర్గానికి 'ఎన్వొలోప్' గుర్తును పొందారు. ఈగుర్తులు ఏవర్గానికి విజయసంకేతం కాగలదో కాలమే నిర్ణయిస్తుంది. తన పార్టీ పేరును స్తంభింప చేయడంపై మమతా ఇసిపై ఆగ్రహంగా ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ అంశంపై ఇసి నిర్ణయాన్ని తప్పుపట్టారు. పార్టీలను చీల్చడం, ఎన్నికల గుర్తును లాక్కోవడంలో బిజెపి ఇసిలకు అలవాటైపోయిందని వ్యాఖ్యానించారు. గతపదేళ్లలో శివసేన, ఎన్సీపి, తాజాగా తృణమూల్ పార్టీల విషయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయాలు అధికార బిజెపి రాజకీయాలకు బలం చేకూర్చడానికేనని విమర్శించడం చూస్తే అందులో నిజం ఉందని ఎవరికైనా అనిపించకమానదు. తనదైన ధోరణిలో ఓటు చోరీ, సర్కారు చోరీ, పార్టీ చోరీ అని ఎద్దేవా మొదలెట్టారు. గెలుపోటములు దైవాధీనాలైనా మమత విషయానికొస్తే మెజారిటీ సూత్రం ఆధారంగా ఎన్నికల సంఘం నిర్ణయిస్తే అది కూడా సరికొత్త రాజకీయానికి తెరతీస్తుంది. అప్పుడెప్పుడో 1969లో కాంగ్రెస్ చీలిక నాటి సంగతులను గుర్తుకొస్తున్నాయి. ఆనాటి విషయాల నేపథ్యంలోనే నిర్ణయం తీసుకోవడానికి ఎన్నికల సంఘం ఉపక్రమిస్తే, మమతకు మళ్లీ నిరాశే. అయినా రేపొచ్చే తీర్పుకు ఈనాడే ఊహాగానాలు మంచిది కాదను కుంటూ మమత సైతం కాలం గడపాల్సిందే. ఈలోగా ఎన్ని రాజకీయ విన్యాసాలను చూడాల్సి వస్తుందో! ప్రస్తుతం 'ఫుట్ బాల్ ప్లేయర్' గుర్తు గతేడాది పశ్చిమబెంగాల్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ 'మెస్సీ' టోర్నమెంట్ అభాసుపాలై క్రీడాభిమానుల నిరసనలను మమతకు వ్యతిరేకంగా ప్రచారంలోకి తెచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఈ గుర్తు కూడా మమతను ఎక్కిరిస్తుందేమో చూడాలి. ●

# జాతీయ ప్రయోజనాలే ధ్యేయంగా విధానాల రూపకల్పన


సి.హెచ్.ప్రతాప్

రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా తీసుకున్న తాజా నిర్ణయం భారత్-అమెరికా సంబంధాలకు మరో కీలక పరీక్షగా మారింది. సెప్టెంబరు 16న అమెరికా ప్రతినిధుల సభ లిండ్సే ఓ. గ్రాహమ్ శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026ను 262-159 ఓట్లతో ఆమోదించింది.రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేసే ప్రధాన దేశాలపై 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి ఈ చట్టం కల్పించింది. అనంతరం సెప్టెంబరు 18న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ చట్టంపై సంతకం చేశారు. అమెరికా వాదన స్పష్టమే ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి ఆర్థిక ఆధారాన్ని బలహీనపరచాలి. కానీ ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మూడోదేశాల ఇంధన కొనుగోళ్లపై కూడా భారీసుంకాల ముప్పు విధించడం అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థలో కీలక ప్రశ్నలను లేవనెత్తుతోంది. యుద్ధంలో ప్రత్యక్ష భాగస్వామ్యం కాని దేశం తన జాతీయ ఇంధన అవసరాల కోసం ఎక్కడి నుంచి చమురు కొనాలి అన్న విషయంలో బాహ్య ఒత్తిడి పెరగడం వాణిజ్య స్వేచ్ఛ, జాతీయ విధాన స్వాతంత్ర్యం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిపై చర్చకు దారితీస్తోంది. 140 భారత్ ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. 140 కోట్ల ప్రజల ఇంధన భద్రతే ప్రాధాన్యమని, మారుతున్న మార్కె ట్ పరిస్థితులకు అనుగుణంగా విభిన్న వనరుల నుంచి ఇంధనం సమకూర్చుకుంటామని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ అంశంపై గత కొన్ని నెలలుగా అమెరికా అధికారులతో ఉన్నతస్థాయిలో చర్చలు జరిగాయని, ద్వైపాక్షిక సంబంధాలతోపాటు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై కూడా సంభావ్య ప్రభావాలను అమెరికా వైపునకు వివ రించామని పేర్కొంది. ఇక్కడ అమెరికా విధానంపై ఒక ముఖ్యమైన విమర్శను విస్మరించలేం. రష్యాతో వ్యాపారం చేస్తున్న మూడు దేశాలపై కూడా శిక్షాత్మక సుంకాలు విధించడం మరో విషయం. భారతదేశం వంటి దేశాలు తమ ఇంధన అవసరాలు, ధరలు, సరఫరా భద్రతను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటాయి. అమెరికా చట్టం ఆ నిర్ణయాలపై పరోక్షంగా ప్రభావం చూపే ప్రయత్నంగా కనిపిస్తోందని విమర్శకులు పేర్కొంటున్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాకుండా ప్రపంచ ఇంధన మార్కెట్‌కు కూడా ఇటువంటి చర్యలు అనిశ్చితిని పెంచవచ్చన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అయితే అమెరికా చర్య ప్రధానంగా రష్యా ఇంధన ఆదాయాన్ని తగ్గించడం, మాస్కోపై ఆర్థిక ఒత్తిడి పెంచడం లక్ష్యంగా రూపొందింది. రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించాల్సి వస్తే ప్రత్యామ్నాయ వనరుల నుంచి అధికధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అది ఇంధన వ్యయం, రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణం, పరిశ్రమల ఉత్పత్తి వ్యయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదే సమయంలో అమెరికా విధానంలో మరో విరుద్ధతపై కూడా అంత ర్జాతీయ చర్చ సాగుతోంది. ఒకవైపు ప్రపంచవాణిజ్యాన్ని తెరవాలని, నియమాల ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయాలని చెబుతూ, మరోవైపు జాతీయ భద్రతలేదా విదేశాంగ లక్ష్యాల పేరుతో భారీ సుంకాలను ఉపయోగించడం ప్రపంచ వాణిజ్యానికి అనిశ్చితిని పెంచుతుందని విమర్శకులు అంటున్నారు. అమెరికా దేశీయ రాజకీయాల్లో కూడా కొత్త సుంకాధికారాల వల్ల అమెరికన్ వినియోగదా రులపై ధరలభారం పడ వచ్చన్న అభ్యంతరాలు వ్యక్తమ య్యాయి. ఈ నేపథ్యంలో భారత్ తొందరపాటు ప్రతి స్పందనకు బదులుగా మూడు మార్గాల్లో ముందుకు సాగాలి. రష్యాతో ఇంధన సంబంధాలను కొనసాగిస్తూనే సరఫరా వనరులను మరింత విస్తరించాలి. అమెరికాతో ఉన్నతస్థాయి దౌత్య చర్చలను కొనసాగిస్తూ, భారత ఇంధన భద్రతకు మినహాయింపులు లేదా ఆచరణాత్మక పరిష్కారాల కోసం ప్రయత్నించాలి. అదే సమయంలో దేశీయ ఇంధన వనరులు, పునరుత్పాదక శక్తి, శుద్ధి సామర్థ్యం, వ్యూహాత్మక చమురు నిల్వలను మరింత బలోపేతం చేయాలి. ●

# ఆన్‌లైన్ వాణిజ్యంలో వినియోగదారుడి విజయం ఎక్కడ?

దుంగ జయరాం

ఆన్‌లైన్‌లో కనిపించే ధరే అసలు ధర కాదు. పెద్ద అక్షరాల్లో కనిపించే రాయితీ వెనుక, చిన్న అక్షరాల్లో కొన్ని షరతులు దాగి ఉండవచ్చు. ఒక వస్తువును కొనుగోలు చేసే ముందు దాని అసలు ధర ఎంత, గతంలో ఎంతకు అమ్మారు, తిరిగి ఇవ్వవచ్చా, చెల్లించిన డబ్బు ఎలా వెనక్కి వస్తుంది, హామీ ఎవరిది, వస్తువు ఎక్కడ తయారైంది, చేరవేతకు అదనపు రుసుము ఉందా వంటి విషయాలు తెలుసుకోవడం అవసరం. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈవాణిజ్యానికి సంబంధించిన నిబంధనలను తాజాగా సవరించింది. ఈ సవరణలు 2027 జనవరి 1నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవాలంటే గతాన్ని గుర్తు చేసుకోవాలి. 2020లోనే ఈ వాణిజ్య సంస్థలపై వినియోగదారుల ప్రయోజనాలనుకాపాడే నిబంధనలు వచ్చాయి. అందువల్ల ఇప్పటివరకు రక్షణేలేదని చెప్పలేం. కానీ అప్పటి నుంచి ఆన్‌లైన్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. వస్తువులను అమ్మేపద్ధతులు మారాయి. వినియోగదారుడి దృష్టిని ఆకర్షించే కొత్త మార్గాలు వచ్చాయి. ఏ వస్తువును ముందుగా చూపించాలి, ఏ ధరను తగ్గించిన ధరగా చూపించాలి, ఏ సమాచారాన్ని ఎక్కడ ఉంచాలి అన్నదీ కొనుగోలుపై ప్రభావం చూపుతోంది. తాజా సవరణలు ఈ కొత్త సమస్యలకు మరింత స్పష్టమైన హద్దులు పెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. వినియోగదారుడు ఏదైనా వస్తువు కోసం వెతికినప్పుడు, అతను అడిగిన దానికి సంబంధం లేని విధంగా ఫలితాలను మార్చి చూపించడం లేదా తన వ్యాపార ప్రయోజనానికి అనుగుణంగా వాటిని తారుమారు చేయడం కుదరదు. డబ్బు చెల్లించి ముందుకు తెచ్చిన వస్తువులను కూడా అవి అటువంటి ప్రకటనలని స్పష్టంగా తెలియజేయాలి. దీనివల్ల వినియోగదారుడికి తాను చూస్తున్నది సహజంగా ముందుకు వచ్చిన వస్తువా, డబ్బు చెల్లించి ముందుకు తెచ్చినదా అన్నది తెలుసుకునే అవకాశం ఉంటుంది. తెరపై ఏది ముందుగా కనిపిస్తుందన్నదే కొనుగోలును నిర్ణయించే పరిస్థితుల్లో ఇది ముఖ్యమైన మార్పు. ధరల విషయంలోనూ సవరణ వినియోగదారుడికి ఉపయోగపడుతుంది. ఒక వస్తువు ధర తగ్గించామని ప్రకటించినప్పుడు, కొత్త ధరతో పాటు పాత ధరను కూడా చూపాలి. ఆ పాత ధరగా గత 30 రోజుల్లో ఉన్న అత్యల్ప ధరనే పరిగణించాలి. దీంతో ముందుగా ధరను పెంచి, ఆ తర్వాత దానిపై భారీ రాయితీ ప్రకటించే పద్ధతులకు కొంత అడ్డుకట్ట పడుతుంది. ఇంతకాలం ఇంత శాతం తగ్గింపుఅన్న మాట వినగానే కొనుగోలు చేసేపరిస్థితి ఉండేది. ఇకపైఎంత తగ్గించారు? అనే ప్రశ్నతో పాటు నిజంగా గతంలో ఎంతకు అమ్మారు? అన్నదీ తెలుసుకునే అవకాశం ఉంటుంది.అయితే ఇక్కడే అసలు సమస్య మరోటి ఉంది.సమాచారం ఇవ్వడం ఒకటి, అది వినియోగదారుడికి కనిపించేలా, అర్థమయ్యేలా ఇవ్వడం మరొకటి. తిరిగి ఇచ్చే నిబంధనలు, డబ్బు వెనక్కి చెల్లించే విధానం, వస్తువుపై హామీ, చేరవేత రుసుము,



చెల్లింపు నిబంధనలు వంటి ముఖ్యమైన వివరాలను ఒక పేజీలో చిన్న అక్షరాలతో ఎక్కడో పెట్టి ఉంటే, సంస్థ తన బాధ్యత నెరవేర్చినట్టుగా చెప్పుకోవచ్చు. కానీ కొనుగోలుచేసే వ్యక్తి వాటిని గమనించకపోతే ఆ సమాచారంతో ప్రయోజనం ఏమిటి? అందుకే ఇకపై పెద్ద అక్షరాల్లో కనిపించే రాయితీని మాత్రమే చూసి నిర్ణయం తీసుకోకుండా, దాని కింద ఉన్న చిన్న అక్షరాలను కూడా చదవడం అవసరం. చాలాసార్లు అసలు విషయం అక్కడే ఉంటుంది. తాజా నిబంధనలు ఆన్‌లైన్ వాణిజ్య వేదికలపై కూడా కొన్ని స్పష్టమైన బాధ్యతలు పెట్టాయి. వస్తువును ఎంతకాలం ఉపయోగించవచ్చో, తిరిగి ఎలా ఇవ్వవచ్చో, డబ్బు ఎలా వెనక్కి వస్తుందో, హామీ ఏమిటో, ఎప్పుడు వస్తువు చేరుతుందో, చెల్లింపు ఎలా చేయాలో వంటి వివరాలను వినియోగదారుడికి అందుబాటులో ఉంచాలి. దిగుమతి చేసుకున్నవస్తువుల విషయంలో దిగుమతిదారు వివరాలు, వస్తువు ఏ దేశంలో తయారైందన్న విషయాన్ని కూడా తెలియజేయాలి. దీంతో 'ఏం కొంటున్నాం? అన్న ప్రశ్నకు కొనుగోలు చేసే ముందే సమాధానం తెలుసుకునే అవకాశం పెరుగుతుంది. వినియోగదారుడి వ్యక్తిగత సమాచారానికి కూడా ఈ సవరణల్లో రక్షణ కల్పించారు. కొన్ని నిర్దిష్ట అవసరాలకోసం వినియోగదారుడి సమాచారాన్ని ఉపయోగించాలంటే స్పష్టమైన అనుమతి తీసుకోవాలి. అలాగే వాణిజ్య వేదిక అందించే సేవకు సంబంధం లేని రుసుములను వినియోగదారుడిపై అదనంగా వేయడానికీ పరిమితులు విధించారు. అంటే వినియోగదారుడి జేబుతో పాటు, అతని వ్యక్తిగత సమాచారం కూడా విలువైనదేనని నిబంధనలు గుర్తిస్తున్నాయి. ఇప్పటికే ఉన్న మార్గదర్శకాలను పాటిస్తున్నామా లేదా అన్నదాన్ని సంస్థలు ప్రతి సంవత్సరం తామే పరిశీలించుకోవాలి. ఆ నిబంధనలు పాటిస్తున్నామని తెలిపే ధ్రువీకరణనుకూడా ప్రముఖంగా చూపించాలి. ఇది సంస్థలు తమ వెబ్ పేజీలు, కొనుగోలు విధానాలను మరింత జాగ్రత్తగా రూపొందించాల్సిన పరిస్థితిని తీసుకొస్తుంది. ఫిర్యాదుల విషయంలోనూ వినియోగదారుడికి కొంతబలం చేకూరింది. ఫిర్యాదుల పరిష్కారఅధికారి నమోదు చేసిన ఫిర్యాదు ప్రతిని ఫిర్యాదు దారుడికి ఇవ్వాలి. అన్ని ఈవాణిజ్య సంస్థలు జాతీయ విని యోగదారుల సహాయ కేంద్రం వ్యవస్థతో కలిసిపనిచేయాలి. 2025లో ఈ సహాయ కేంద్రానికి వచ్చిన 17.71 లక్షలకు పైగా ఫిర్యాదుల్లో సుమారు 5.11 లక్షలు ఈవాణిజ్యానికి సంబంధించినవేనని కేంద్రం తెలిపింది. ఆన్‌లైన్ కొనుగోళ్లు ఎంత పెరిగాయో మాత్రమే కాదు, వాటితో పాటు సమస్యలూ ఎంత పెరిగాయో ఈసంఖ్య చెబుతోంది. అయితే కొత్త నిబంధనలు రావడంతో సమస్య అంతా పరిష్కారమైందని భావించడం తొందరపాటు.ఆన్‌లైన్ వాణిజ్యంలో వినియోగ దారుడికి కావలసింది కేవలం తక్కువ ధరకాదు, తాను ఏం కొంటున్నాడు, ఎంతకు కొంటున్నాడు, ఏషరతులతో కొంటున్నాడు అన్నది స్పష్టంగా తెలుసుకునే హక్కు. తాజా సవరణలు ఆ హక్కుకు మరింతబలమైన పునాదివేశాయి.ఇప్పుడు ఆ పునాది మీద పారదర్శకమైన వాణిజ్యాన్ని నిర్మించడం సంస్థల బాధ్యత, దాన్ని సమర్థంగా అమలు చేయించడం ప్రభుత్వ బాధ్యత, తనకు అందుతున్న సమాచారాన్ని పూర్తిగా పరిశీలించడం వినియోగదారుడి బాధ్యత. ●

# ఇరాన్‌లో 'కోడ్ 100'

## పశ్చిమాసియాలో పరిస్థితి మరింత ఉద్రిక్తం

### భీకర దాడులు జరిగే అవకాశం



**టెహ్రాన్, సెప్టెంబరు 21:** పశ్చిమాసియాలో ఘర్షణలు ఎప్పుడు ఏ రూపం దాల్చుతాయో తెలియని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తన సాయుధ దళాలకు 'కోడ్ 100' అలర్ట్‌ను జారీ చేసినట్లు సమాచారం. ఈ అలర్ట్‌ను ఆ దేశ అత్యున్నత స్థాయి సైనిక సన్నద్ధతగా రక్షణరంగ నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యాంప్ డేవిడ్ (వారాంతంలో విశ్రాంతి తీసుకునే ప్రదేశం) నుంచి షెడ్యూల్ సమయం కంటే ముందుగానే వైట్‌హౌస్‌కు తిరిగిరావడం, ఈ అలర్ట్ జారీ కావడం దాదాపు ఒకేసారి జరిగాయి. దాంతో పశ్చిమాసియాలో భీకరదాడులు జరుగుతాయా? అనే సిగ్నల్ ప్రపంచానికి వెళ్లింది.

ఏమిటీ కోడ్ 100 అలర్ట్? ఈ కోడ్ అలర్ట్‌ను ఇరాన్ సాయుధ దళాలకు అత్యున్నత స్థాయి సంసిద్ధతగా చెబుతుంటారు. ఇది అమలు చేయడమంటే.. తమ దేశంపై జరగబోయే దాడికి దీటుగా స్పందించడానికి సైనిక, భద్రతా దళాలను సంసిద్ధంగా ఉంచడమే. దళాలను అవసరమైన చోట వేగంగా మోహరించేలా, యుద్ధప్రాతిపదికన సైనిక సమాచార మార్పిడి తగ్గట్టుగా చర్యలు ఉంటాయి. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి యుద్ధం జరుగుతుందా? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, ఈ కోడ్ 100 అలర్ట్‌పై ఇరాన్ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు.

ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికా మిత్ర దేశం సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతున్న హూతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కీలకమైన ఈస్ట్-వెస్ట్ ఆయిల్ పైప్‌లైన్ (పెట్రో లైన్) మూసివేయాల్సి వచ్చింది. సౌదీ రాజధాని రియాద్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. రియాద్ సహా పలు ప్రాంతాలపై తాము క్షిపణి, డ్రోన్ దాడులు చేసినట్లు హూతీలు ప్రకటించగా.. వాటిని తాము అడ్డుకున్నామని సౌదీ ప్రకటించింది. హూతీలపై దాడులకు దిగే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందంటూ ఒక దశలో వార్తలు వచ్చాయి. వాటి కోసమే ట్రంప్ క్యాంప్ డేవిడ్‌లో తన పర్యటనను కుదించుకుని షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే శ్వేత సౌధానికి చేరుకున్నారని పలు కథనాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని అగ్రరాజ్యం సూచించింది. ఆ సమయంలో ఇరాన్ కోడ్ 100ను యాక్టివేట్ చేసిందన్న మీడియా కథనాలు వెలువడ్డాయి.


### 45 గంటల్లో నాలుగు రాకెట్ ప్రయోగాలు

# చైనా సరికొత్త చరిత్ర




**బీజింగ్, సెప్టెంబరు 21:** అంతరిక్ష రంగంలో వేగంగా విస్తరిస్తోన్న చైనా.. తన ప్రయోగ సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. ఇటీవల కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయంతంగా ప్రయోగించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ నెల 15, 16 మధ్య మూడు లాంచింగ్ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగినట్లు చైనా మీడియా వెల్లడించింది. ఇందులో ప్రైవేట్లు సంస్థలు అభివృద్ధి చేసిన రాకెట్లూ ఉన్నాయని పేర్కొంది. ఈ నాలుగు వ్యోమనౌకలు.. తాము మోసుకెళ్లిన ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో చేర్చినట్లు తెలిపింది. మొదటి ప్రయోగం సెప్టెంబరు 15న జియుక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి చేపట్టారు. ల్యాండ్‌స్పేస్ అనే ప్రైవేట్ సంస్థ అభివృద్ధి చేసిన ఝుక్వే-2ఇ రాకెట్ 10 ఉపగ్రహాలను తీసుకెళ్లి భూ దిగువ కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇదే రోజు, ఓరియన్ స్పేస్‌కు చెందిన గ్రావిటీ-1 రాకెట్‌ను షాంఘై తీరంలోని సముద్రంపై ఉన్న లాంచింగ్ కేంద్రం నుంచి ప్రయోగించారు. ఇది 9 ఉపగ్రహాలను మోసుకెళ్లింది. ఈ రాకెట ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్-ఫ్యూయల్ రాకెట్‌గా పేరుంది. ఇక, సెప్టెంబరు 16న ప్రభుత్వ రంగ అంతరిక్ష సంస్థ.. లాంగ్ మార్చ్ 12 అనే రాకెట్‌ను హైనాన్ ఐలాండ్ నుంచి ప్రయోగించింది. ఇది కూడా 9 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపట్టింది. ఇదే రోజున, జియుక్వాన్ శాటిలైట్ సెంటర్‌లో కుయ్‌ఝౌ-11 రాకెట్ ప్రయోగం జరిగింది. దీన్ని చైనా అంతరిక్ష సంస్థకు చెందిన అనుబంధ విభాగం చేపట్టింది. ఇది రెండు రాడార్ ఉపగ్రహాలను భూ దిగువ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపట్టింది.

## శబరిమల ప్రసాదం కొరతపై వివాదం!




**తిరువనంతపురం, సెప్టెంబరు 21:** ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదాల కొరత తీవ్ర వివాదానికి దారితీసింది. భక్తులకు అరవణ పాయసం, అప్పం తగినంతగా అందకపోవడంపై కేరళ దేవాదాయ శాఖ మంత్రి కె. మురళీధరన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు వైఫల్యం వల్లే ఈ సంక్షోభం తలెత్తిందని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తానని ఆయన హెచ్చరించారు. ఆదివారం శబరిమలలో ప్రసాదాల కొరత ఏర్పడటంతో పంపిణీపై అధికారులు ఆంక్షలు విధించారు. ఒక్కో భక్తుడికి కేవలం ఒక అరవణ పాయసం టిన్, మూడు అప్పం ప్యాకెట్లు మాత్రమే అందజేశారు. మధ్యాహ్నం 1:30 గంటలకు కౌంటర్లు మూసివేసి, తిరిగి సాయంత్రం 5 గంటలకు ప్రారంభించడంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఈ పరిణామాలపై దేవస్వం బోర్డు అధికారులు వివరణ ఇచ్చారు. కన్ని మాసం పూజల కోసం గత ఏడాది కంటే 50వేలు అదనంగా, మొత్తం 2.6 లక్షల ప్రసాదం టిన్నులను సిద్ధం చేసినట్లు తెలిపారు. అయితే, ఈసారి ఊహించని రీతిలో భక్తుల రద్దీ పెరగడంతో కొరత ఏర్పడిందని వెల్లడించారు. సోమవారం నాటికి నిల్వల కేవలం 14,000 టిన్నులకు పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ప్రసాదం తయారీ కేంద్రంలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నందున ఈ సమస్య తలెత్తిందన్న బోర్డు వాదనను మంత్రి మురళీధరన్ తప్పుపట్టారు. ముందస్తు సమాచారం, సరైన ప్రణాళిక లేకుండా ఇలాంటి కీలక పనులు ఎలా చేపడతారని ఆయన నిలదీశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఒక ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసే విషయంపై ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తో చర్చిస్తానని మంత్రి స్పష్టం చేశారు.

## సర్ జాబితాలో ప్రముఖుల పేర్లు గల్లంతు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** ఎన్నికల సంఘం ఢిల్లీలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సంచలనంగా మారింది. ఓటర్ల వివరాలలో వ్యత్యాసాల నేపథ్యంలో పలువురు ప్రముఖులకు నోటీసులు జారీ చేసింది. తాజాగా మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి కూడా సర్ నోటీసులు వెళ్లాయి. అద్వానీతో పాటు నోటీసులు అందుకున్న ప్రముఖుల్లో కేంద్రమంత్రి ఎస్ జైశంకర్, మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ, సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్, ఢిల్లీ మాజీ మంత్రి మనీష్ సిసోడియాలు ఉన్నారు. ఢిల్లీలో సుమారు 33.13 లక్షల మంది ఓటర్లకు వారి ఎన్యూమరేషన్ ఫారాల్లో నమోదైన వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన ఎన్నికల అధికారులు నోటీసులు పంపుతున్నారు. ఇప్పటి వరకు 31.63 లక్షలకు పైగా నోటీసులు అందజేసినట్లు ఢిల్లీ ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎల్‌కే అద్వానీ, ఆయన కుమార్తె ప్రతిభ, కోడలు గీతిక పేర్లు 2002లో జరిగిన గత సర్ ఓటరు జాబితాతో మ్యాప్ కాలేదు. దీంతో వారికి నోటీసులు జారీ అయ్యాయి. అద్వానీ కుటుంబంలోని నలుగురూ న్యూ ఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్నారు. ఎస్ఐఆర్ నోటీసులు వచ్చినంత మాత్రాన ఓటర్ జాబితా నుంచి పేరు తొలిగిపోయినట్లు కాదు, సరైన పత్రాలు సమర్పించి మళ్లీ నమోదు చేసుకోవచ్చు.

**జైశంకర్,ప్రవీణ్‌షూద్; ద్వివేది కుటుంబీకుల పేర్లుకూడా గల్లంతు!**

విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, ఆయన భార్య క్యోకో శంకర్, మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు అందాయి. జైశంకర్, ఆయన భార్య పేర్లను గత జాబితాతో అనుసంధానం చేయలేకపోవడంతో అన్ మ్యాప్డ్ విత్ లాస్ట్ సర్ కటగిరీలో చేర్చారు. వీరిద్దరూ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలోని సుందర్ బాగ్ పోలింగ్ కేంద్రంలో ఓటర్లుగా నమోదై ఉన్నారు. సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఆయన భార్య వనిత సూద్, తల్లి కమలేష్ సూద్‌లకు కూడా ఇదే కేటగిరీలో నోటీసులు అందాయి.

# పౌరసత్వం కేసులో సోనియాకు షాక్




- ఎసిజెఎం కోర్టు ఉత్తర్వు కొట్టివేత
- ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరణ సరికాదు
- పునర్విచారణకు ఆదేశాలు
- 29న విచారణకు వచ్చే అవకాశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: నకిలీ పత్రాలను ఉపయోగించి భారత పౌరసత్వం పొందేందుకు మూడేళ్ల ముందే, 1980 నాటి ఓటర్ల జాబితాలో తన పేరును చేర్చుకున్నారన్న ఆరోపణలపై కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదుకు నిరాకరిస్తూ ఇచ్చిన మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వును ఢిల్లీ కోర్టు కొట్టి వేసింది. ద్వారకా కోర్టుల ప్రత్యేక న్యాయ మూర్తి విశాల్ గోగ్నే మాట్లాడుతూ, ఆ ఉత్తర్వు సరైన కారణాలు లేకుండా, పూర్తిగా అర్థరహితంగా ఉందని అన్నారు. ఈ విషయాన్ని ఎసిజెఎం కోర్టుకు తిరిగి పంపుతూ, పార్టీల వాదనలు విని, సోమవారం ఉత్తర్వును ప్రకటిస్తూ, న్యాయమూర్తి గోగ్నే, ఏ న్యాయ ఉత్తర్వుకైనా చట్టమే ప్రథమ ప్రాధాన్యత అని, ఏ ఉత్తర్వు కూడా వాస్తవాలతో చెలగాటం ఆడకూడదని వ్యాఖ్యానించారు. ఎన్నికల జాబితాలో ఓటరు లేదా పౌరుడు కాని వ్యక్తి పేరును తారుమారు చేయడం లేదా మోసపూరితంగా చేర్చడం వంటి ఏ ఆరోపణకైనా, నకిలీ లేదా మోసం జరిగినట్లు ఆరోపణలు రుజువయ్యాయా లేదా అనే దానిపై కారణాలతో కూడిన ఉత్తర్వు జారీ చేయాలని కోర్టు పేర్కొంది. 1980, 1982, 1983 సంవత్సరాల ఎన్నికల జాబితాలలో గాంధీ పేరును ఏ క్రమంలో విచారణ జరిపి, సంబంధిత పోలీసు అధికారిని విచారించిన తర్వాత సవివరమైన ఉత్తర్వు జారీ చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు సెప్టెంబరు 29న ఎసిజెఎం ముందు విచారణకు రానుంది. చేర్చారు, తొలగించారు లేదా తిరిగి చేర్చారు అనే దాని ప్రాముఖ్యతపైనా, ఫిర్యాదును పూర్తిగా ఎందుకు కొట్టివేశారు అనే దానిపైనా సదరు ఉత్తర్వులో ఎటువంటి చర్చ జరగలేదని కోర్టు ప్రస్తావించింది. గుర్తించదగిన నేరం ఏదైనా వెల్లడైనప్పుడు, ఎటువంటి వివరణ ఇవ్వని ఉత్తర్వును జారీ చేసిన ఎసిజెఎం పూర్తిగా ఆలోచనా రహితంగా వ్యవహరించారని న్యాయమూర్తి అన్నారు. సంబంధిత పోలీసు అధికారి వాదనలను వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి స్టేటస్ రిపోర్ట్ తెప్పించకపోవడం వల్ల, సదరు ఉత్తర్వులో స్పష్టమైన చట్టపరమైన లోపం ఉందని కోర్టు నిర్ధారించింది. వాస్తవ ఆరోపణల విషయంలో వివరణ ఇవ్వకపోవడం వల్ల సదరు ఉత్తర్వు చెల్లకుండా పోయిందని, అలాగే పౌరసత్వం విషయంలో కేంద్ర ప్రభుత్వ అధికారాలు, ఎన్నికల టోల్‌లకు సంబంధించి ఇసిఐ అధికారాల గురించి ఎసిజెఎం ఇచ్చిన వివరణ పూర్తిగా అనుచితమైనది, సరికానిది అని కోర్టు పేర్కొంది. ఎసిజెఎం ఉత్తర్వును రద్దు చేస్తూ, బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 175(3) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న అభ్యర్థనను పరిశీలించేందుకు ఎసిజెఎం స్థానంలోకి తాము వెళ్లలేమని కోర్టు స్పష్టం చేసింది. అటువంటి విచారణను కేవలం మేజిస్ట్రేట్ మాత్రమే నిర్వహించగలరని, రివిజనల్ కోర్టు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ హోదాను చేపట్టలేదని అందులో పేర్కొన్నారు. తదనుగుణంగా, విచారణ జరిపి సవివరమైన ఉత్తర్వు జారీ చేయడం కోసం కోర్టు ఈ విషయాన్ని ఎసిజెఎంకు తిరిగి పంపింది.

గాంధీపై ఫిర్యాదులో చేసిన ఆరోపణలను వెల్లడించారా లేదా అనే అంశంపై సవివరమైన ఉత్తర్వు ఇవ్వాలని న్యాయమూర్తి ఎసిజెఎంను ఆదేశించారు. గాంధీపై క్రిమినల్ చర్య కోరుతూ వికాస్ త్రిపాఠి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది.

# రష్యా పార్లమెంటరీ ఎన్నికల్లో పుతిన్ పార్టీ ఘన విజయం

## అధికారపార్టీకి 58 శాతం ఓట్లు




**మాస్కో, సెప్టెంబరు 21:** ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా జరిగిన రష్యా పార్లమెంటరీ ఎన్నికల్లో అధికార యునైటెడ్ రష్యా పార్టీ భారీ విజయం సాధించింది. క్రెమ్లిన్ కఠిన నియంత్రణలో జరిగిన ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి దాదాపు 58 శాతం ఓట్లు లభించాయి. 90 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి ఈ ఫలితాలు నమోదయ్యాయని రష్యా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉటంకిస్తూ ప్రభుత్వ వార్తా సంస్థలు వెల్లడించాయి. రెండో స్థానంలో కమ్యూనిస్టు పార్టీ 13.84 శాతం ఓట్లతో నిలిచింది. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ 8.9 శాతం ఓట్లతో మూడో స్థానంలో ఉంది. డ్యూమాలో ఆధిపత్యం కొనసాగింపుఅధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పార్టీగా ప్రచారం చేసిన యునైటెడ్ రష్యా 2003 నుంచి పార్లమెంట్ దిగువ సభ అయిన స్టేట్ డ్యూమాలో మెజారిటీ కొనసాగిస్తోంది. తాజా ఫలితాలతో గత పార్లమెంట్‌లో ఉన్నట్లే రెండు మూడొంతులకు పైగా సీట్లతో రాజ్యాంగ మెజారిటీని తిరిగి సాధించే అవకాశం కనిపిస్తోంది. స్టేట్ డ్యూమాలో మొత్తం 450 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం పార్టీ జాబితా ద్వారా, మిగిలిన సగం సింగిల్‌మెంబర్ నియోజకవర్గాల ద్వారా ఎన్నికవుతాయి. ఓటింగ్ శాతం 57 శాతంఎన్నికల సంఘం ప్రకారం పోలింగ్ శాతం 57 శాతంగా నమోదైంది. ఇది 2021లో జరిగిన గత ఎన్నికలతో పోలిస్తే ఎక్కువగా ఉందని రష్యా ప్రభుత్వ టెలివిజన్ వెల్లడించింది. వ్యాపార అనుకూల, ఆచరణాత్మక విధానాలను ప్రచారం చేసే న్యూ పీపుల్ పార్టీ 7.94 శాతం ఓట్లు సాధించి 5 శాతం ప్రవేశ అర్హతను దాటింది. వామపక్ష భావజాలానికి చెందిన ఎ ఫెయిర్ రష్యా పార్టీ 4.95 శాతం వద్ద ఉంది. దీంతో ఆ పార్టీ డ్యూమాలోకి ప్రవేశిస్తుందా లేదా అన్నది స్పష్టంగా తెలియలేదు. యుద్ధానికి మద్దతుఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న యుద్ధానికి దేశంలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ మద్దతు ప్రకటించాయి. రష్యా ప్రభుత్వం దీనిని ప్రత్యేక సైనిక చర్యగా పేర్కొంటోంది. ఎన్నికల సందర్భంగా అధ్యక్షుడు పుతిన్ దేశీయ విధానాలపై ప్రధాన పార్టీల నుంచి పెద్దగా విమర్శలు ఎదుర్కోలేదు.

# దీపావళికి ఒక్కసారిగా పెరిగిన విమాన ఛార్జీలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** దీపావళి పండగను కుటుంబసభ్యులతో కలిసి జరుపుకోవడానికి సొంతూళ్లకు వెళ్లాలనుకుంటున్న ప్రయాణికులకు విమానయాన సంస్థలు గట్టి షాకిస్తున్నాయి. పండగ డిమాండ్, పెరిగిన ఇంధన ధరల కారణంగా దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణచార్జీలు ఆకాశాన్నంటాయి. దాంతో పండగ ప్రయాణం సామాన్యుడికి పెనుభారంగా మారింది. గతంతో పోలిస్తే టికెట్ల ధరలు చాలా రూట్లలో రెట్టింపు కంటే అధికంగా ఉండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దేశీయంగా ప్రధాన నగరాల మధ్య ప్రయాణ చార్జీలు విపరీతంగా పెరిగాయి. ఉదాహరణకు అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీబెంగళూరు మార్గంలో రెండు సంవత్సరాల క్రితం రౌండ్‌ట్రిప్ టికెట్ ధర సుమారు రూ.13,000 ఉండగా ఇప్పుడు పండగ సీజన్‌లో అది రూ.20,000 దాటిపోతోంది. కొన్ని మార్గాలలో అయితే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. సాధారణ రోజులతో పోలిస్తే కొన్ని రూట్లలో ఏకంగా 300 శాతానికిపైగా ధరలు పెరిగాయి. దుర్గపూజ సమయంలో కోల్‌కతాదే మార్గంలో సాధారణంగా రూ.2,800 ఉండే టికెట్ ధర ఏకంగా రూ.12,500 కి చేరడం దీనికి నిదర్శనం. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా యూఏఈ నుంచి భారత్‌కు వచ్చే విమాన సర్వీసుల ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. నవంబర్ 5న దుబాయ్ నుంచి ఢిల్లీకి వచ్చే విమాన టికెట్ ధర ఎయిర్‌లైన్‌ను బట్టి సుమారు 1,013 (రూ.26,424) నుంచి 1,214 దిర్హామ్ (రూ.31,667) ల వరకు పలుకుతోంది. అబుదాబి, షార్జా నుంచి బయలుదేరే విమానాల్లోనూ దాదాపు ఇదే స్థాయిలో ధరలు ఉన్నాయి. విమాన చార్జీల పెరుగుదలకు ప్రధానంగా ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు పెరగడమే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే ఏటీఎఫ్ ధర లీటర్‌పై రూ.6.28 (5.46 శాతం) పెరిగి రూ.121.28 కి చేరింది. పండగ సీజన్‌లో టికెట్లకు ఉండే అధిక డిమాండ్‌ను కూడా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. ఈ చార్జీల మోతపై ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణ ఖర్చులను తగ్గించుకోవడానికి ట్రావెల్ ప్లాట్‌ఫామ్‌లు కొన్ని సూచనలను అందిస్తున్నాయి. ముందుగానే టికెట్ ధరల అలర్ట్ సెట్ చేసుకోవడం, వారాంతాలకు బదులుగా వారం మధ్య రోజుల్లో ప్రయాణించడం, సాధ్యమైతే పండగ రోజునే ప్రయాణం పెట్టుకోవడం, లగేజీ తగ్గించుకోవడం, సమీపంలోని విమానాశ్రయాలను పరిశీలించడం లేదా రైలు ప్రయాణాన్ని ఎంచుకోవడం వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని సూచిస్తున్నాయి.


# జిన్‌పింగ్,మోడీ,పుతిన్‌లు లేకుండానే సమితి సమావేశం



**న్యూయార్కు, సెప్టెంబరు 21:** ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ఈ వారం ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో సంక్షోభం, సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మంగళవారం ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా, సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే, ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం, అందరి కోసం పనిచేసే ఐరాస అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతో పాటు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రధానంగా చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.

### వచ్చే యేడాదైనా ప్రపంచాన్ని ప్రశాంతంగా ఉంచండి

# ఖతార్ ప్రధాని ఆందోళన



**దోహా, సెప్టెంబరు 21:** వచ్చే ఏడాది అయినా ప్రపంచాన్ని శాంతియుతంగా జీవించనీయండి అంటూ ఖతార్‌ప్రధాని చేసిన ప్రకటన సంచలనంగా మారింది. పశ్చిమాసియా యుద్ధం, రష్యా ఉక్రెయిన్ దాడి వంటివాటినేపథ్యంలో ఖతార్‌ప్రధాని ఆందోళన వ్యక్తంచేసారు. కొన్నేళ్లుగా ప్రపంచంలో శాంతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం 2027లోనైనా ప్రశాంతమైన సంవత్సరం కావాలని అందరినీ వేడుకుంటున్నానన్నారు. ఖతార్ ఎకనామిక్ ఫోరమ్‌లో ఆదివారం మాట్లాడిన ఆయన "2022 ప్రపంచకప్ తర్వాత నాకు ప్రశాంతత అనేది లేకుండా పోయింది. ఆ తర్వాత అక్టోబర్ 7 ఘటన జరిగింది. అప్పటి నుంచి ఎవరూ మాకు విరామం ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. 2027లో అయినా ప్రశాంతమైన సంవత్సరం కావాలని అందరినీ వేడుకుంటున్నాను. దయచేసి మాకు కొంత విశ్రాంతి కావాలి అని వేడుకున్నారు. 2022లో ఖతార్ తొలిసారిగా మధ్యప్రాచ్యంలో ఫిఫా ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చింది. భారీ స్థాయి టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించగలదా? అంటూ అప్పట్లో అనేక సందేహాలు వ్యక్తమయ్యాయని షేక్ మహమ్మద్ గుర్తు చేశారు. "మేము ప్రపంచకప్ కోసం బిడ్ వేసినప్పుడు.. ఎవరూ మీకు టోర్నమెంట్ ఇవ్వరు, ఎవరూ అవార్డు చేయరని చెప్పారు. మాకు ఆతిథ్యం దక్కిన తర్వాత కూడా టోర్నమెంట్ విఫలమవుతుందని అన్నారు. కానీ మేం అద్భుతమైన ప్రపంచకప్‌ను నిర్వహించాం. ఇప్పటికీ ప్రపంచం దాని గురించి మాట్లాడుతోంద్ది అని చెప్పారు. ప్రతి సంక్షోభం నుంచి ఖతార్ మరింత బలంగా బయటపడిందని, తమ ప్రజలకు, ప్రపంచానికి తమ సామర్థ్యాన్ని నిరూపించామని పేర్కొన్నారు. ఆ తర్వాత నుంచే శాంతి కరవైందన్నారు. అనంతరం 2023 అక్టోబర్ 7 తర్వాత అశాంతి నెలకొందన్నారు. ఇరాన్‌ను ప్రాంతీయ సమస్యలకు కారణమయ్యే దేశంగా పరిగణించాలా అని ప్రశ్నించగా ఖతార్ ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు.

# సంక్షిప్త వార్తలు

## ధర్మస్థల హత్యకేసు పునర్విచారణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** కర్ణాటకలోని ఉజిరేలో 17యేళ్ల సౌజన్యపై జరిగిన అత్యాచారం, హత్య కేసు మళ్లీ చర్చనీయాంశమైంది. ఈ కేసుపై కొత్తగా దర్యాప్తు జరపాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఈ విషయం ప్రాధాన్యత సంతరించుకుంది. ధర్మస్థల కేసులో పునర్విచారణను మూడు నెలల్లో పూర్తి చేసి, నివేదికను తమ ముందు సమర్పించాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అక్టోబర్ 2012లో సౌజన్య అత్యాచారం, హత్యకు గురైన దాదాపు 14యేళ్ల తర్వాత ఈ ఆదేశం వెలువడింది

## ఇరాన్ అధ్యక్షుడి బృందానికి అమెరికా వీసాల నిరాకరణ



**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన అంశాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మంగళవారం ఐరాస సమావేశం కోసం అమెరికా వెళ్లనున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ వెంట వచ్చే బృందం మొత్తానికి వీసాలు ఇచ్చేందుకు అమెరికా నిరాకరించింది. దాంతో అనుకున్న దానికంటే తక్కువ మంది ప్రతినిధులతో పెజెష్కియాన్ యుఎస్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించింది. ఈ వారం న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ (యుఎస్‌జిఎ) 81వ సమావేశాలు జరగనున్నాయి.

## మాజీ ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలపై బిజెపి, విహెచ్‌పిల కౌంటర్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** మాజీ ఉపరాష్ట్రపతి హామీద్ అన్సారీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఏజీ నూరానీ స్మారక ఉపన్యాసంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన పాత వ్యాఖ్యల్ని ప్రస్తావించారు. ఏజీ నూరానీ రచించిన ది ఆర్ఎస్ఎస్ ఏ మెనేస్ టూ ఇండియా పుస్తకాన్ని ఉటంకిస్తూ కమ్యూనిజం కంటే హిందూ మితవాద మతతత్వమే భారతదేశానికి ముప్పుగా నెహ్రూ పేర్కొన్నారని అన్సారీ తెలిపారు. ఇవి తన వ్యాఖ్యలు కాదని నెహ్రూ చేసిన వ్యాఖ్యలు అని అన్నారు. అయితే, అన్సారీ వ్యాఖ్యలపై బీజేపీ, వీహెచ్‌పీ నేతలు భగ్గుమంటున్నారు.

## ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య కేసులో ప్రొఫెసర్ సస్పెన్షన్

**ముంబయి, సెప్టెంబరు 21:** ఐఐటీ బాంబేలో సాహిల్ వాంకోడే అనే విద్యార్థి ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ సూర్యనారాయణ దూల్లను యాజమాన్యం సస్పెండ్ చేసింది. అంతేకాదు విద్యార్థి ఆత్మహత్యపై సరైన విచారణ ప్రారంభం కాకముందే దీనిపై ప్రకటన చేయడంపై కూడా ఐఐటీ బాంబే యాజమాన్యం క్షమాపణలు చెప్పింది. ప్రస్తుతం విచారణ జరుగుతున్నందున ముందే ఒక నిర్ధరణకు రావడం సరికాదని వ్యాఖ్యానించింది.

## తమిళ హీరో అజిత్ పేరిట కొత్తపార్టీ!

**చెన్నై,సెప్టెంబరు 21:** తమిళ సినీ రంగంలో అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న అజిత్ అభిమానులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. కళ్లకురిచి జిల్లా ఉళుందూరుపేట సమీపంలో 38 జిల్లాలకు చెందిన అభిమాన సంఘాల నాయకులు ఒక్కటై "తమిళగ మక్కల్ కళగం పేరిట నూతన రాజకీయ పార్టీని అధికారికంగా ప్రారంభించారు.

పసుపు, తెలుపు, ఎరుపు రంగుల కలయికతో రెండు చిరుతల బొమ్మలతో రూపొందించిన పార్టీ జెండాను వారు ఆవిష్కరించారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని అజిత్ గతంలోనే స్పష్టం చేసినప్పటికీ తమిళనాడు రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన అభిమాన బలాన్ని నిలబెట్టుకోవడానికే ఈ వేదికను నిర్మించినట్లు పార్టీ ప్రతినిధులు తెలిపారు. నటుడు అజిత్ ప్రమేయం లేకుండానే సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం లక్ష్యంగా తామే స్వచ్ఛందంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ నిర్వాహకులు స్పష్టం చేశారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి



సోమవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సీఎస్ సంజయ్‌జాజు

### విజిలెన్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు, దాడులు
### శాఖలో నియామకాలు, పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయాలి
### రాష్ట్ర ఆదాయాన్ని పెంచేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి
### గనులు, భూగర్భ వనరుల శాఖపై సీఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ పనితీరు, పరిపాలనా అంశాలు, ఆదాయ సమీకరణ, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు తదితర అంశాలపై సీఎస్ సమగ్రంగా సమీక్షించారు. శాఖ పరిధిలోని ఖనిజ వనరుల సమర్థవంతమైన వినియోగం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియలను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కొరత కారణంగా శాఖ కార్యకలాపాలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు, అనధికారికంగా ఖనిజాల తరలింపును అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేపట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. శాఖలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంచడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా గనులు, భూగర్భ వనరుల శాఖను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా సమన్వయంతో పనిచేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్)డి.ఎస్. చౌహాన్,ఐటిఈ అండ్‌సి సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ మైన్స్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలను అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

### రాయదుర్గంలో 480 ప్లాట్ల నిర్మాణానికి శంకుస్థాపన

**హైదరాబాద్ (గచ్చిబౌలి), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గ ృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ గ ృహాలకు శేరిలింగంపల్లిలో శంకుస్థాపన చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని రాయదర్గంలో మొత్తం 480 ప్లాట్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ మొత్తం నాలుగు టవర్లు నిర్మించనుండగా, ఒక్కో టవర్‌లో 120 ప్లాట్లు రానున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేద కుటుంబాల కష్టాలు, ఇబ్బందులను ద ృష్టిలో ఉంచుకొని వారికి భద్రత, బరోసా కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నగరానికి దూరంగా కాకుండా విలువైన ప్రాంతంలో పేదలు గౌరవప్రదంగా జీవించేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ కోర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద తొలి విడతగా నియోజకవర్గానికి 480 ప్లాట్ల చొప్పున నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో టెండర్, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఇందిరమ్మ టవర్స్ లబ్దిదారుల ఎంపికను ఎటువంటి సిఫార్సులు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో, లాటరీ విధానంలో చేపట్టిన్లు మంత్రి తెలిపారు. లాటరీల్లో ఎంపికైన లబ్దిదారులకు మంజూరి లెటర్లను వారి మొబైల్ ఫోన్లను వాట్సాప్ ద్వారా పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దసరా నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 2.10లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కోర్ ప్రాంతంలోని ఇతర నియోజకవర్గాల్లో దశల వారిగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అర్హులైన పేదలకు అందజేస్తామన్నారు. ఇళ్లు ఇంటే కేవలం నాలుగు గోడలు, పైకప్పు మాత్రమే కాదని, పేద కుటుంబాల ఆత్మగౌరవానికి, జీవిత కాల సొంతిటి కళ సాకారానికి ప్రతీక అని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార ్యక్రమంలో తెలంగాణ పీఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ దయానంద్, కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, హౌజింగ్ ఎండి గౌతమ్ కుమార్, అదనపు కలెక్టర్ కిరణ్మయి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని రెండు థియేటర్లకు జరిమానా

### రూ.11 లక్షలు, 18 శాతం వడ్డీ విధింపు

### జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** టిక్కెట్ల ధరలను యథాతథంగా ఉంచి, జీఎస్టీ తగ్గింపును ప్రేక్షకులకు అందించడంలో విఫలమైనందుకు, హైదరాబాద్‌లోని రెండు సినిమా థియేటర్లకు జరిమానా విధిస్తూ జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. వినియోగదారుల సంక్షేమ నిధులలో 18 వార్షిక వడ్డీతో పాటు, రూ.11 లక్షలు జమ చేయాలని ఆదేశించింది. వేర్వేరు ఉత్తర్వులలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ న్యాయ సభ్యులు జస్టిస్ మయాంక్ కుమార్ జైన్ లంగర్ హౌస్, చిక్కడపల్లిలోని థియేటర్లకు వ్యతిరేకంగా యాంటీప్రాఫిటీరింగ్ డైరెక్టర్ జనరల్ (డిజిఎపి) వెలువరించిన తీర్పులను సమర్థించారు. 2019 జనవరి 1, నుండి అమలులోకి వచ్చిన, రూ.100 లేదా అంతకంటే తక్కువ ధర ఉన్న సినిమా టిక్కెట్లపై జీఎస్టీని 18 శాతం నుండి 12 శాతానికి తగ్గించడానికి సంబంధించిన కేసులపై విచారణ జరిపింఇ. పన్ను తగ్గింపులను వినియోగదారులకు బదిలీ చేయాలనే సిజిఎస్టీ చట్టంలోని సెక్షన్ 171 ప్రకారం ఉన్న బాధ్యతను, ధరల నిర్ణయాధికారం అధిగమించలేదని ట్రిబ్యునల్ పేర్కొంది. సినిమా, బేస్ ధరలను పెంచడం ద్వారా రూ.100, రూ.60 మరియు రూ.30 పన్నుతో కూడిన టిక్కెట్ ధరలను కొనసాగించింది. ఉదాహరణకు, దాని బాల్కనీ టిక్కెట్ బేస్ ధర రూ.84.7 నుండి రూ.89.2 కు పెరిగింది. యాంటీప్రాఫిటీరింగ్ డైరెక్టర్ జనరల్ రూ.10.1 లక్షల లాభార్జనను లెక్కించింది. ధరలను నియంత్రించే రాష్ట్ర ప్రభుత్వ, హైకోర్టు ఉత్తర్వులు, పెరుగుతున్న విద్యుత్, భద్రత, నిర్వహణ ఖర్చులు, ఇంకా ధరల సవరణ కోసం పెండింగ్‌లో ఉన్న అభ్యర్థనలను థియేటర్ యాజమాన్యం ఉదహరించింది. తాము ఎలాంటి భౌతిక వస్తువులను విక్రయించలేదని, ఎలాంటి ఇన్‌వాయిస్‌లను జారీ చేయలేదని, అలాగే ఎలాంటి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ప్రయోజనాన్ని నిలుపుకోలేదని కూడా థియేటర్ల యాజమాన్యాలు వాదించాయి. ఈ అభ్యంతరాలను తిరస్కరిస్తూ, రాష్ట్రం నిర్దేశించిన ధరల గరిష్ట పరిమితులు, పన్ను కోతలను వినియోగదారులకు బదిలీ చేయకుండా సరఫరాదారులకు మినహాయింపు ఇవ్వవని ట్రిబ్యునల్ పేర్కొంది.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త

### ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులతో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనల సడలింపు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:**ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిధులు అందేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు సానుకూలంగా పరిగణనలోకి తీసుకుని, ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా నిబంధనలను సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల పోర్టల్‌లో ఇప్పటికే మంజూరై బేస్‌మెంట్ లేదా అంతకంటే పై స్థాయికి చేరుకున్న ఇళ్లకు ఎల్-3 నుంచి ఎల్-1 కేసులకు ఒకేసారి ప్రత్యేక అనుమతి (వన్ టైమ్ క్లియరెన్స్) ఇస్తూ నిధుల విడుదలకు ప్రభుత్వం అనుమతించిందని తెలి పారు. ఈ ప్రత్యేక సడలింపు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో ఎల్-3 మంజూరులకు దీనిని ప్రాతిపదికగా పరిగణించరాదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఏర్పడే మొత్తం ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. అదేవిధంగా ఇల్లు మంజూరైనప్పటికీ నిర్మాణం ప్రారంభం కాని వాటిని రద్దు చేసి అర్హులైన వారికి కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# కొండా లక్ష్మణ్ ఆలోచన విధానంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం నిబద్ధతతో కట్టుబడి ఉండటమే కాకుండా ఆయన ఆలోచన విధానంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, కొత్తగా ఏర్పాటైన రాష్ట్రం అభివృద్ధి జరిగితే ఆయనకు నిజమైన నివాళి అవుతోందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో కొండా లక్ష ్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, పద్మశాలి కార్పొరేషన్ శ్రీనివాస్, కూడా చైర్మన్ గుండు సుధారాణి, డిసిసి అధ్యక్షులు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బిసి కమిషన్ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష ్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ నివా ళులు అర్పించారు. చైర్మన్ జి. నిరంజన్ మాట్లా డుతూ కొండా లక్ష ్మణ్ బాపూజీ గొప్ప స్వాతంత్ర సమర యోధుడని నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశాడని, గ్రంథాలయాలు వ్యవస్థాపించడంలో వారి పాత్ర మరువలేనిదని, తెలంగాణ కోసం తన మంత్రి పదవిని మొదటి సారిగా రాజీనామా చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆసభ్యులు జయప్రకాష్ మాట్లాడుతూ చాలా చిన్న గ్రామం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగాడని అన్నారు. సభ్యురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రెటరీ ఎన్.సునీత కార్యాలయ సిబ్బంది పాల్గొని లక్ష్మణ్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.



బిసి కమిషన్ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష ్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు

# లాభాల బాటలో హెచ్‌ఎంఇఎల్

### 2025-26లో రూ.23.33 కోట్ల ప్రాఫిట్

### మూసివేత నుండి జాతీయ స్థాయికి: సింగరేణి సిఎండి బుద్ధప్రకాశ్

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్‌లోని హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (హెచ్‌ఎంఇఎల్) లాభాల్లో నడుస్తోందని ఆ సంస్థ యాజమాన్యం ప్రకటించింది. నష్టాల్లో కొట్టుమిట్టాడుతూ మూసివేత దిశగా ఉన్న ఎచ్‌ఎంఈఎల్‌ను లాభాల బాటలోకి తెచ్చినట్లు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం రూ.21 కోట్ల పేరుకుపోయిన నష్టాల్లో ఉన్న ఎచ్‌ఎంఈఎల్ సంస్థ సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు రూ.60.85 కోట్ల లాభాలు వచ్చాయని వివరించారు. ముఖ్యంగా గత మూడేళ్లుగా సంస్థ ఆర్థిక పనితీరు గణనీయంగా మెరుగుపడింది. సింగరేణితో పాటు, ఇతర భారీ పరిశ్రమలకు యంత్రాలు, వాటి విడిభాగాలను తయారు చేసి సరఫరా చేస్తున్న ఏపీ హెచ్‌ఎంఈఎల్ తన 50 ఏళ్ల చరిత్రలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.05 కోట్లు, 2024-25లో రూ.9.87 కోట్లు నికర లాభాలను సాధించిందని చెప్పారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్త తరహా యంత్రాలు, యంత్ర విడిభాగాలను తయారు చేయడంతో పాటు, ఉత్పత్తులను విస్తరించి కొత్త మార్కెట్లను సాధించాలనే లక్ష్యంతో ముందు కెళుతున్నట్లు వెల్లడించారు. గతంలో ప్రధానంగా సింగరేణి వంటి సంస్థలకు యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేసిన ఏపీహెచ్‌ఎంఇఎల్ ఇప్పుడు తన మార్కెట్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ దిగ్గజ సంస్థలకు యంత్రాలు, విడిభాగాలను సరఫరా చేస్తోందన్నారు. కొత్త సంస్థల నుంచి ఆర్డర్లు సాధించడం, ఉత్పత్తుల్లో వైవిధ్యం తీసుకురావడం, వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టడం సంస్థ ఆర్థిక పనితీరు మెరుగుపడటానికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. సంక్షోభం లో ఉన్న సమయంలో ఆ ఆదుకునేందుకు ఎచ్‌ఎంఈఎల్‌లో పెట్టుబడులు పెట్టి నిర్వహణ బాధ్యతలు చేపట్టేందుకు సింగరేణి ముందుకొచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా 1997-98లో రూ.9.18 కోట్ల ఈక్విటీ పెట్టుబడితో ఈ ప్రక్రియను ప్రారంభించి, అనంతరం సింగరేణి మొత్తం రూ.14.08 కోట్ల పెట్టుబడితో 81.54 శాతం వాటాను కలిగి ప్రధాన భాగస్వామిగా మారిందని వెల్లడించారు. ప్రస్తుతం పబ్లిక్ షేర్ హోల్డర్లకు 11.81 శాతం, ఏపీ ఐడీసీకి 5.79 శాతం వాటా, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 0.86 శాతం వాటా కలిగి ఉందన్నారు. కొత్త ఆర్డర్ల సాధన వంటి చర్యలతో ఏపీఎచ్‌ఎంఈఎల్ క్రమంగా ఆర్థికంగా బలోపేతమైందని చెప్పారు.

# తెలంగాణను అడ్డంగా దోచుకున్న కెసిఆర్ కుటుంబం

### ఆడబిడ్డలం రోడ్లపై మైకులు పట్టుకుని అరుస్తుంటే కెసిఆర్‌కు ఆనందమా?

### పిసిసి సీనియర్ నాయకురాలు కల్వకుంట్ల రమ్య మధుసూదన్‌రావు

**హైదరాబాద్,సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** కెసిఆర్ కుటుంబ పదేళ్ల పాలనలో తెలంగాణలోని పంచభూతాలను చెరబట్టి అడ్డగోలుగా దోచుకున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు ప్రజల మద్దతు వస్తుంటే 22-ఎ అంటూ తమ దోపిడి బహిరంగం కాకుండా వికృతరాజకీయ విన్యాసాలు చేస్తున్నారని పిసిసి సీనియర్ నాయకులు కల్వకుంట్ల రమ్య మధుసూధన్‌రావు విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మాకు వందల ఎకరాలు ఉన్నాయని అంటున్నారు.. మరి నేను కెసిఆర్ స్వంత అన్న బిడ్డ ను మరి ఆ వందల ఎకరాలలో మా భూమి ఎక్కడ ఉన్నదో నాకు చూపాలని ఆమె ప్రశ్నించారు. నీతమ్ముడు సంతోష్‌రావుకు ఇన్ని ఆస్తులు ఎక్కడనుంచి వచ్చాయో కెటిఆర్ సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. సంతోష్ అధికారం అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా సంపాదించడమే కాకుండా ఆయన ఆడబిడ్డలమైన నన్నుకవిత ను ఇంటి నుంచి బయటకు పంపిస్తే నువ్ ఎందుకు మౌనంగా ఉంటున్నావు? నీకు సంతోష్ రావ్ బినామినా? ఎందుకు భయపడుతున్నావు.? అని ప్రశ్నించారు. మిడ్‌మానేరులో ముంపుకుగురైందని సంతోష్‌రావు సంబంధీకులు గ్రామంతో సంబంధంలేని వాళ్ల బిసిలుగా నమోదు చేసుకొని నష్టపరిహారం 2015 పొందారని ఆరోపించారు. కొదురుపాక గ్రామంలో ఒక్క సంతోష్ రావ్ ఆయన కుటుంబ సభ్యులు కలిసి 8 ప్లాట్స్ వరకు తీసుకున్నారనీ ఆరోపిం చారు. 2018 లో సంతోష్ రావ్‌కు రాజ్యసభలో అవకాశం ఇవ్వగా ఆ సందర్భంగా సంతోష్ రావ్ ఒక్కటే ప్లాట్ ఆఫడ విట్‌లో చూపించారనీ ఎత్తి చూపారు. 200 గజాల భూమిని కూడా వదలకుండా అడ్డగోలు అక్రమాలకు పాల్పడ్డారనీ ఆరోపించారు. అంతే కాకుండా ఆర్‌అండ్ ఆర్ కింద కొత్తగా ఏర్పాటైన కొదురుపాక గ్రామంలో మెయిన్ రోడ్ లో బాధితుల భూములను అడ్డగోలుగా కొన్నాడనీ తెలిపారు. సంతోష్ రావ్ కు కరీంనగర్ లో ఉన్నప్పుడు చెప్పులు కూడా ఉండేవికాదనీ, ఎకరాల కొద్ది భూములు, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 లో భూమి, ఇల్లు ఎలా వచ్చాయి మార్కుక్ గ్రామంలో 9 ఎకరాల భూమి ఎలా వచ్చిందనీ ఆమె ప్రశ్నించారు. కరీంనగర్ లో ముందు సింగల్ బెడ్ రూమ్ లో ఉన్న నువ్ 2018 తర్వాత కొండాపూర్, బంజారాహిల్స్ లలో ఆస్తులు ఎలా వచ్చాయో వివరించాలని అడిగారు. జోగినిపల్లి సంతోష్ రావ్ భార్య రోహిణి పేరు మీద నానక్ రామ్ లో ఒక పెద్ద కమర్షియల్ బిల్డింగ్స్ ఎలా వచ్చాయి.. కెసిఆర్ ని నేను నేరుగా అడుగుతున్న మీ స్వంత అన్న బిడ్డనైన నేను మీ బిడ్డ కవిత ఇద్దరు బయటకు వెళ్ళడానికి కారణం సంతోష్ కు ఎలా వేల కోట్ల రూపాయలు వచ్చాయి చెప్పాలి. మేము రోడ్ల మీద పడి మైకులు పట్టుకొని అరుస్తుంటే మీకు ఆనందంగా ఉందా అని ఆవేదన చెందారు. చిన్న షాపూర్ లో సంతోష్ రావ్ ఒక ఫామ్ హౌస్ కూడా ఉంది. ఉద్యమం ముసుగులో అడ్డగోలుగా దోచుకున్నారనీఅన్ని ఆధారాలతో ఆస్తులు బయటపెట్టినామనీ ఆమె తెలిపారు దేశ, విదేశాలలో కూడా ఆస్తులు ఉన్నాయి. ఆస్ట్రేలియా లో వెయ్యి ఎకరాలలో జె ఎస్ రాజ్ ఎస్టేట్ ఉంది. వెన్నమనేని శ్రీనివాస్ రావ్ అనే బినామీ కూడా అడ్డగోలుగా ఆస్తులు హవాలా రూపంలో దాచిపెట్టారు .ఫామ్ హౌస్ లలో భూమిలో డాక్యుమెంట్లు, డైమండ్స్ దాచి పెట్టారు. అవన్నీ ప్రభుత్వం బయటకు తీయకముందే స్వచ్ఛందంగా వాళ్లే ఆయటకు ఇచ్చి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. కెటిఆర్ ఈ విషయంలో వెంటనే స్పందించి సంతోష్ రావ్ ఆస్తులను ప్రజలకు అప్పగించాలి.



గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న పిసిసి సీనియర్ నాయకురాలు కల్వకుంట్ల రమ్య మధుసూదన్‌రావు



# కొండచిలువతో నిమజ్జన ఊరేగింపు వేడుకలు!

### కేసు నమోదు చేసిన మధురానగర్ పోలీసులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** గణేశ నిమజ్జన ఊరేగింపులో కొండచిలువను బహిరంగంగా ప్రదర్శిస్తూ వేడుకలు నిర్వహించిన ఘటనపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జవహర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనపై సమాచారం అందుకున్న జీహెచ్ ఎస్‌పీసీఏ బృందం పోలీసుల సహకారంతో అక్కడికి చేరుకుంది. ఈ వేడుకల్లో ప్రదర్శిస్తున్న సురక్ష బాయ్స్ ఈవెంట్‌కు చెందిన వారి వద్ద నుంచి ఇండియన్ రాక్ పైథాన్‌తో పాటు బ్రాయిలర్ కోడిని రక్షి ంచారు. ప్రదర్శనలో కోడిని హింసించినట్లు జీహెచ్‌ఎస్‌పీసీఏ ఆరోపించింది. రక్షించిన కొండచిలువకు పశువైద్యుడు డాక్టర్ విశ్వ చైతన్య పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. కోలుకున్న అనంతరం వన్యప్రాణి అధికారుల అనుమతితో సహజ ఆవాసంలోకి వదిలి పెడతామని పోలీసులు తెలిపారు. మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# భూభారతి వల్ల పేదలకు న్యాయం జరగాలి

### ప్రభుత్వసలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** భూ భారతి వల్ల న్యాయం పేదలకు జరగాలనీ గతంలో కెసిఆర్ ఎన్టీఆర్ కి తప్పుడు సలహాలు ఇచ్చారు పటేల్ పట్వారీ వ్యవస్థ తొలగించడం జరిగిందని ఆయన ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎవరు ఎవరికి అమ్మే అర్హత లేదనీ అన్నారు. హరిజనులకు మూడు ఎకరాల భూమి మాత్రమే ఇస్తాను ఇక తాను దళితుడిని సిఎం చేస్తే ఎప్పటికి సిఎం కాననీ అప్పటి రాష్ట్రపతి మీనాకుమారి కాళ్ళ మీద కెసిఆర్ పడ్డారనీ ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి అధికారంలోకి వచ్చాక ఇవ్వలేదు అని అన్నారు. ఇందిరా గాంధీ ఇచ్చిన 38 ఎకరాల బభూములను కూడా కెసిఆర్ లాకున్నాడనీ ఆయన ఆవేద చెందారు. గత పదేళ్ల నుంచి ఇదే అంశంపై పోరాడుతున్నా బిఆర్‌ఎస్ ధరణి కి వ్యతిరేకంగా ఫైట్ చేశా అని తెలిపారు. పేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ 1973 లో సీలింగ్ యాక్ట్ తీసుకువచ్చిందనీ కాంగ్రెస్ కాంగ్రెస్ ఇచ్చిన భూమిని కాంగ్రెస్సే కాపాడాలి అని కోఆరరు కీసర మండలం రాంపల్లి దాయరలో భూములను కబ్జా చేశారని అన్నారు. చనిపోయిన 14 ఏళ్ళ తర్వాత ఒకతని సంతకం ఫోర్జరీ చేశారనీ తెలిపారు...దొంగ సంతకాలతో భూములు కొట్టేసారని ఆరోపించారు. పేదవాళ్ళు కోర్ట్ ల చుట్టూ ఎలా తిరుగుతారు అని ఆయన ఆవేదన చెందారు. రాగి కృష్ణారెడ్డి 94 ఎకరాలలో 36 ఎకరాలు రియల్ ఎస్టేట్ వాళ్ళకి ఇచ్చారనీ చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కబ్జా దారులకు బుద్ధి చెప్పాలి ఇందిరమ్మ పరిపాలన అంటున్నారు కాబట్టి రాంపల్లి దాయరా కేసు పరిష్కరించాలనీ ఆయన కోరారు. ఇందిరమ్మ ఇచ్చిన భూములు దొరల పాలు అయ్యాయి రాగి కృష్ణారెడ్డి కుటుంబం సభ్యులు కోట్లు సంపాదిస్తున్నారనీ ఆయన అన్నారు.



సోమవారం తెలంగాణ భవన్‌లో రూ.2 లక్షల ఆర్థిక సహాయం చెక్కును వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకీరాకు అందజేసిన కెటిఆర్

# వైద్య విద్యార్థిని అకీరాకు మాజీమంత్రి కెటిఆర్ ఆర్థిక భరోసా

### ఎంబిబిఎస్ చదువుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో వైద్య విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన కొండేటి అకీరాకు కేటీఆర్ అండగా నిలిచారు. ఎంబీబీఎస్ విద్యను కొనసాగించేందుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అకీరా. తుర్రూరులోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో పదో తరగతి, ఖమ్మంలోని అంబేద్కర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అకీరా జాతీయ వైద్య ప్రవేశ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 2,99,946 ర్యాంకు, ఎస్సీ విభాగంలో 27,865 ర్యాంకు సాధించింది. అనంతరం పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. అకీరా వైద్య విద్యకు సంబంధించిన ఆర్థిక ఇబ్బందుల విషయాన్ని జర్నలిస్ట్ బొల్లెపాక రాజేష్ ట్విట్టర్ ద్వారా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

విషయం తెలుసుకున్న కేటీఆర్ స్పందించి అకీరా చదువుకు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం తెలంగాణ భవన్‌లో అకీరాకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ అందజేశారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని పేర్కొంటూ, అకీరా భవిష్యత్తులో వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షి ంచారు.

# సిఎం సిరిసిల్ల పర్యటనతో కెటిఆర్‌లో వణుకు మొదలు : ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్నాని ప్రకటించడంతో కెటిఆర్‌లో వణుకు మొదలైందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడతూ ఈనెల 30 నుంచి సిరిసిల్లలో కేటీఆర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందనీ జోస్యం చెప్పారు. అధికారం అడ్డపెట్టుకొని కెటిఆర్ చేసిన భూభాగోతం అక్రమాలు తెలుసుకొని చైతన్యం చెంది సిరిసిల్ల ప్రజలు కూడా 30వ తేదీ నుంచి ఆయనను పక్కన పెట్టబోతున్నారనీ ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అనే షేర్ సిరిసిల్లలో అడుగుపెట్టగానే కేటీఆర్‌ను షేక్ చేయబోతుందనీ అన్నారు. 30వ తేదీన కెటిఆర్‌కు భయం అంటే ఏమిటో కళ్లారా చూపిస్తామనీ చెప్పారు. సిరిసిల్ల నుంచి కల్వకుంట్ల కుటుంబానికి ఓటమి రుచిని చూపించబోతున్నామనీ అన్నారు. సిరిసిల్లలో రేవంత్ రెడ్డి సభ ప్రభంజనం సృష్టించబోతుందనీ అందుకే కెటిఆర్‌కు వణుకు మొదలై పిచ్చి వాగుడు వాగుతున్నాడనీ ఆగ్రహం వ్యక్తంచేశారు..సిరిసిల్ల ప్రజలతో తరిమేయబోతున్నారన్న భయంలో కెటిఆర్ ఉన్నాడునీ కెటిఆర్ జరుగబోయే పరిణామాలు చూడూ.. వెయింట్ అండ్ సీ అని హెచ్చరించారు.

## ఈ యేడాది హైదరాబాద్‌లో 100 కొత్త జిసిసిలే లక్ష్యం

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో గ్లోబల్ కంపెనీల కార్యకలాపాలకు మరింత ఊపువస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో మార్పు, లక్ష్యబద్ధమైన తమ ప్రభుత్వ పాలన ఫలితమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం పోస్టు పెట్టారు. నెట్‌ఫ్లిక్స్, వార్నర్ (బ్రదర్స్) డిస్కవరీ సహా దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌కు వస్తున్నాయని వెల్లడించారు. లోరియల్, ఆమ్జెన్, ఎలిలిల్లీ, యూనిలివర్ సంస్థలు హైదరాబాద్‌లో కార్యకలాపాలు కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.
ఈ ఏడాది హైదరాబాద్‌లో 100 కొత్త జీసీసీల లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. తాము నిర్ణయించిన షెడ్యూల్ కంటే ముందే జీసీసీల లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పుకొచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీతో ప్రపంచస్థాయి బిజినెస్ ఎకోసిస్టమ్ సాధ్యమని వివరించారు. గ్లోబల్ కంపెనీలు, స్థానిక ప్రతిభ కలిసేలా కొత్త వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాపారాలకు హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. భారత్,ప్రపంచ భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశాలు తెలంగాణలో సృష్టిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# హెల్త్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా తెలంగాణ

### టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు
### కొత్త తరహా ఆలోచనలకు అండగా ప్రభుత్వం
### హోమా సిఎంఇ-2026 జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** దేశంలోనే హెల్త్ ఇన్నోవేషన్స్‌కు ప్రధాన కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలు, స్టార్టప్‌ల సామర్థ్యాలను హెల్త్ కేర్ తో సమర్థవంతంగా అనుసంధానం చేసే కాంప్రహెన్సివ్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీహబ్ లో 'బియాండ్ నంబర్స్' - ప్రెసిషన్ ఫినోటైపింగ్ ఇన్ డయాబెటిస్ అండ్ మెటబాలిక్ కేర్ అనే అంశంపై హోమా సీఎం ఈ- 2026 పేరిట నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మెడిసిన్‌ను టెక్నాలజీతో మిళితం చేస్తున్నామన్నారు. మారుతున్న ఆధునిక జీవనశైలి కారణంగా డయాబెటిస్, ఇతర మెటబాలిక్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయన్నారు. వీటిని కేవలం సాంప్రదాయ వైద్య విధానాలతోనే కాకుండా, లైఫ్ స్టైల్ డేటాను విశ్లేషించడం ద్వారా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవకాశముందన్నారు. ఈ తరహా దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాలన్నారు. రాబోయే రోజుల్లో హెల్త్ కేర్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ప్రజారోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు వైద్య నిపుణులు, పరిశోధకులు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా... ప్రముఖ వైద్యులు డా.ముద్దు సురేంద్ర నెహ్రు రచించిన ది న్యూ పారాడైమ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.
అలాగే ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ మెట్రిక్ ఎక్స్ ప్లోరర్‌ను ప్రారంభించారు. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్(పీవోసీ) పేరిట ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఎంపిక చేసిన 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్‌ను అందించే కార్యక్రమానికి కూడా ఆయన శ్రీకారం చుట్టారు.

## రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026కు ఘనంగా ఏర్పాట్లు

### క్రీడా వేదికలు, వసతి, రవాణా, భద్రతపై మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ యేడాది డిసెంబరు 11 నుండి 23 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పోటీలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో పోటీల ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను శాఖల వారీగా మంత్రి సమీక్షించారు. క్రీడా వేదికల సిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారుల వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు,ఆహారం, పరిశుభ్రత, స్వాగత ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.
దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యువ క్రీడాకారులకు తెలంగాణలో అత్యుత్తమ వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. =ప్రతి క్రీడా వేదికలో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, పోటీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్ వంటి జాతీయ స్థాయి పోటీలు తెలంగాణలోని యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మరిన్ని అవకాశాలను కల్పిస్తాయని మంత్రి



సోమవారం సచివాలయంలో పోటీల ఏర్పాట్లపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.తెలంగాణ ఆతిథ్యానికి, క్రీడా రంగంలో రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన స్థాయిలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించేందుకు అధికారులు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండి సోని బాలదేవి, క్రీడా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**జంతు సంక్షేమం, ప్రజాభద్రతకు ప్రాధాన్యత**

రాష్ట్ర జంతు సంక్షేమ బోర్డు రెండో బోర్డు తొలి సమావేశం సోమవారం సచివాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి అధ్యక్షతన జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వీధి కుక్కల నిర్వహణ, కుక్క కాట్ల నివారణ, ప్రజా భద్రత, జంతు సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఏబిసి రూల్స్-2023 అమలు, ఏబిసి కేంద్రాల బలోపేతం, ప్రమాదకర కుక్కల నిర్వహణ, జంతు సంరక్షణ కేంద్రాలు, అత్యవసర పశువైద్య సేవలను మెరు గుపరచడంపై చర్చించారు. చిన్నారులు, ప్రజలు, రహదారి భద్రతతో పాటు ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో జంతువుల పట్ల చట్టబద్ధమైన, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.
పశుసంవర్ధక, మున్సి పల్, పంచాయతీరాజ్, వైద్యారోగ్య, విద్య, పోలీస్ శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీనియర్ అధికారులు డా. కె. ఇలంబర్తి, డా. బి. గోపీ, ప్రొఫెసర్ జ్ఞానప్రకాశ్, దివ్య దేవరాజన్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (వైల్డ్‌లైఫ్) క్షితిజ, జిహెచ్‌ఎంసీ, సిఎంసి, ఎంఎంసి కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## 22ఎ నిషేధిత భూముల వ్యవహారం

### సిఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 22ఎ నిషేధిత భూముల జాబితా అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తక్షణమే స్వతంత్ర విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. తమ ఆదేశాల విషయంలో తీసుకున్న చర్యలపై 4 వారాల్లో రిపోర్టు ఇవ్వాలని స్పష్టం చేసింది. 22ఏ అంశంపై హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న కమిషన్ ఈమేరకు చర్యలు తీసుకుంది. ధరణి నుంచి భూ భారతి పోర్టల్‌కు మార్పు సమయంలో లక్షలాది ప్రైవేట్ పట్టా భూములు, ఇళ్ల స్థలాలు నిషేధిత జాబితా (22ఏ)లో చేరినట్లు ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదులు అందాయి. ఎలాంటి ముందస్తు నోటీసులు, గెజిట్ నోటిఫికేషన్ లేకుండానే ఆస్తులను నిలిపివేయడంపై అడ్వకేట్ కరుపోతుల రేవంత్ ఎన్‌హెచ్‌ఆర్సీలో ఈ నెల 14న ఫిర్యాదు చేశారు. ఆస్తుల విక్రయాలు, తనఖా లావాదేవీలు నిలిచిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, మానసిక క్షోభను ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులో ఆరోపించారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలతో మధ్యవర్తులకు, అవినీతికి పెద్దపీట వేస్తున్నారంటూ ఫిర్యాదులో న్యాయవాది తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆస్తి హక్కుతో పాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,19(1)(జి),21,300-ఏ హక్కుల అంశాలను ప్రస్తావించింది. రాజ్యాంగ ఉల్లంఘనలపై అత్యవసర విచారణ జరిపి, బాధితులకు ఉపశమనం కల్పించాలని, నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది.

## అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన సిఎం

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో అదృశ్యమైన మండల రాజు కుటుంబానికి మానవతా దృక్పథంతో రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు మండల రాజు (34) 20.06.2013న ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమయ్యాడు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విజ్ఞప్తి మేరకు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
తెలంగాణ ఉద్యమంలో మండల రాజు చురుకుగా పాల్గొన్నారని, ఈ క్రమంలో ఆయన అరెస్ట్ కాగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధిచారని, ఆ తర్వాత కాలంలో అదృశ్యమయ్యాడని ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. మండల రాజు తన వృద్ధ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడని, ప్రస్తుతం వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, రోజువారీ జీవనోపాధికి ఎలాంటి ఆధారం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల కోటా కింద మానవతా దృక్పథంతో ఆయన తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి... జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మిరెడ్డికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

## పాలమూరు ప్రాజెక్టులన్నీ నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలి

### నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా దాని ఉపనదులపై నిర్మిస్తున్న ప్రాజెక్టులు నిర్ధేశించిన సమయంలో పూర్తిచేసేందుకువీలుగా చర్యలు చేపట్టాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఉన్నతస్థాయి సమావేశం లో పాలమూరు రంగారెడ్డి, డిండి, అచ్చంపేట సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన చర్చించారు. ప్రాజెక్టుల అభివృద్ధికి ఎదురవుతున్న అడ్డంకులను సత్వరమే పరిష్కరించాలని స్పష్టీకరించారు.
సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షకు ప్రత్యేక ఆహ్వానితుడిగా ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్‌సమావేశంలో పాల్గొన్నారు నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఇ. శ్రీధర్, పునరావాసం, పునర్నిర్మాణం, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, ఇంజినీర్ఇన్‌చీఫ్ రమేష్‌బాబు పాల్గొన్నారు .సంబంధిత చీఫ్ ఇంజినీర్లు, ఉన్నతాధికారులతో ప్రాజెక్టుల వారీగా మంత్రి సమీ సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు.

## ఉస్మానియా వర్సిటీ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

### హుస్సేన్‌సాగర్‌లో యథావిధిగా వినాయక నిమజ్జనాలకు అనుమతివ్వాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్ర హాస్టల్ వసతి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అలాగే సంప్రదాయబద్ధంగా హుస్సేన్ సాగర్ (వినాయక సాగర్) వేదికగా జరిగే గణేష్ నిమజ్జనాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అనుమతినిచ్చి, సకల సౌకర్యాలు కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. నవరాత్రి ఉత్సవాల వేళ ఉస్మానియా విశ్వవిద్యాలయం తనదైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటుకుంటోందని, క్యాంపస్‌లోని ప్రతి హాస్టల్‌లో విద్యార్థులు వినాయక విగ్రహాలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను చదివిన కాలేజీ హాస్టల్, ఈ హాస్టల్, ఓల్డ్ పీజీ హాస్టళ్లను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ముఖ్యంగా పరిశోధక విద్యార్థులుండే ఓల్డ్ పిజి హాస్టల్ నుండి దాదాపు 15 మంది విద్యార్థులు పిహెచ్‌డి, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు మరియు ఐసీహెచ్‌ఆర్ అర్హతలు సాధించడం గర్వకారణమని, వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.అయితే, విద్యార్థుల వసతి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందని ఆయన విమర్శించారు. ఈ-హాస్టల్ విద్యార్థులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా బలవంతంగా సి- హాస్టల్‌కు మార్చడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## జూరాల ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి

### కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడాలి

### మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల విడుదల చేయడానికి చేతకాకుంటే రైతులకు ముందే చెప్పాల్సి ఉండే అని ఇప్పుడు నీళ్ల వదలకుండా ఇబ్బందులకు గురి చేయడం కరెక్ట్ కాదు అని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. జూరాల ప్రాజెక్టు వద్ద రైతులు నీళ్ల విడుదల చేయాలని చేస్తున్న ఆందోళన పరిస్థితులపై ఆమె మాట్లాడారు. జూరాల నుంచి నీటిని విడుదల చేయకపోవడం ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం అని స్పష్టం చేశారు. తాగునీటి అవసరాల పేరుతో జూరాల నుంచి నీటిని విడుదల ఆపడం సరికాదు అన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి తక్షణమే నీటిని విడుదల చేయాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. జూరాల్లో నీళ్ల ప్రస్తుతం ఉన్నాయి కాబట్టే రైతులు అడుగుతున్నారని తాగునీటి అవసరాలను సాకు చూపుతూ నీటి విడుదల అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

## నగల కోసం మహిళను హత్య చేసిన నిందితుడికి జీవితఖైదు

### నిజామాబాద్ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు తీర్పు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా నవీపేట్ పోలీసు స్టేషన్ పరిధిలో గత ఏడాది నవంబరు నెలలో బంగారు న గల కోసం ఓ మహిళను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవి త ఖైదు శిక్ష విధిస్తూ జిల్లా నాలుగవ అదనపు సెషన్స్ కోర్టు సోమవారం తీరు ్ప చెప్పింది. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య మీడియాకు వెల్లడించారు. గత ఏడాది నవంబరు 25వ తేదీన నవీపేట్ పరిధిలో గల మల్కాపూర్ గ్రామంలో ఆకుల అనంత (29) అలియాస్ సోని అనే మహిళను కుమురం అలియాస్ పాండవాల సాగర్ (37) బంగారు గొలుసు కోసం గొంతు నులిమి హత్య చేశాడు.
హతురాలు అనంత సాగర్‌కు బంధువు కావడంతో అతను పలుమార్లు ఆ మె ఇంటికి వచ్చివెళ్లేవాడు. ఈ సమయంలో ఆమె మెడలో బంగారు నగలు గమనించి వాటిని కాజేయాల నిర్ణయించుకున్నాడు. ఇదే క్రమంలో గల ఏడాది నవంబరు నెల 25వ తేదీన ఆమె ఇంట్లో ఎవరులేని సమయంలో వచ్చి గొంతు నులిమి మెడలోని బంగారు గొలుసును కాజేశాడు. దీనిపై హతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన నవీపేట్ పోలీసులు విచారణ చేబట్టగా సాగర్ నిందితుడుగా తేలింది. అనంతరం అతన్ని అరెస్టు చేసి బంగారు గొలుసును జప్తు చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో ఏడాదిగా వాదనలు సాగుతున్నాయి. దీ నిపై జిల్లా నాలుగవ అదనపు కోర్టు సెషన్స్ జడ్జి దుర్గా ప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధించా రు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభ వించాల్సి వుంటుంది. ఈ కేసులో అదనపు పిపిగా నీరజ వ్యవహ రించారు. కాగా మర్డర్ ఫర్ గెయిన్ కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష పడేలా చేసిన నవీపేట్ పోలీసులను జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య అభినందించారు.

## ఎన్నికలు లేని 58 పంచాయతీలకు రూ.33.62 కోట్లు విడుదల

### నిధులను జమ చేసిన ఆర్థిక శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగని 58 గ్రామ పంచాయితీలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అత్యవసర పనులకు నిధుల కొరత రాకుండా ఉండేలా ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది. కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికలు జరగక పోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయిన క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్ర ఆర్థిక శాఖ 58 గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్ల నిధులను సోమవారం విడుదల చేసింది. ఈమేరకు ఆయా మొత్తాలను గ్రామపంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేసింది. ఆ మొత్తాన్ని నేరుగా ఆయా గ్రామ పంచాయతీల అధికారిక బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ నిధులను సంబంధిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, మరియు ఇతర అత్యవసర సమగ్ర అభివృద్ధి పనుల కోసం వినియోగించనున్నారు. ఎన్నికలు జరగకపోయినా గ్రామాల ప్రగతి కుంటుపడకూడదనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగ ఎన్నికలు జరగక పోవడం వల్ల స్థానిక స్థాయిలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ఈ నిధులు ఎంతో ఉపయోగపడతాయని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు.

## 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు: సిపిఐ నారాయణ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన ప్రశ్నించారు. పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక సురభి నాటకంలో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

### వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని ఎలుకలు కొరికిన ఘటన..

## టిజిహెచ్‌ఆర్‌సి సుమోటోగా కేసు స్వీకరణ

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) ఛైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో, వరంగల్ జిల్లా వార్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ఎలుకలు కొరికినట్లు వెలువడిన వార్తా కథనాలపై కమిషన్ సుమోటోగా కేసు స్వీకరించింది.
రాయపర్తి మండలానికి చెందిన గారె వీరయ్య (వయస్సు సుమారు 55-58 సంవత్సరాలు) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనంతరం, ఆయన మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీ/పోస్ట్‌మార్టం గదిలో రాత్రంతా ఉంచినట్లు, మరుసటి రోజు ఉదయం మృతదేహంపై, ముఖ్యంగా కంటి/కంటి పైభాగం వద్ద ఎలుకలు కొరికినట్లుగా గుర్తులు కనిపించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి. మార్చురీలో ఫ్రీజర్/కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం, పారిశుద్ధ్య లోపాలు, సరైన నిర్వహణ లేకపోవడం, ఎలుకల బెడద వంటి అంశాలపై కూడా వార్తా కథనాల్లో ఆందోళనలు వ్యక్తమయ్యాయి.
మృతుని బంధువులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసి, ఫ్రీజర్ ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి, మార్చురీని సక్రమంగా నిర్వహించాలని కోరినట్లు కూడా వార్తల్లో పేర్కొన్నారు.
మృతదేహానికి గౌరవప్రదమైన,మానవీయమైన రీతిలో సంరక్షణ కల్పించడం, ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో కనీస మౌలిక సదుపాయాలు, నిర్వహణ అందుబాటులో ఉండటం వంటి అంశాలకు ఈ ఘటన సంబంధించినదని కమిషన్ పేర్కొంది. వార్తల్లో వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలితే, తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని కమిషన్ అభిప్రాయపడింది.
ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ నుండి సమగ్ర నివేదికను కమిషన్ కోరింది. మృతదేహాన్ని మార్చురీలో ఉంచిన పరిస్థితులు, ఫ్రీజర్/కోల్డ్ స్టోరేజ్, విద్యుత్ సౌకర్యాల లభ్యత, పారిశుద్ధం, కీటక/ఎలుకల నియంత్రణ చర్యలు, మృతదేహంపై ఎలుకలు కొరికినట్లు/గీచినట్లు గుర్తులు ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులు, మార్చురీ నిర్వహణకు బాధ్యత వహించే అధికారి/సిబ్బంది వివరాలు, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకున్న లేదా ప్రతిపాదించిన సరిదిద్దే చర్యలు తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలని కమిషన్ ఆదేశించింది.ఈ కేసు నివేదిక సమర్పణ కోసం అక్టోబర్ 27కు విచారణ వాయిదా వేసింది.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు మంచి స్పందన

### అక్టోబరు 2 వరకు గడువు పొడిగింపు

### జ్యూరీ కమిటీలతో సమావేశంలో నిర్ణయం : ఎఫ్‌డిసి చైర్మన్ దిల్‌రాజు

**హైదరాబాద్,సెప్టెంబరు21,ప్రభాతవార్త:** బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఔత్సాహిక ఫిలిం మేకర్స్ విజ్ఞప్తి మేరకు పోటీలో పాల్గొనే గడువును అక్టోబర్ 2 వరకు పొడిగించారు. సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, జ్యూరీ కమిటీ చైర్మన్ హరీష్ శంకర్ ఆధ్వర్యంలో అన్ని జ్యూరీ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. యువతలోని సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, ఔత్సాహిక ఫిలిం మేకర్స్‌కు తమ ప్రతిభను చాటుకునేందుకు మరింత అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గడువును పొడిగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, ఎఫ్‌డీసీ ఇడి. కిషోర్‌బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విమలక్క, కాసర్ల శ్యామ్, పొన్నం రవిచంద్ర, అనిల్ జీలా ఇతర జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎఐసిసి చీఫ్ మల్లికార్జునఖర్గేతో మంత్రి వివేక్‌వెంకటస్వామి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** అఖిల భారత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను శక్తి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖర్గే ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై జరిగిన అనుచిత వ్యాఖ్యల అంశంపై ఖర్గే ఈ సందర్భంగా ఆరా తీశారు. అసెంబ్లీ సమావేశాల తీరు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, 22ఏ అంశం, ప్రజా సంక్షేమ పథకాల అమలు తదితర విషయాలపై వివేక్ వెంకటస్వామితో చర్చించారు.

## జస్టిస్ వర్మ నోట్లకట్టల ఘటనపై పిటిషన్‌ను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం అనంతరం భారీగా నగదు లభించిందన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రత్యేక దర్యాప్తు బృందం లేదా సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌ను వైల్డ్ విచ్ హంట్‌గా అభివర్ణించిన జస్టిస్ అమిత్ బన్సల్ పిటిషనర్ న్యాయవాది ఘనశ్యామ్ ఉపాధ్యాయ్‌కు చట్టపరంగా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నేను ఈ పిటిషన్‌ను విచారించను. ఇది వైల్డ్ విచ్ హంట్. మీకు చేయడానికి ఇంకేమీ లేదా అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. విచారణ సందర్భంగా పిటిషనర్‌కు ఈ కేసులో ఉన్న న్యాయపరమైన హక్కు ఏమిటని కోర్టు ప్రశ్నించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న అభ్యర్థనతో ట్రయల్ కోర్టును ఎందుకు ఆశ్రయించలేదని కూడా ప్రశ్నించింది. ఈ ఘటన అసాధారణ మైనదని, దిగువ కోర్టు ఈ వ్యవహారానికి తగిన న్యాయం చేయలేదని పిటిషనర్ వాదించారు. ఇది జస్టిస్ యశ్వంత్‌వర్మకు సంబంధించిన విషయం.

## గంజాయి డాన్ నీతూబాయికి ఇడి నోటీసులు

### ఇడి విచారణకు హాజరైన ఆమె తోడికోడలు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** గంజాయి స్మగ్లింగ్‌లో లేడా డాన్‌గా పేరుగాంచిన నీతూ బాయికి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా బడా డ్రగ్స్ స్మగ్లర్ల ఆర్థిక మూలాలపై దాడులు చేస్తున్న ఈ డీ అధికారులు ఇందులో భాగంగా రాయదుర్గంలోని ఖాజాగూడలో వుంటున్న గంజాయి స్మగ్లర్ నీతూబాయికి ఇంతకు ముందు ఒకసారి నోటీ సులు ఇవ్వగా ఆమె దీనికి స్పందించక పోవడంతో సోమవారం నాడు మరోదఫా నోటీసులు ఇచ్చారు. వెంటనే విచారణకు రావాలని అందులో ఆదేశించారు. నీతూ బాయితో పాటు ఆమె కుటుంబ సభ్యులు 11 మందికి ఇడి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఇప్పటికే నీతూ బాయి భర్త మనుసింగ్, ముమార్తె నేహా సింగ్ ఈడీ విచారణకు హాజరుకాగా ఆమె తోడికోడలు సురేఖ బాయి సోమవారం నాడు బషీర్‌బాగ్‌లో ని ఈడీ కార్యాలయానికి విచారణకు వచ్చి తమ దందాలపై వాంగ్మూలం ఇచ్చింది.

# ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి

## విఫలమైతే సబ్సిడీలు, పథకాలు కట్

## నేటి నుంచి గ్రామాల్లో క్యాంపెయిన్

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ రైతులకు ప్రభుత్వం ముఖ్యమైన సూచన చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించింది. ఈ నెల 30వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేసుకోకపోతే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందడంలో ఇబ్బందులు ఎదురవు తాయని హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం ఒకే రైతు, ఒకే గుర్తింపు, సమగ్ర సేవలు అన్న కాన్సెప్ట్ తో రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రీని ప్రవేశపెట్టింది. ఇందులో నమోదు చేసుకుంటే ప్రతి రైతుకు ఒక యూనిక్ ఐడీ వస్తుంది. పట్టాదార్ పాస్ పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఫార్మర్ ఐడీ) కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. పీఎం కిసాన్, రైతు భరోసా, ఎరువులు కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర సబ్సిడీలు తదితర పథకాలు పొందాలంటే ఈ ఐడీ తప్పనిసరి. ఈ నెల 22 నుంచి 30 వరకు తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు. అధికారులు గ్రామాలకు వచ్చి ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేస్తారు. లేదా రైతులు మండల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద కూడా నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే నమోదు అయినవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కోసం ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ ఉంటే చాలు. ఐడీ వచ్చిన తర్వాత దాన్ని నోట్ చేసుకుంటే సరిపోతుంది. వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 67 లక్షల నుండి 70 లక్షల వరకూ రైతులు (రైతు భరోసా లబ్దిదారులు) ఉండగా, వీరిలో 90 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. అయితే ఇప్పటి వరకూ ఫార్మర్ రిజిస్ట్రీలో రాష్ట్ర వ్యాప్తంగా 51,67,015 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 51,30,031 మంది రైతులకు ఐడీ నెంబర్లు ఖరారయ్యాయి. దాదాపు ఇంకో 20 లక్షల మంది రైతులు ఇంకా రిజిస్ట్రీ చేయించుకోవాల్సి ఉంది.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క తదితరులు

# సామాజిక తెలంగాణే బాపూజీ కలలుగన్న సంపూర్ణ తెలంగాణ

## - కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సభలో మంత్రి సీతక్క

**హైదరాబాద్ సెప్టెంబర్ 21 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ ఉద్యమ చరిత్రలో జలదృశ్యం మరియు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం చైతన్య కేంద్రాలుగా నిలిచాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను తమ ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సోమవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్దగల జలదృశ్యంలో బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ నేతృత్వంలో ఘన నివాళి సభ, అనంతరం "సామాజిక తెలంగాణ సాధనకై సమాలోచన" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన ద్వారా సామాజిక న్యాయ సాధనకు ఒక చారిత్రక అడుగు పడిందని తెలిపారు. సమాలోచన కార్యక్రమంలో వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. "సామాజిక తెలంగాణనే బాపూజీ కలలుగన్న సంపూర్ణ తెలంగాణ" అని, సబ్బండ వర్గాలకు సముచిత భాగస్వామ్యం, ఆత్మగౌరవంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బాపూజీ ఏ ఒక్క వర్గానికో, పార్టీకో పరిమితమైన నాయకుడు కాదని, సమాజమంతటికీ చెందిన మహనీయుడని కొనియాడారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తన వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు కంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికే ప్రాధాన్య మిచ్చిన మహోన్నత వ్యక్తి బాపూజీ అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యం, సమాన అవకాశాలతో కూడిన సామాజిక తెలంగాణ నిర్మాణమే బాపూజీకి నిజమైన నివాళి అని అసెంబ్లీ, కౌన్సిల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎల్. రమణ తెలిపారు. జలదృశ్యంలో బాపూజీ విగ్రహ స్థాపన కోసం ఏడేళ్లపాటు నిరంతర పోరాటం చేసి సాధించామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించేలా తెలంగాణ శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి. బీసీలకు 42 శాతం రాజకీయ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలి. కులగణన ఫలితాలకు అనుగుణంగా బీసీ, సబ్బండ వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారం రాజకీయ, ఆర్థిక, విద్యా అవకాశాలు, వనరుల కేటాయింపులు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ ఛైర్మన్లు బి.ఎస్. రాములు, వకుళాభరణం కృష్ణమోహన్, కుడా మాజీ ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, బహుజన నాయకులు వి.జి.ఆర్. నారగోని, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఛైర్మన్ చిరంజీవులు, బహుజన ముక్తి పార్టీ అధ్యక్షులు దాసు రామ్ నాయక్, కార్పొరేషన్ల ఛైర్మన్లు గూడూరు శ్రీనివాస్, వెంకటరమణ, కూరపాటి వెంకటనారాయణ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇందిరా శోభన్, వరలక్ష్మి, మేకపోతుల నరేందర్ గౌడ్ తో పాటు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు, బాపూజీ అభిమానులు పెద్ద సంఖ్యలో

# భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలి:

## దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



అధికారులకు సూచనలు ఇస్తున్న జీఎం సంయజ్ కుమార్ శ్రీవాస్తవ

**తార్నాక, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైళ్ల నిర్వహణ భద్రతపై జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్‌తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. స్టేషన్ నిర్వహణ నిబంధనలు, నిర్దేశిత విధానాలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని జీఎం ఆదేశించారు. భద్రతా విధానాలను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు సిబ్బందికి సురక్షిత పని విధానాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. రైల్వే స్టేషన్ల సమీపంలోని గ్రామాల్లో పశువులు రైల్వే పట్టాలు దాటకుండా స్థానికులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. దీనివల్ల ప్రమాదాలను నివారించడంతో పాటు పశువుల రక్షణ, రైళ్ల ఆలస్యం, ఇంజిన్లకు నష్టం వంటి సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో చేపట్టే పనుల సమయంలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# అక్క అంబిక, సోదరుడు మల్లికార్జునపై నటి రాధ ఫిర్యాదు



**చెన్నై, సెప్టెంబర్ 21:** ప్రముఖ తమిళ నటి రాధ, తన సోదరి, నటి అంబికతో పాటు సోదరుడు మల్లికార్జున కుంజన్ నాయర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నైలోని తన నివాసంలో ఉంచిన సంతకం చేసిన ఖాళీ చెక్కులను తనకు తెలియకుండా తీసుకుని, సుమారు రూ.46 కోట్లను క్లెయిమ్ చేసేందుకు ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్‌కు సోమవారం ఈ ఫిర్యాదు చేసినట్లు రాధ తెలిపారు. ఆమె బృందం ఫిర్యాదు ప్రతినిమీడియాకు విడుదలచేసారు. రూ.46 కోట్ల చెక్కులు సమర్పించారని ఆరోపరాధ ఫిర్యాదు ప్రకారం వ్యాపార సంబంధిత ఖర్చుల కోసం ఆమెకు ఐడీబీఐ బ్యాంకులో కరెంట్ ఖాతా ఉంది. జీతాలు, విద్యుత్ బిల్లులు, పన్నులు, తోట నిర్వహణ వంటి సాధారణ చెల్లింపుల కోసం కొన్ని సంతకం చేసిన ఖాళీ చెక్కులను చెన్నైలోని తన గదిలో ఉంచేవారు. తాను ప్రయాణాల్లో ఉన్నప్పుడు వీటిని ఉపయోగించేవారని పేర్కొన్నారు. ఈ బ్యాంకు ఖాతా తొలుత ఎఆర్ఎస్ గార్డెన్‌స్టూడియో పేరుతో ఉండేదని, 2025 జనవరిలో వ్యాపార పేరు ఆర్ఆర్ గార్డెన్స్‌గా మారిన తర్వాత కొత్త చెక్‌బుక్ తీసుకున్నట్లు రాధ తెలిపారు. దీంతో పాత చెక్‌బుక్‌ను ఉపయోగించడం మానేశానని, ఇంట్లో మిగిలిపోయిన పాత చెక్కుల విషయాన్ని తాను మరిచిపోయానని చెప్పారు. ఈనెల 17న బ్యాంకు నుంచి సమాచారం అందిన తర్వాత ఈ విషయం తన దృష్టికి వచ్చిందని రాధ తెలిపారు. పాత చెక్‌బుక్‌కు చెందిన ఐదు చెక్కులను అంబిక పేరుతో రూ.46 కోట్ల నగదు కోసం సమర్పించినట్లు బ్యాంకు అధికారులు తనకు తెలిపారని ఆమె పేర్కొన్నారు. వెంటనే చెల్లింపులను నిలిపివేయాలని బ్యాంకును ఆదేశించినట్లు చెప్పారు. అంబికకు తాను ఎలాంటి చెక్కులు ఇవ్వలేదని, అంత పెద్ద మొత్తంలో చెల్లింపు చేయాల్సిన ఆర్థిక ఒప్పందం కూడా తమ మధ్య లేదని రాధ ఫిర్యాదులో పేర్కొన్నారు. చెక్కులు సోదరుడే నింపారన్న రాచెక్కులపై వివరాలను తమ సోదరుడు మల్లికార్జునే నమోదు చేశారని రాధ ఆరోపించారు.

# చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా పర్యటన ఖరారు

**వాషింగ్టన్,సెప్టెంబరు 21:** దాదాపు మూడేళ్ల తర్వాత చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికాలో పర్యటించనున్నారు. 23 నుంచి 25 వరకు ఆయన అమెరికాలో పర్యటించనున్నట్లు చైనా అధికారికంగా ధృవీకరించింది. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో 23న షీ జిన్‌పింగ్ కీలక చర్చలు జరిపే అవకాశం ఉంది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు, కృత్రిమ మేధస్సు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. జిన్‌పింగ్ పర్యటనకు ముందు ఆదివారం న్యూయార్క్‌లో అమెరికా, చైనా ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఈ చర్చలు స్పష్టమైన, లోతైన, నిర్మాణాత్మకమైన చర్చలుగా సాగినట్లు బీజింగ్ పేర్కొంది. చైనా ఉప ప్రధాని హె లిఫెంగ్, అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్, అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ ఆర్థిక, వాణిజ్య అంశాలపై చర్చలకు నాయకత్వం వహించారు. కృత్రిమ మేధస్సుకు సంబంధించిన అంశాలు కూడా చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు చైనా అధికారిక వార్తా సంస్థ జిన్‌హువా తెలిపింది. ఇరు దేశాల అధినేతల మధ్య గతంలో కుదిరిన అవగాహనకు అనుగుణంగా, పరస్పర ఆసక్తి ఉన్న ఆర్థిక, వాణిజ్య అంశాలపై అధికారులు చర్చలు జరిపినట్లు చైనా తెలిపింది. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, పరస్పర ప్రయోజనకరమైన సహకారం అనే సూత్రాల ఆధారంగా చర్చలు కొనసాగినట్లు పేర్కొంది. ఎఐకి సంబంధించిన అంశాలపై కూడా బెసెంట్, హె లిఫెంగ్ చర్చించినప్పటికీ అందులోని నిర్దిష్ట వివరాలను వెల్లడించలేదు. జిన్‌పింగ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అరుదైన రీతిలో స్వాగతం పలికే అవకాశం ఉందని హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ గతంలో నివేదించింది. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో విమానం దిగిన అనంతరం ట్రంప్ స్వయంగా రన్‌వేపైకి వెళ్లి స్వాగతం పలకవచ్చని పేర్కొంది. ట్రంప్ తాజాగా రష్యా నుంచి చమురు, సహజవాయువును కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు వీలు కల్పించే కొత్త ఆంక్షల చట్టంపై సంతకం చేశారు. ఇందులో చైనా, భారత్ వంటి దేశాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో అమెరికా కొత్తఎఐఫోర్స్‌ను ప్రకటించింది. దీంతో అమెరికా చైనా మధ్య ఇప్పటికే కొనసాగుతున్న సాంకేతిక పోటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సుంకాల విషయంలో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ అమెరికా, చైనా పరస్పర సుంకాల తగ్గింపు కోసం చర్చలు కొనసాగిస్తున్నాయి. ఇరు దేశాల నుంచి సుమారు 30 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను కవర్ చేసే విధంగా పరస్పర సుంకాల తగ్గింపు వ్యవస్థపై చర్చలు జరుగుతున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈనె 23న జరగనున్న ట్రంప్‌షీ భేటీతో అమెరికాచైనా వాణిజ్య, ఆర్థిక, సాంకేతిక సంబంధాల్లో తదుపరి దశపై స్పష్టత.

# పోఖ్రాన్‌లో దీర్ఘశ్రేణి డ్రోన్‌పరీక్షలు విజయవంతం

**జైపూర్; సెప్టెంబరు 21:** దేశీయంగా తయారైన లాంగ్ రేంజ్ అటాక్ డ్రోన్ కాల్ (కేఏఎల్) పరీక్ష విజయవంతమైంది. రాజస్తాన్, పోఖ్రాన్‌లోని ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో జరిపిన ప్రయోగం విజయవంతమైందని తయారీ సంస్థ ఐడీ డిఫెన్స్ వెల్లడించింది. నోయిడాకు చెందిన ఐజీ డిఫెన్స్ సంస్థ ఈ డ్రోన్‌ను తయారు చేసింది. ఇది దేశీయంగా, స్వదేశీ టెక్నాలజీతో తయారైన లాంగ్ రేంజ్ వన్ వే అటాక్ డ్రోన్. ఇటీవలి కాలంలో ఈ తరహా డ్రోన్ల వినియోగం ఎక్కువగా పెరుగుతోంది. ఇటీవల రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో, ఇరాన్ యుద్ధంలో ఈ తరహా డ్రోన్లను వాడారు. షాహెద్36 పేరుతో ఇరాన్, గెరాన్2 పేరుతో రష్యా ఇలాంటి డ్రోన్లను రూపొందించారు. ఇవి తక్కువ ఖర్చుతోనే తయారవుతాయి. కాల్ డ్రోన్ దాదాపు 1,000 కిలోమీటర్ల రేంజ్ కలిగి ఉంది. 78 గంటలపాటు దూసుకెళ్లే సామర్థం ఉంది. 50 కేజీల పే లోడ్‌ను మోసుకెళ్లగలదు. ఇది 5,000 మీటర్ల ఎత్తులో ఎగరగలదు. అంటే సముద్ర మట్టానికి పైనే. ఇది మల్టీ బ్యాండ్ గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్), ఇనర్షియల్ నావిగేషన్ సిస్టమ్స్ (ఐఎన్ఎస్) ద్వారా స్వతంత్రంగా పని చేస్తాయి. ఈ డ్రోన్లు నిర్ణీత లక్ష్యాలను ఛేధించగలవు.

# కేంద్రం జాతీయ జనగణనలో ఒబిసి కాలంను చేర్చాలి

## లేదంటే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతాం: బిసి నేతల హెచ్చరిక

**సైఫాబాద్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ జనగణనలో ఓబిసి కాలం చేర్చాలని డిమాండ్ చేస్తూ అనేక మంది ఓబిసిలు సోమవారం అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. జాతీయ ఓబిసి కో-ఆర్డినేషన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బిసి సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొని జనగణనలో ఓబిసి కాలం చేర్చాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బిసి మేధావుల ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ బి.ఎస్.రాములు, రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు వి.జి.ఆర్.నారగోని, బిసి పొలిటికల్ ఫ్రంట్ వైస్-ఛైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, రాష్ట్ర కన్వీనర్లు అయిలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణగౌడ్, బైర శేఖర్, ఓబిసి జాతీయ విద్యార్థి సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. మధుసూదనాచారి, రవిచంద్ర, శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిసి వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. కేంద్రం జనగణనలో ఓబిసి కాలం చేర్చకుండా మొండి వైఖరి అవలంబిస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన బిసి,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలు తలుచుంటే ఈ అగ్రవర్ణ ప్రభుత్వాలు కుప్పకూలిపోతాయని, రాష్ట్రంలో వచ్చేది బహుజనుల రాజ్యమని హెచ్చరించారు. బిజెపి ఓబిసిల జనాభను లెక్కిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని బహిరంగంగా హామీలు ఇచ్చి మోసానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఈ పార్టీలు చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇవి ఎంతో కాలం కొనసాగవని, ఇప్పటికైనా కేంద్రం జాతీయ జనగణనలో ఓబిసి కాలం చేర్చాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు.




ధర్నాలో మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు

# మళ్లీ అరెస్ట్ చేయాలంటే మేజిస్ట్రేట్ అనుమతి ఉండాల్సిందే: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** పౌర హక్కుల పరిరక్షణ, పోలీసుల అధికార దుర్వినియోగానికి చెక్ పెట్టే దిశగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సోమవారం అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. సరైన ఆధారాలు లేదా చట్టబద్ధమైన కారణాలు చూపకుండా చేపట్టిన తొలి అరెస్టు రాజ్యాంగ విరుద్ధమని తేలి, నిందితుడు విడుదలైన పక్షంలో సదరు వ్యక్తిని మళ్లీ అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు నేరుగా ఉండదని కోర్టు తేల్చి చెప్పింది. పోలీసు యంత్రాంగం మళ్లీ ఆ వ్యక్తిని కస్టడీకి తీసుకోవాలంటే సంబంధిత జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందస్తు అనుమతి పొంది తీరాల్సిందేనని స్పష్టం చేసింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం ప్రతీ పౌరుడికి తన అరెస్టుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలుసుకునే ప్రాథమిక హక్కు ఉందని ధర్మాసనం పునరుద్ఘాటించింది. నేరం తీవ్రతతో సంబంధం లేకుండా.. యుఎపిఎ, పిఎంఎల్‌ఏ వంటి కఠినమైన ప్రత్యేక చట్టాల కింద నమోదైన కేసులకు కూడా ఈ రాజ్యాంగ నిబంధన పవిత్రమైనదని, తప్పనిసరిగా పాటించాల్సిందేనని పేర్కొంది.

# ఆదివాసీలకు విధించిన మరణశిక్షను రద్దు చేయాలి

## పౌర హక్కుల సంఘం నేతలు

**సైఫాబాద్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్‌ఐఎ కోర్టు పది మంది ఆదివాసీలకు విధించిన మరణ శిక్షను రద్దు చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్, జస్టిస్ బి.చంద్రకుమార్, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు మాట్లాడుతూ 2013, మే 25న ఛత్తీసఘడ్‌లోని బస్తర్ జిల్లా జీరంఘాటి వద్ద పరివర్తన ర్యాలీపై జరిగిన దాడిలో 29 మంది మరణించారని, ఇందులో 10 మంది ఆదివాసీలను ఆరోపితులుగా చేసి 13 ఏళ్ళుగా జైలులో నిర్బందించడం జరిగిందని ఆరోపించారు. ఈ కేసు విచారణ ఎన్‌ఐఎ ఆధ్వర్యంలో నడిచిందని, కోర్టు పది మంది ఆదివాసులకు మరణశిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చిందన్నారు. బస్తర్ ప్రాంతంలో గిరిజనులతో సల్వాజుడుం అనే సాయుధ ప్రైవేటు ముఠాతో ఆదివాసీలపై అత్యంత అవమానవీయ దాడులు జరిగాయిని, ఐదేళ్ళుగా వందలాది మంది ఆదివాసీలను హత్య చేసి, మహిళలపై లెక్కకు మించిన అత్యాచారాలతో ఆదివాసీ జనజీవనాన్ని విధ్వంసానికి సల్వాజుడుం ముఠాకు చెందిన ఆది నాయకుడు మహేంద్రకర్మ గురిచేయడం జరిగిందని వారు ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన అన్ని కేసులను ఎత్తివేస్తామని జైల్లో బంధీలుగా ఉన్న రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని ఇప్పటికే ప్రభుత్వాలు ప్రకటించాయని, అందువల్ల ఏ కేసుపైన కూడా న్యాయస్థానాల్లో విచారణ జరుగుతున్నా ఆ విచారణలను ఆపి బేషరుతుగా అందరిని విడుదల చేయాలని కోరారు.

# పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్ పై నిషేధం దిశగా ఇటలీ

**రోమ్,సెప్టెంబరు 21:** పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్ ధరించడాన్ని నిషేధించే దిశగా ఇటలీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధానమంత్రి జార్జియా మెలోని ప్రకటించారు. ముఖాన్ని పూర్తిగా కప్పే మతపరమైన స్వేచ్ఛ, సమాజంలో ఏకీకరణ అంశాలపై యూరప్లో కొనసాగుతున్న చర్చకు ఇటలీ నిర్ణయం మరోసారి ప్రాధాన్యత తీసుకొచ్చింది. త్వరలోనే బుర్ఖా, నిఖాబ్‌లను పాఠశాలల్లో నిషేధించే ప్రతిపాదనను మంత్రివర్గం ముందుకు తీసుకురానున్నట్లు మెలోని తెలిపారు. విదేశీ విద్యార్థులు అధికంగా ఉన్న తరగతుల్లో వారి సంఖ్యను పరిమితం చేయాలని, ఇటాలియన్ భాషలో సమన్వయం సాధించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విదేశీ విద్యార్థుల తల్లిదండ్రులు ఇటాలియన్ నేర్చుకోవాలని కూడా ఆమె ప్రతిపాదించారు. ఒక్కో తరగతిలో విదేశీ విద్యార్థుల సంఖ్యకు సంబంధించి ప్రభుత్వం ఇంకా నిర్దిష్ట పరిమితిని ప్రకటించలేదు. పాఠశాలకు ముఖం కనిపించేలా వెళ్లాలని మెలోని వ్యాఖ్యానించారు. సంప్రదాయం పేరుతో యువతి తన ముఖాన్ని కప్పుకోవాలని ఎవరూ నిర్ణయించకూడదని ఆమె పేర్కొన్నారు.

# ఆత్మహత్యకు పాల్పడిన ఎఆర్ పోలీస్ కానిస్టేబుల్

**మలక్ పేట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** ఏ ఆర్ కానిస్టేబుల్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల బెల్లంపల్లికి చెందిన ముత్తే చంద్రశేఖర్ (36) ముసారాంబాగ్ శాలివాహన నగర్ లోని ఓ అపార్ట్మెంట్స్ లో ఒక్కరే నివసిస్తున్నారు. మల్కాజిగిరి కమిషనర్ రేట్ అంబర్పేట హెడ్ క్వార్టర్స్ లో 2020 బ్యాచ్ కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ముత్తే చంద్రశేఖర్ రైటర్ గా విధులు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఓ అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. అనంతరం పరస్పర అంగీకారంతో నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారు. కాగా కొద్ది రోజుల నుంచి ముత్తే చంద్రశేఖర్ ఆ అమ్మాయికి ఫోన్ చేస్తుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి అమ్మాయికి వీడియో కాల్ చేసి ముసారాంబాగ్ శాలివాహన నగర్ లో తాను నివసిస్తున్న నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేస్తున్నాడు.

# వీధి పశువులకు ఆశ్రయాల నిర్మాణంపై సుప్రీంకోర్టుకు ఎన్‌హెచ్‌ఎఐ

## - విచారణకు ప్రత్యేక బెంచ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** రోడ్లపై తిరిగే వీధి పశువుల కోసం ప్రత్యేక ఆశ్రయాలు నిర్మించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జైమాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఎదుట సోమవారం ఎన్‌హెచ్‌ఏఐ తరఫున సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ అంశాన్ని ప్రస్తావించారు.

### పెళ్లి పేరుతో యువతి పై ఏఆర్ కానిస్టేబుల్ అఘాయిత్యం - కేసు నమోదు

**బేగంపేట సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి శారీరకంగా లొంగదీసుకుని, ఆపై మోసం చేసిన ఏఆర్ కానిస్టేబుల్‌పై బేగంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురా పోలీస్ క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వినీత్ కుమార్ చౌదరి (27)కు జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం శేషంపల్లి గ్రామానికి చెందిన 24 ఏళ్ల విద్యార్థిని తో 2023లో కోచింగ్ సెంటర్‌లో పరిచయం ఏర్పడింది. అనంతరం 2026 మే నెలలో ఆమెకు ప్రేమ ప్రతిపాదన చేసిన వినీత్.

# అయోధ్య రామాలయం విరాళాలు 105సార్లు చోరీ

## - సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** అయోధ్య రామమందిరం విరాళాల చోరీ కేసులో సంబంధించి 'సిట్' నివేదికను సోమవారం సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ నివేదికలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ తన నివేదికలో వెల్లడించింది. ఆ చోరీ దృశ్యాలు సిసిటివి కెమెరాల్లో రికార్డు అయినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. విరాళాల చోరీ కేసుకు సంబంధించి ఎస్‌ఐటి సమర్పించిన పురోగతి నివేదికను సుప్రీంకోర్టు సమీక్షి ంచింది. ఈ సందర్భంగా విచారణ వివరాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి వివరించారు. సిట్ దర్యాప్తు దాదాపు పూర్తయిందని సెప్టెంబర్ 25 నాటికి చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నట్లు సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తులో ఇప్పటివరకు జరిగిన అరెస్టులు, సేకరించిన ఆధారాల వివరాలను కూడా కోర్టుకు వివరించారు. చార్జ్‌షీట్ దాఖలైన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత మేజిస్ట్రేట్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

# ఆర్టీఓ కార్యాలయంలో నగదు లెక్కించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

## - ఆర్టీఓ, ఎంవిఐ అటాచ్

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** బండ్లగూడ ఆర్టీవో కార్యాలయంలో ఒక కానిస్టేబుల్ నగదు లెక్కింపు వ్యవహారంపై రాష్ట్ర రవాణా శాఖ సీరియస్‌గా స్పందించింది. సదరు కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అంతటితో ఆగకుండా కార్యాలయంలో ఏజెంట్లు రావటం, అధికారులతో రాసుకొని పూసుకొని తిరగటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకపై ఏజెంట్లను అనమతిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కానిస్టేబుల్ వ్యవహారం.

# బండ్లగూడ ఆర్టీఓ కార్యాలయంలో ఏసిబి తనిఖీలు




బండ్లగూడ ఆర్టీఓ కార్యాలయంలో ఏజెంట్ల వద్ద పత్రాలను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** పాతబస్తీ బండ్లగూడ దక్షిణ మండలం ప్రాంతీయ రవాణశాఖాధికారి కార్యాలయం (సౌత్‌జోన్ ఆర్టీఓ ఆఫీస్)లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం మధ్యాహ్నం మెరుపు దాడులు చేశారు. కార్యాలయ అధికారులు, సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావటంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డిఎస్‌పి అనంద్ కుమార్ ఆధ్వర్యంలోని బృందం దాడులు చేసి దాదాపు 20 మందికి పైగా ఏజెంట్లను గుర్తించారు. వారిలో కొంత మంది వద్ద ఉన్న పత్రాలను, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఇందులో ఉద్యోగులకు, ఏజెంట్లకు మధ్య సత్స సంబంధాలు బయట పడ్డాయి. వీరి మధ్య ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించారు. దీంతో విచారణను మరింత లోతుగా చేపట్టారు. ఇటీవల కానిస్టేబుల్ అరుణ్ కార్యాలయ ఆవరణలో నగదు లెక్కించే వీడియో వైరల్ కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏసీబీ సుధీర్ఘ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగలపై వచ్చిన అవినీతి, అక్రమాల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. తనిఖీలలో కొన్ని అక్రమాలు బయట పడ్డట్లు తెలిపారు. అనుమానిత యుపిఐ లావాదేవీలను గుర్తించామని, కొంత మంది ఉద్యోగులు, ఎజెంట్ల మధ్య గల సంబంధాలపై లోతైన విచారణ జరుగుతుందన్నారు. నగదు, లావాదేవీలు, అక్రమాలపై పూర్తి విచారణ తరువాత స్పష్టత వస్తుందన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి : ఇద్దరి అరెస్ట్

**ఉప్పల్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** తల్లితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న ఒక వ్యక్తి తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని 17 ఏళ్ల బాలిక ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు తన తల్లి, మరో బంధువు కూడా సహకరించారని ఆరోపించింది. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి తల్లి, ఓ వ్యక్తి, మరో బంధువుపై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఓ కుటుంబం గత కొన్నేళ్లుగా ఉప్పల్‌లోని ఓ కాలనీలో నివసిస్తోంది. బాధితురాలి తల్లికి మేడిపల్లికి చెందిన మాలోతు రవి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, కొంతకాలంగా సన్నిహిత సంబంధం కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో అతడు తరచూ వారి ఇంటికి వచ్చేవాడని తెలిపారు. సుమారు ఎనిమిది నెలల క్రితం తల్లి సమక్షంలో బాధితురాలిని బెదిరించి లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. అనంతరం పలుమార్లు ఇదే విధంగా వేధింపులకు గురిచేసినట్లు పేర్కొన్నారు. జూలైలో గర్భస్రావం జరగడంతో ఎనిమిది రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. అనంతరం బాధితురాలిని బోడుప్పల్ ప్రాంతంలోని మరో ఇంటికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వారం రోజుల క్రితం బాధితురాలు ఉప్పల్‌లోని తన అక్క ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని వెల్లడించడంతో కుటుంబ సభ్యులకు విషయం తెలిసింది. దీంతో ఆమె కుటుంబ సభ్యుల ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా తల్లితో సహా ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచారు.



మన నిత్య జీవితంలో పెరుగును చాలా వంటకాల్లో భాగం చేసుకుంటాం. అయితే పదార్థాలతో పెరుగును తీసుకోవడం వల్ల కొంతమందికి

# పెరుగుతో కొన్ని పడకపోవచ్చు !

కొన్ని పడకపోవచ్చని, అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు. చేపలు, పెరుగు.. ఈ రెండూ కలిపి తీసుకోకూడదన్న విషయం చాలామందికి తెలుసు! ఎందుకంటే ఈ ఉత్పత్తులలో ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. తద్వారా అజీర్తి సమస్య తలెత్తుతుంది. అంతే కాదు.. ప్రొటీన్లు ఎక్కువగా ఉంటే మాంసాహారంతోనూ దీన్ని కలపకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. మినపప్పుతో చేసిన పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకుంటే కొంతమందిలో విరేచనాలు, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయ! కొవ్వు పదార్థాలు, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుంది. అలాగే ఈ కాంబినేషన్ కొందరిలో బద్ధకం, మగత వంటి వాటికి కారణమవుతుందట. పెరుగుతో తయారుచేసే రైతన్నల్లో ఉల్లిపాయలు వేయడం చాలామందికి అలా అయితే ఈ కాంబినేషన్ కూడా కొందరికి పడకపోవచ్చు. ఈ రెండూ కలపడం వల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు, చర్మ అలర్జీలు వచ్చే అవకాశాలు ఉన్నాయి! వీహెల్ప్ కాబట్టి ఆయా పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకున్నప్పుడు ఏదైనా ఉన్నట్లు అనిపిస్తే.. అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిది. □

# బుఖారీ పులావ్



బాస్మతి బియ్యం : అర కిలో, మటన్: అర కిలో, క్యారెట్ తురుము: ఒక కప్పు, పచ్చి బఠాణీ: అర కప్పు, టమాట ముక్కలు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, జీడిపప్పు: పావుకప్పు, కిస్మిస్: ఒక టేబుల్ స్పూన్, అక్రోట్స్: ఐదు, నూనె: అర కప్పు, కారం: ఒక టేబుల్ స్పూన్, గరం మసాలా: ఒక టీస్పూన్, ధనియాల పొడి: ఒక టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్ట్: ఒక టేబుల్ స్పూన్, పసుపు: ఒక టీస్పూన్, నెయ్యి: రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క: రెండంగుళాల ముక్క, సాజీర: అర టీస్పూన్, యాలకులు: నాలుగు, లవంగాలు: ఆరు, అనాస పువ్వు: ఒకటి, ఉప్పు: తగినంత.

తయారీ: ముందుగా బాస్మతి బియ్యాన్ని అరగంటపాటు నానబెట్టుకుని పొడిపొడిగా వండాలి. స్టవ్‌మీద కుక్కర్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడయ్యాక జీడిపప్పు, అక్రోట్స్, కిస్మిస్ జోడించి బాగా వేయించి పక్కన పెట్టాలి. అదే నెయ్యిలో నూనె వేసి దాల్చిన చెక్క, సాజీర, అనాస పువ్వు, యాలకులు, లవంగాలు వేయాలి. కాసేపు వేగాక తరిగిన ఉల్లిగడ్డ, మిర్చి, టమాట కలపాలి. అన్నీ బాగా వేగాక మటన్ వేయాలి. రెండు నిమిషాలు మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు, క్యారెట్ తురుము, పచ్చిబఠాణీ, తగినంత ఉప్పు వేసి పది నిమిషాలు సన్నటి మంటపై మగ్గనివ్వాలి. అర లీటర్ నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టి ఐదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. బాగా ఉడికిన మటన్‌లో.. ఉడికించి పెట్టుకున్న బాస్మతి రైస్ వేసి కలిపి పైనుంచి వేయించిన డ్రైఫ్రూట్స్, నెయ్యి వేసి మరో రెండు నిమిషాలు మూత పెట్టుకుంటే నోరూరించే బుఖారీ పులావ్ సిద్ధం. □

# మాతృత్వమే మిన్న!





ఈ మధ్యన 'బాడీ షేమింగ్' ఎక్కువైపోయింది. ఎవరెలా ఉంటే మనకెందుకు? వారి గురించి మనకు పట్టింపేమిటి? అని ఇంగితం లేకుండా సెలెబ్రిటీస్‌ను ఆట పట్టించి మురిసిపోవడం నవతరం వంతయ్యింది. ఇలాంటి సందర్భాల్లో కొన్ని వికటిస్తాయి. మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం అనుకున్నవారెవరైనా ఓ బిడ్డకు జన్మనిచ్చి ఆవించి లాలించాలనీ అనుకుంటారు. యువతరం కలలరాణి అలానే అనుకుంది. 'అమ్మయ్యింది. జీవితానికి పరిపూర్ణత లభించినట్లేనని ఆమె కుటుంబ మంతా 'ఫీల్' అయ్యింది. 2025 నవంబరులో కాన్పు జరిగాక తాజాగా మొన్న వినాయక చవితినాడు అంబానీ ఇంట్లో భర్త విక్కీ కౌషల్‌తో దర్శనమిచ్చింది. సినీ యూత్‌కు కత్తిలా కనపడే కత్రినా కైఫ్ కాస్త లావెక్కినట్లు అనిపించింది. యువలోకం విలవిల్లాడిపోయింది. సినిమా లోకంలో సెలెబ్రిటీస్‌కు పెళ్లయినా భరించలేని పాడులోకం ఒకటుందని తెలియనిది కాదు. అదొక మాయా లోకం కదా! మాతృత్వపు మధురిమలు అందుకొంటున్న కత్రినాకైఫ్‌కు కొంతమంది శాపనార్థాలు పెట్టేస్తూ ట్రోలింగ్ చేసేసారు. ఆవిడ బొద్దుగా ఉందని తట్టుకోలేకపోయారు. బతికినన్నాళ్లూఅందాలు విరిసిన అరబొమ్మలానే ఉండాలంటే సాధ్యమవుతుందా. అది ఆకర్షణ అనుకోవాలా? ఆరాధన అనుకోవాలా; ఎంత సెలెబ్రిటీ అయినా ఓ వయసు వచ్చాక తనకూ ఓ పెళ్లి, పిల్లలు కావాలనుకుంటారు. అప్పుడు తమ శరీర వన్నెచిన్నెలు, బరువువంటివి విషయం పట్టించుకోరు. కుటుంబ సేవలోనే తాదాత్మ్య చెందుతారు. 'బాడీషేమింగ్'లో చిక్కుకున్న కత్రినాకైఫ్ స్పందన కూడా ట్రోలర్స్‌కి బుద్ధి చెప్పినట్లుగానే ఉంది. మరో సహనటున్ని పెళ్లి చేసుకుని సంసారం చేసుకుంటున్నా సమయంలో తనపై కామెంట్‌లను పట్టించుకున్నట్లు లేదు. కానీ సమాధాన మిస్తోంది. మనసును ప్రశాంతంగా ఉంచుకోవడమే ఏ వ్యక్తికైనా అవసరం. నిజమైన అందమంటే శారీరక, మానసిక ఆరోగ్యంతో ఉండడమేనని కత్రినా అభిప్రాయం. బాహ్య సౌందర్యాన్ని చూడడం కాదు ఆత్మ సౌందర్యమే అసలు సిసలు సౌందర్యమని హితవు పలుకుతోంది. మరో వైపు కత్రినాపై వస్తున్న విసుర్లను సహనటి ఖుష్బూ కత్రినాను సమర్థిస్తోంది. ఆ మాటకొస్తే ఏ మహిళా 'బాడీషేమింగ్'ను అంగీకరించదు. ప్రసవానంతరం మహిళల్లో వచ్చే శారీరక మార్పులను అర్థం చేసుకోకుండా హేళన చేయడం అవివేకమని కుండబద్దలు కొట్టినట్లు చెప్పజూశారు. పలువురు నటీ మణులు కూడా కత్రినాకు మద్దతు నిచ్చారు. □

# హనుమంతుని నవ అవతారాలు



హనుమంతుడిని స్మరించినంత మాత్రాన్నే బుద్ధి .. బలం .. యశస్సు .. ధైర్యం .. నిర్భయత్వం .. ఆరోగ్యం .. చైతన్యం .. వాక్పటిమ కలుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అలాంటి హనుమంతుడు రామాలయా లలోను .. ఉపలయాలలోను .. ప్రధాన దైవంగాను పూజాభిషేకాలు అందుకుంటూ ఉంటాడు. భక్తులను అనుగ్రహించడం కోసం ఆయన నవ అవతారాలను ధరించాడు. ప్రసన్నాంజనేయ స్వామిగా .. వీరాంజనేయ స్వామిగా .. వింశతి భుజాంజనేయ స్వామిగా .. పంచముఖాంజనేయ స్వామిగా .. అష్టాదశ భుజాంజనేయ స్వామిగా .. సువర్చల సహిత ఆంజనేయస్వామిగా .. చతుర్భుజాంజనేయస్వామిగా .. ద్వాత్రింశద్భుజాంజనేయస్వామిగా .. వానరాంజనేయస్వామిగా ఆయన ఆయా క్షేత్రాల్లో కొలువై భక్తుల మనోభీష్టాలను నెరవేర్చుతున్నాడు. సకల దేవతల అనుగ్రహం ఆంజనేయస్వామికి ఉండేలా బ్రహ్మదేవుడి వరం వుంది. అందువలన హనుమంతుడిని పూజించడం వలన, సకల దేవతల అనుగ్రహం లభిస్తుందనేది పెద్దల మాట.

# కలిసి నడుద్దాం..



ఆరోగ్యానికి నడకకు మించిన వ్యాయామం లేదని అందరికీ తెలిసిందే! కానీ, ఒంటరిగా భారంగా అడుగులు వేసిందానికన్నా, నచ్చిన వారితో జంటగా నడిస్తే మరింత ప్రయోజనం ఉందంటున్నారు పరిశోధకులు. అమెరికాకు చెందిన పర్ద్యూ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో ఈ సంగతి వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు రోజూ ఒంటరిగా వాకింగ్ చేసే 141 మందితో పాటు కలిసి నడిచే 72 జంటలనూ పరిశీలించారు. వారితో మాట్లాడారు. ఆరోగ్యానికి నడకకు మించిన వ్యాయామం లేదని అందరికీ తెలిసిందే! కానీ, ఒంటరిగా భారంగా అడుగులు వేసిందానికన్నా, నచ్చిన వారితో జంటగా నడిస్తే మరింత ప్రయోజనం ఉందంటున్నారు పరిశోధకులు. అమెరికాకు చెందిన పర్ద్యూ యూనివర్సిటీ నిర్వహించిన అధ్యయనంలో ఈ సంగతి వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా పరిశోధకులు రోజూ ఒంటరిగా వాకింగ్ చేసే 141 మందితోపాటు కలిసి నడిచే 72 జంటలనూ పరిశీలించారు. వారితో మాట్లాడారు. ఇందులో తేలిందేమిటంటే, ఒంటరిగా వాకింగ్ చేస్తున్నవారి వేగం కంటే జంటగా నడుస్తున్న వారి వేగం తక్కువట. ఆరోగ్య పరీక్షలు బుక్ చేయండి దంపతులు ఊసులు పంచుకుంటూ ఆనందంగా నడవడమే వేగం తగ్గడానికి కారణం. కానీ, ఇలా కబుర్లాడుకుంటూ ఆనందాలు పంచుకోవడం వల్ల వేగం తగ్గినా వారి ఆరోగ్యం హెచ్చుతున్నదని పరిశోధకులు తేల్చారు. వాకింగ్ మాత్రమే కాదు, వ్యాయామం చేసే సమయం లోనూ జీవిత భాగస్వామి గానీ, స్నేహితులు గానీ తోడుంటే ఎక్కువ లాభాలు ఉంటాయి. వేరే కసరత్తులు సాధ్యపడక పోయినా వారానికి 150 నిమిషాలు జంటగా వాకింగ్ చేస్తే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు సగానికి సగం తగ్గు తాయ" నిచెబుతున్నారు పరిశోధకులు. □

# నవ్వండి ప్లీజ్ !



మన స్ఫూర్తిగా నవ్వినప్పుడు ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గి ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి ఆందోళనను తగ్గిస్తాయి. అంతేకాదు, నవ్వు మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరిచి రక్తపోటుని నియంత్రిస్తుంది. సహోద్యోగులతో సరదాగా మాట కలుపుతూ... చిరునవ్వుతో పలకరించడం వల్ల పని ప్రదేశాల్లో సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. టీమ్ వర్క్‌తోపాటు సభ్యుల్లో సృజనాత్మకత కూడా పెరుగుతుందట. అందుకే కుదిరిప్పుడల్లా డెస్క్ పక్కవాళ్లతో మాట కలపడం, సరదాగా జోక్స్ వేసుకోవడం, సరదా సంఘటనల్ని గుర్తుచేసుకోవడం చేయాలి. నవ్వడం ఒక భోగం... నవ్వించడం ఒక యోగం... నవ్వలేకపోవడం ఒక రోగం! కాబట్టి మన ఒత్తిడి పోగొట్టుకోవడానికి కాస్త నవ్వుదాం ఏమంటారు! □

## తెర

# 'మైసా' కోసం నా లైఫ్‌నే ఇచ్చేశా: రష్మిక



రష్మిక మందన్న, రవీంద్ర పుల్లె, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ పాన్ ఇండియా మూవీ 'మైసా' గూస్‌బంప్స్ ఇంటెన్స్ టీజర్ లాంచ్ టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయిన్ రష్మిక మాట్లా డుతూ.. టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు పెర్ఫార్మెన్స్ అంటే ఎమోషన్స్‌తో చేశాను. ఇది నాకు కొత్త టెరిటరీ. ఇంత యాక్షన్ ఎప్పుడూ చేయలేదు. ఫస్ట్ టైమ్ చేసినప్పుడు ఒక నెర్వస్‌నెస్ ఉంటుంది. ఎప్పుడైనా ఒక క్యారెక్టర్ చేస్తున్నప్పుడు అందులో కొత్తదనం ఉండాలని నేను ఫీల్ అవుతాను. ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో ఎమోషనల్‌గా ఏముం టుందో అంతా ఆ ఫిల్మ్‌లో ఇచ్చాను. 'మైసా' కోసం నా లైఫ్‌నే ఇచ్చేశాను. డైరెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ.. ఈ కథ రాస్తున్నప్పుడే రష్మిక గారు హీరోయిన్‌గా చేయాలని ఫిక్స్ అయి పోయాను. సీతారామం లో నేను పని చేశాను. అప్పుడే తను నా కొత్త హీరోయిన్ అనుకున్నాను. ఇప్పటి వరకు మీరు క్యూట్‌గా, స్వీట్‌గా ఉండే రష్మికను చూశారు. ఈ సినిమా లో రష్మిక ఫేస్ మీద బ్లడ్ పెడితే ఎలా ఉంటుందో అది చూస్తారు. ప్రొడ్యూసర్ అజయ్ మాట్లాడుతూ.. రష్మిక ఈ సినిమా కోసం ప్రాణాలు పెట్టి పని చేశారనిపిస్తుంది. కొన్ని కొన్ని స్టంట్స్ చేయడానికి లైఫ్‌ని కూడా రిస్క్ చేశారు. అద్భుతంగా వచ్చింది. గాయం కాకపోయి ఉంటే ఈపాటికి సినిమా పూర్తి అయి పోయేది. చాలా దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ సినిమాని షూట్ చేశాం. చాలా గాయాలు కూడా అయ్యాయి. అలాంటి ప్రాంతాల్లో షూట్ చేయడం మామూలు విషయం కాదు. □

# ఇంప్యూర్ మూవీ ట్రైలర్ ఈవెంట్



వారాహి మల్లిపాముల, శ్రీదేవి మల్లిపాముల నిర్మించిన లేటెస్ట్ మూవీ ఇంప్యూర్. నిశాంతి ఇవని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయి కృష్ణ, యష్న, అభిజిత్ ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకుంటుంది. ఈ ఈవెంట్‌లో నందినిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఈవెంట్‌కి రావడానికి రెండే మేయిన్ రీజన్స్ ఉన్నాయి. ఒకటి మా బాస్ కృష్ణవంశీ ఫోన్ చేసి చెప్పారు. ఆయన చెప్తే కాదనడానికి లేదు. సెకండ్ డైరెక్టర్ నిశాంతి గురించి. నిశాంతి నాకు 15 ఏళ్లుగా తెలుసు. నాకు మంచి ఫ్రెండ్. రీసెంట్‌గా మా ఇంటి బంగారంలో కలిసి చేశాము. పృథ్వీ సార్‌ను అందరూ 30 ఇయర్స్ ఇండస్ట్రీ అంటారు. కానీ ఎవర్ గ్రీన్ పృథ్వీ. ఎందుకంటే.. తెలుగు కానీ, తమిళం కానీ.. ఏ లాంగ్వేజ్‌లో అయినా మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్. అందరికీ మంచి పేరు తీసుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అని అన్నారు.30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్ మాట్లాడుతూ.. చదివింది ఆంధ్ర యూనివర్సిటీ ఎంఎ ఎకనామిక్స్ అయినా మాది తాడిపల్లి గూడెం ఇంగ్లీష్. అంటే.. ప్యూర్‌గా ఇంగ్లీష్ ఉండదు. వాళ్లు ఇంగ్లీష్‌లో చెప్తున్నప్పుడు కూడా నాకు ఏం తెలియకున్నా అన్ని అర్థమైనట్లు ఎక్స్‌ప్రెషన్ ఇస్తుంటా. డైరెక్టర్ నిశాంతి చేసిన కృషి, టాలెంట్‌ను వాళ్ల మదర్ ఎంకరేజ్ చేయడం నిజంగా గొప్ప విషయం. అన్నాడు.డైరెక్టర్ నిశాంతి మాట్లాడుతూ.. ఒక మనిషి ప్యూర్‌గా ఉండాలా? ఇంప్యూర్‌గా ఉండాలా? అనేది సొసైటి డిసైడ్ చేస్తుంది. వారాహి వచ్చి కథ నాకు చెప్పినప్పుడు బాగా కనెక్ట్ అయ్యాయి. ఒక పెళ్లి క్యాన్సల్ అవడం వల్ల ముగ్గురి పరిస్థితి ఎలా మారింది అనేది ఈ సినిమా కథ. హీరో సాయికృష్ణ మాట్లాడుతూ.. ముందుగా ఇక్కడికి వచ్చిన అందరికి చాలా ధన్యావాదాలు.

# 'ది ప్యారడైజ్' ప్రేక్షకుల అంచనాలని అందుకుంటుంది: నాని



**సెప్టెంబర్ మీకు బాగా కలిసి వచ్చింది కదా?**
నా కెరీర్ స్టార్ట్ అయిందే సెప్టెంబర్‌లో.'అష్టా చమ్మా' సెప్టెంబర్‌లోనే రిలీజ్ అయింది. 'భలే భలే మగాడివోయ్'కూడా సెప్టెంబర్‌లోనే వచ్చింది.

**జడల్ క్యారెక్టర్ గురించి చెప్పగానే మీకు ఏమనిపించింది?**
కథలో నుంచి వచ్చిన లుక్ అది. నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలు అన్నీ బాగా రిలేటబుల్‌గా, తెలిసిన ఒక పర్సన్ లాంటి ఫీలింగ్ వచ్చే రోల్స్. ఇందులో క్యారెక్టర్ మాత్రం జనరల్ సొసైటీలో పెరిగిన వ్యక్తి కాదు. అది ఏంటి అనేది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థం అవుతుంది.

**మీ సినిమాలంటే ఫ్యామిలీ ఆడియన్స్ కదా.. ఈ సినిమా ఎలా ఉంటుంది?**
ఫ్యామిలీ ఆడియన్స్ అందరూ చూసే సినిమా ఇది. మదర్‌సన్ ఎమోషన్ అద్భుతంగా ఉంటుంది. ఒక కమర్షియల్ సినిమా నుంచి ఏమైతే ఆశిస్తారో అన్నీ ఉన్నాయి. ఫ్యామిలీస్ అందరూ కలిసి హ్యాపీగా చూడొచ్చు.

**అనిరుధ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎలా ఉండబోతుంది?**
మేము 'జెర్సీ', 'గ్యాంగ్ లీడర్' చేశాం. బిగినింగ్ నుంచి ఎండ్ వరకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో హోల్డ్ చేసి పట్టుకెళ్లే అవకాశం ఈ సినిమాతో వచ్చింది. వందకి రెండింతలు చేశాడు.

**మోహన్ బాబు క్యారెక్టర్ గురించి?**
శ్రీకాంత్ కథ చెప్పినప్పుడే మోహన్‌బాబు అయితే బాగుంటుంది అని అన్నాడు. కాకపోతే ఆయన ఈ క్యారెక్టర్ చేస్తారా లేదా అనేది నాకు డౌట్. ఎందుకంటే చాలా నెగిటివ్, బ్రూటల్ క్యారెక్టర్. శ్రీకాంత్ కథ చెప్పడానికి మోహన్ బాబు దగ్గరికి వెళ్లాడు.

**పాన్ ఇండియా ప్రమోషన్స్ గురించి?**
ఈ సినిమా కంటెంట్ అన్ని ప్రాంతాల్లో రీచ్ అయ్యి ఉంది. చాలా అద్భుతంగా రిసీవ్ చేసుకున్నారు. తమిళ్, హిందీ, కన్నడ, మలయాళం ప్రేక్షకులు ఎంతో ప్రేమను ఇస్తున్నారు.

**.మదర్ సెంటిమెంట్ గురించి?**
మా గ్లింప్స్ని రిలీజ్ చేసినప్పుడు ఒక తల్లి తన కొడుకు గురించి చెప్పే కథగా మొదలుపెట్టాము. టీజర్‌లో కూడా మెయిన్ ఎలిమెంట్ మదర్ మీదే కట్ చేశాము.

**'ప్యారడైజ్'అనేది ప్లేస్ గురించి?**
ప్యారడైజ్ అనే ప్లేస్‌లో సవారి అనే ఒక ట్రైబకు సంబంధించిన కథ ఇది. అక్కడ సవారీలకు గుర్తింపు లేదు. వాళ్ల ఉనికిని కూడా ఎవరు పట్టించుకోరు. వాళ్లని చంపేసినా సరే కేసు కూడా పెట్టరు.

# 'చకోర' అక్టోబరు 9న రిలీజ్



అక్టోబర్ 9 వరల్డ్ వైడ్ రిలీజ్ కాబోతున్న చకోర – High Joy Commercials బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP Ð Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ చకోర – Lunar love Bird. శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రాన్ని చూసి మెచ్చుకున్న శ్రీ లక్ష్మి పిక్చర్స్ బాపిరాజు గారు అత్యధిక మొత్తం చెల్లించి వరల్డ్ వైడ్ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ డాక్టర్. చింతాడ హేమారావు మాట్లాడుతూ మా మొదటి ప్రయత్నంలోనే చకోర మూవీ ఓన్లీ థియేట్రికల్ రైట్స్ ద్వారానే టేబుల్ ప్రాఫిట్ లభించినందుకు గర్వపడుతున్నామని ఆనందాన్ని వ్యక్తపరచారు.శ్రీ లక్ష్మి పిక్చర్స్ బాపిరాజు మాట్లాడుతూ వేరే వాళ్ళు హక్కుల కోసం పోటీ పడుతున్నా తమకు ప్రాధాన్యత ఇచ్చి థియేట్రికల్ హక్కులు ఇచ్చినందుకు గాను ప్రొడ్యూసర్ డాక్టర్ చింతాడ హేమారావు కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. చకోర – Lunar Love Birde చిత్రం ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది.

# 'ఏమో ఏమో ఇది' అక్టోబరు 30న విడుదల



రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇద్ది విడుదల తేదీ ఖరారైంది. రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2026 అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ శీతాకాలంలో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రేమానుభూతిని అందించేందుకు సినిమా సిద్ధమవుతోంది.HIT ఫ్రాంచైజీతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్న రచయిత, దర్శకుడు శైలేష్ కొలను తొలిసారి ఓ ఆహ్లాదకరమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తనదైన థ్రిల్లర్ కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన,'ఏమో ఏమో ఇద్దితో పూర్తిగా భిన్నమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నారు. రోషన్ మేక, ప్రీతి ముకుందన్‌ల ఫ్రెష్ పెయిర్ ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికే విడుదలైన ది ఫస్ట్ బ్రీజ్ ఆఫ్ 'ఏమో ఏమో ఇది' వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ వీడియో సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేయడంతో పాటు, చిత్రం లోని ప్రేమకథ ఎలా ఉండబోతోందనే ఆసక్తిని పెంచింది. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ ఎస్., సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# 'ఐ హేట్ మ్యారేజ్' నుంచి అప్పుడే పెళ్లా? సాంగ్ విడుదల



సుగి విజయ్, జుప్పీ భద్ర, హారిక రాజేందర్ హీరో హీరోయిన్లుగా పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో రూపొందుతోన్న విభిన్న ప్రేమకథా చిత్రం 'ఐ హేట్ మ్యారేజ్', ఆర్య సినిమా పతాకపంపై దయానంద్ మాదం, కార్తీక్ వెంపటి నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ చివరి వారంలో విడుదల కానుంది. ఈ సందర్భంగా బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా చూశాను. నాకు బాగా నచ్చింది. ఈ సినిమా రూపొందిన విధానం నన్ను అలరించింది. తమ స్నేహితుడిని దర్శకుడిని చేయడం కోసం చిన్నప్పటి ఫ్రెండ్స్ అంతా కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు. కంటెంట్‌తో పాటు ఎమోషన్ ఉన్న సినిమా ఇది. ఈ బ్యూటఫుల్ లవ్‌స్టోరీలో యూత్‌కు మంచి సందేశం కూడా ఉంది. తప్పకుండా ఈ సినిమా థియేటర్లో సౌండ్ చేస్తుంది అన్నారు.దర్శకుడు పరమేష్ రేణుకుంట్ల మాట్లాడుతూ ఎంతో స్ట్రగుల్స్ మధ్య ఈ సినిమాను నిర్మించాను. నా కోసం నా స్నేహితులు ఈ సినిమా నిర్మించారు. జెన్ జీ బ్యాచ్‌కు కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఈ సినిమాలో హీరో, హీరోయిన్ క్యారెక్టర్‌తో తమను తాము స్క్రీన్ మీద చూసుకున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ సినిమాను ప్రత్యేకంగా వీక్షించిన కొంత మంది యూత్‌కు ఎంతో క్రేజీగా నచ్చింది అంటూంటే సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది అన్నారు. హీరోయిన్ జుప్పీ భద్ర మాట్లాడుతూ ఈ రోజు నేను ఇక్కడికి పెళ్లి కూతురు గెటప్‌లో ఎందుకు వచ్చానో ఈ సినిమా చూస్తే తెలుస్తుంది. అందరికి కనెక్ట్ అయ్యే సినిమా ఇది.

# 'సిగ్మా' లాంచ్ చేసిన రాజమౌళి



సందీప్ కిషన్ యాక్షన్‌అడ్వెంచర్, హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్ 'సిగ్మా' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియే టర్లలో విడుదల కానుంది. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రతి ష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రంపై ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ సినిమాకు సంబంధించిన డిఫరెంట్ వరల్డ్‌ను, యాక్షన్ టచ్‌ను పరిచయం చేశాయి. కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎస్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. తాజాగా దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ఈ సినిమా తెలుగు థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. మోసపోయిన హీరో, జరిగిన దాన్ని మర్చిపోయి ముందుకు వెళ్లకుండా.. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి సాధించుకోవాలని పోరాటం మొదలుపెడతాడు. డ్రగ్స్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన రూ.500 కోట్ల భారీ రాకెట్ ఈ కథలో కీలకంగా ఉంటుంది. దీంతో హీరో క్రైమ్, మోసం, ప్రమాదాలతో కూడిన ప్రపంచంలోకి అడుగుపెడతాడు.మరోవైపు ఓ ఆర్‌జేతో ప్రేమలో ఉన్న హీరో.. తన స్నేహితుల సహాయంతో భారీ హీస్ట్‌కు ప్లాన్ చేస్తాడు. అయితే ఎంతో పక్కాగా వేసుకున్న ఆ ప్లాన్‌కు రెడ్డి అడ్డుపడటంతో మొత్తం ఆపరేషన్ గందరగోళంగా మారుతుంది. ఓటమిని అంగీకరించని హీరో మరింత బలంగా తిరిగి వచ్చి.. అన్ని అడ్డంకులను అధిగమించి తన లక్ష్యాన్ని ఎలా సాధించాడనేది ఆసక్తికరంగా మారింది.

# వెస్టిండీస్‌తో తొలి వన్డే

## మారిన టీమిండియా లైనప్

## రోహిత్, కోహ్లీ రీ ఎంట్రీ

**న్యూఢిల్లీ:** ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భాగంగా వెస్టిండీస్ జట్టుతో భారత్ తలపడనుంది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరిగే ఈ తొలి సమరం కోసం భారత క్రికెట్ జట్టు ఇప్పటికే సన్నాహాలు ఆరంభించింది. వెస్టిండీస్ జట్టుతో జరగబోయే ప్రతిష్టాత్మక సిరీస్ ద్వారా సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే జట్టులోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ఇరు జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌లో ఓపెనర్లుగా రోహిత్ శర్మతో పాటు, కెప్టెన్ శుభ్ మన్ గిల్ బరిలోకి దిగనున్నారు. గతేడాది జులై నెలలో ఇంగ్లాండ్ తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఈ జోడీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఆ పర్యటనలో రోహిత్ 174 పరుగులు,




గిల్ 188 పరుగులు సాధించి అదరగొట్టారు. ఇప్పుడు అదే జోరును విండీస్ గడ్డపై కూడా కొనసాగించాలని భావిస్తున్నారు. ఇక మూడో స్థానంలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ దిగనుండగా, ఆయన ప్రదర్శనపై అందరి చూపు నిలిచింది. ఇంగ్లాండ్ సిరీస్‌లో నిలకడైన ఆటతీరు కనబరిచిన కోహ్లీ మరోసారి తన మార్క్ చూపించేందుకు సిద్ధమయ్యాడు. అలాగే శ్రేయాస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో నాలుగో స్థానంలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను బరిలోకి దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయిదో స్థానంలో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌కు రానున్నాడు. గత 10 మ్యాచ్‌లలో 49.22 సగటుతో 443 పరుగులు సాధించిన రాహుల్ మిడిలార్డర్‌లో పాతుకుపోతున్నాడు. ఇక ఆల్‌రౌండర్లు నితీశ్ కుమార్, రవీంద్ర జడేజా మ్యాచ్‌ను ఫినిష్ చేసే బాధ్యతలను భుజాన వేసుకోనున్నారు. బౌలింగ్ విభాగంలో పేస్ దళాన్ని మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ, గురనూర్ బ్రార్ మోయనుండగా, అదనపు పేసర్‌గా నితీశ్ సహకరిస్తున్నాడు. స్పిన్ బాధ్యతలను కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా సమర్థంగా నిర్వర్తించనున్నారు.

# ఆసియా క్రీడలు




## మహిళల టెన్నిస్‌లో పాక్ చిత్తు

### గెలుపుతో క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్

### 0-3తో ఇరాన్ చేతిలో పురుషుల జట్టు ఓటమి

**టయోటా:** ఆసియా క్రీడలు టెన్నిస్‌లో భారత మహిళల జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేయగా, పురుషుల జట్టు ఇరాన్ చేతిలో ఓటమిపాలైంది. ఐచినగోయాలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు పాకిస్థాన్‌పై 3-0 తేడాతో ఘన విజయం సాధించి గ్రూప్ ఎఫ్ నుండి క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం దక్కించుకుంది. కేవలం 10 నిమిషాల్లోనే అలీనా ఖాన్‌ను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి సుతీర్థ ముఖర్జీ భారత్‌కు అద్భుతమైన ఆరంభాన్ని అందించింది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా ఆడుతున్న సింద్రెలా దాస్, ఆ తర్వాత కల్సూమ్ ఖాన్‌పై 11-6, 11-7, 11-5 తేడాతో గెలిచి ఆధిక్యాన్ని మరింత పెంచింది. ఆకుల శ్రీజ 11-4, 11-4, 11-5 తేడాతో ఫాతిమా ఖాన్‌ను ఓడించి క్లీన్ స్వీప్ పూర్తి చేసింది. మరోవైపు పురుషుల జట్టు ఇరాన్‌తో 0-3 తేడాతో ఓటమి చవిచూసింది. మనుష్ షా, మానవ్ థక్కర్, హర్మీత్ దేశాయ్ అందరూ తమతమ మ్యాచ్‌లలో ఓడిపోయారు. కాగా ఆసియా క్రీడల టేబుల్ టెన్నిస్‌లో భారత్ మూడు పతకాలను గెలుచుకుంది, అవన్నీ కాంస్య పతకాలే.

## మిక్స్‌డ్ మార్షల్‌ఆర్ట్స్‌లో సుచికకు కాంస్యం

**నగోయా:** ఐచినగోయా క్రీడల్లో భాగంగా జరిగిన మహిళల సాంప్రదాయ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించి, మిక్స్ మార్షల్ ఆర్ట్స్‌లో దేశానికి తొలి ఆసియా క్రీడల పతక విజేతగా నిలిచిన సుచిక తరియాల్ సోమవారం భారతదేశానికి చరిత్ర



సృష్టించారు. ఓవర్‌టైమ్ బౌట్‌లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియో చేతిలో స్వల్ప తేడాతో ఓటమి పాలవడంతో సెమీఫైనల్స్‌లో తరియాల్ చారిత్రాత్మక పరుగు ముగిసింది.
అత్యంత స్వల్ప తేడాతో ఓడిపోయిన ఈ భారత క్రీడాకారిణి, స్వర్ణ పతక పోరులో స్థానం కోల్పోయినప్పటికీ, ఎంఎంఏ ఆసియా క్రీడల అరంగేట్రంలో పోడియంపై స్థానం దక్కించుకుంది.
మంగోలియాకు చెందిన అల్తాంచిమెగ్ బైగల్మాపై 2-0 తేడాతో క్వార్టర్ ఫైనల్ విజయం సాధించి తరియాల్ సెమీఫైనల్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఈ విజయంతో ఆమె మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్‌లో ఆసియా క్రీడల పతకం సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది.



## కబడ్డీలో పురుషుల జట్టు విజయం

### జపాన్ 49-24 తేడాతో పరాజయం

**నగోయా:** డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఐచి ప్రిఫెక్చర్‌లోని టోకై సిటిజెన్స్ జిమ్నాసియంలో సోమవారం జరిగిన ఆసియా క్రీడల పురుషుల కబడ్డీ టైటిల్ భద్రపరిచే పోరాటాన్ని ఆతిథ్య జపాన్‌పై 49-24 తేడాతో సునాయాస విజయంతో ప్రారంభించింది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా ఆడుతున్న అయాన్ లోహ్‌చాబ్, దేవాంక్ దలాల్, అషు మాలిక్ భారత దాడికి నాయకత్వం వహించగా, జట్టు అద్భుతమైన ఆరంభం పొందడంలో అషు కీలక పాత్ర పోషించాడు. జపాన్‌పై రెండు ఆల్‌అవుట్‌లు సాధించిన తర్వాత భారత్ 18-2 ఆధిక్యాన్ని సంపాదించగా, అషు మూడు పాయింట్ల సూపర్ రైడ్‌తో ఆరంభ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. తొలి 20 నిమిషాల్లో మూడు ఆల్‌అవుట్‌లు చేసిన భారత్, తన ఆధిపత్యాన్ని కొనసాగించి 31-9 ఆధిక్యంతో విరామ సమయానికి వెళ్ళింది. అషు దాడికి నాయకత్వం వహించగా, రాహుల్ సేథ్‌పాల్ రక్షణలో బలమైన ఉనికిని అందించాడు. జపాన్ తన స్కోరింగ్ కోసం బోనస్ పాయింట్లపై ఎక్కువగా ఆధారపడింది, కానీ భారత్ ఒత్తిడిని కొనసాగించి ఆతిథ్య జట్టు అవకాశాలను కట్టడి చేసింది. ఆట తిరిగి ప్రారంభమైన వెంటనే, భారత్ మరో ఆల్‌అవుట్ చేసి తమ ఆధిక్యాన్ని 40 -12కు పెంచుకుంది. ఆ తర్వాత జపాన్ చివరి దశలో భారత్‌పై ఆధిక్యం సాధించి తేడాను తగ్గించడంతో రెండు జట్ల స్కోరును 49-24కి తీసుకెళ్లాయి. అయితే, భారత్ తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించి, తమ తొలి గ్రూప్‌స్టేజ్ విజయాన్ని సునాయాసంగా ముగించింది.



## షూటింగ్: వ్యక్తిగత పోరులో హిమాన్షుకు రజతం

### రుద్రాంక్ష్‌కు కాంస్యం

**నగోయా:** ఐచినగోయా ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో సోమవారం భారత్ వ్యక్తిగత, టీమ్ పోటీల్లో రెండు రజతాలు, ఒక కాంస్యం సాధించాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత్ డబుల్ పోడియంను కైవసం చేసుకుంది. హోరాహోరీగా జరిగిన ఎనిమిది మంది ఫైనల్‌లో హిమాన్షు ధిల్లాన్ రజత పతకాన్ని, రుద్రాంకష్ పాటిల్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. హిమాంశు 252.4 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, రుద్రాంక్ష 230.9 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఫైనల్ అంతటా భారత షూటర్లు పతకం కోసం హోరాహోరీగా పోరాడారు. రుద్రాంక్ష అద్భుతమైన ఆరంభాన్ని అందుకున్నాడు. తొలి 10 షాట్‌ల తర్వాత అతను 106.0 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, అతని తర్వాతి స్థానాల్లో 104.9 పాయింట్లతో షెంగ్, 104.8 పాయింట్లతో హిమాంశు ఉన్నారు. ఇక సోమవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో, హిమాన్షు ధిల్లాన్, పార్థ్ మానే, రుద్రాంక్ష్ పాటిల్ కలిసి 1,890.1 పాయింట్ల స్కోరు సాధించడంతో భారత్ రజత పతకాన్ని గెలుచుకుంది. 60-షాట్ క్వాలిఫికేషన్‌లో రుద్రాంఖ్ 631.8 పాయింట్లతో భారత్ తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించి మూడవ స్థానంలో నిలిచాడు. హిమాంశు 630.0 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలవగా, పార్థ్ మానే 628.3 పాయింట్లను అందించాడు. క్వాలిఫికేషన్‌లో టాప్ ఎనిమిది స్థానాల్లో నిలిచిన తర్వాత రుద్రాంక్ష్, హిమాంశు కూడా పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఫైనల్‌కు అర్హత సాధించాడు.



## హాకీలో భారత్ గెలుపు

### ఇండోనేసియా పరాజయం

**కకమిగహారా (జపాన్):** పూల్ బిలోని తమ రెండవ మ్యాచ్‌లో ఇండోనేషియాపై 17-1 తేడాతో ఘన విజయం సాధించింది. సోమవారం గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌తో పెనాల్టీ కార్నర్ల నుండి ఏడు గోల్స్, ఓపెన్ ప్లే నుండి 10 గోల్స్ రావడంతో, భారత్ యొక్క స్కోరింగ్‌లోని వైవిధ్యం వారి ఆధిపత్యాన్ని ప్రతిబింబించింది. డ్రాగ్‌ఫ్లిక్ స్పెషలిస్ట్ దీపికా సెహ్రావత్ (8, 28, 40 నిముషాల్లో) గోల్స్ చేయడంలో తన అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తూ, హ్యాట్రిక్ సాధించి, కేవలం రెండు మ్యాచ్‌లలోనే టోర్నమెంట్‌లో తన గోల్స్ సంఖ్యను 11కి చేర్చింది. ఫార్వర్డ్ నవనీత్ కౌర్ (35, 56, 57వ నిముషాల్లో), రుతుజా పిసాల్ (15, 20, 38వ నిముషాల్లో) కూడా హ్యాట్రిక్‌లు పూర్తి చేశారు. సునెలిత టోప్పో (11, 30వ నిముషంలో), లాల్‌రెమ్సియామి హ్మార్జోటే (13, 16 నిముషంలో), సాక్షి రాణా (25, 57వ నిముషంలో) తలా రెండుసార్లు గోల్స్ చేయగా, కెప్టెన్ సలీమా టెటే (34వ నిముషం), ఇషికా చౌదరి (36వ నిముషం) చెరో గోల్ చేశారు.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ



**ముంబయి, సెప్టెంబరు 21:** భారతీయ ఈక్విటీ మార్కెట్లు సోమ వారం సానుకూల ధోరణితో ముగిసాయి. ఆసియా మార్కెట్ల సాను కూల సంకేతాలు, ముడి చమురు ధరలలో స్వల్ప తగ్గుదలతో ఉత్సాహంగా ప్రారంభమైన మార్కెట్లు, చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. ఆఖరి గంటలో చోటుచేసుకున్న కొనుగోళ్ల మద్దతుతో బిఎస్ఇ సెన్సెక్స్ 329.78 పాయింట్లు ఎగబాకి 74,624.74 వద్ద ముగిసింది. అదేవిధంగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 25.60 పాయింట్లు లాభపడి 23,372 వద్ద స్థిరపడింది. ఈనాటి ట్రేడింగ్‌లో లార్జ్‌క్యాప్ షేర్లు సూచీలను ముందుకు నడిపించగా, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాలలో మాత్రం కొంత అమ్మకాల ఒత్తిడి వ్యక్తమైంది. నిఫ్టీ 50 ప్యాక్‌లోని 50 కీలక షేర్లలో 33 కంపెనీల షేర్లు లాభాలలో ముగియగా, 17 కంపెనీల షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. సిమెంట్, పెయింట్స్, వినియోగదారు ఉత్పత్తుల రంగాలు మార్కెట్ ర్యాలీలో ప్రధాన పాత్ర పోషించాయి. అల్ట్రాటెక్ సిమెంట్ షేరు ఏకంగా 3.35 శాతం లాభపడి మార్కెట్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఏషియన్ పెయింట్స్ 1.96 శాతం, ఇండిగో 1.75 శాతం, సన్ ఫార్మా 1.33 శాతం, ఐటీసీ 1.24 శాతం మేర లాభపడ్డాయి. ఎల్ అండ్‌టి, ఎన్‌టిపిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసిఐసిఐ బ్యాంక్ మరియు యాక్సిస్ బ్యాంక్ షేర్లు కొనుగోళ్ల ఆదరణతో లాభాల బాటలో ముగిసాయి. ఐటీ రంగానికి సంబంధించిన అడ్డంకులు ప్రభావంతో కొన్ని దిగ్గజ షేర్లు ఒత్తిడికి లోనై నష్టాలలో ముగిసాయి. ప్రధానంగా టెక్ రంగానికి చెందిన ఇన్ఫోసిస్ షేరు ప్రతికూల ట్రెండ్‌ను ఎదుర్కోగా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాలు నమోదు చేసిన ప్రధాన స్టాక్స్‌గా నిలిచాయి. ఒరాకిల్ 18 బిలియన్ల డేటా సెంటర్ రుణ ఒత్తిడి వార్తల నేపథ్యంలో భారతీయ ఐటీ అనుబంధ సంస్థ ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ షేరు ఏకంగా 6.87 శాతం పడిపోయి రూ. 11,079 వద్ద అత్యంత భారీ నష్టాన్ని చవిచూసింది. రంగాల వారీగా పరిశీలిస్తే, ఆటో మరియు ఎఫ్ఎమ్‌సిజి రంగాలు మార్కెట్ లాభాలకు బలమైన ఊతాన్నిచ్చాయి. నిఫ్టీ ఆటో సూచీ 0.76 శాతం, నిఫ్టీ ఎఫ్ఎమ్‌సిజి సూచీ 0.62 శాతం చొప్పున పెరిగాయి. బ్యాంకింగ్ రంగం కూడా సానుకూలంగా స్పందించి నిఫ్టీ బ్యాంక్ సూచీని 0.13 శాతం లాభంతో ముగించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ప్రతికూల వాతావరణం కొనసాగడంతో నిఫ్టీ ఐటీ సూచీ 0.66 శాతం క్షీణించింది. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 101.6 స్థాయికి తగ్గడం, ఆసియా మార్కెట్ల నుండి వచ్చిన సానుకూల సంకేతాలు మరియు విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్ స్థిరత్వానికి కారణమయ్యాయి. లార్జ్‌క్యాప్ విభాగంలో లాభాలు ఉన్నప్పటికీ, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ0.27 శాతం మరియు నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.10 శాతం చొప్పున నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 101.6 స్థాయికి తగ్గడం, ఆసియా మార్కెట్ల నుండి వచ్చిన సానుకూల సంకేతాలు మరియు విదేశీ, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు మార్కెట్ స్థిరత్వానికి కారణమయ్యాయి.

## బిట్‌కాయిన్ మళ్లీ 85,000 డాలర్లు పైనే..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** బిట్‌కాయిన్ సోమవారం మళ్లీ 85,000 డాలర్ల స్థాయిని అధిగమించింది. రికవరీ కొనసాగుతుండగా, మరోవైపు బ్రెంట్ క్రూడ్ ధర వరుసగా నాలుగో సెషన్‌లోనూ తగ్గింది. బిట్‌కాయిన్‌కు సం స్థాగత పెట్టుబడుల అంబిట్‌కాయిన్ పుంజుకోవడానికి సంస్థాగత పెట్టుబడుల డిమాండ్ పెరగడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. బిట్‌కాయిన్ ఆధారిత ఎక్స్ఛేంజ్‌ట్రేడెడ్ ఫండ్స్‌లో గత వారం 433.03 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో వారానికి సంబంధించిన నిధుల ప్రవాహం మొత్తం 6.21 మిలియన్ డాలర్లకు పాజిటివ్‌గా మారింది. సెప్టెంబర్‌లో ఇప్పటివరకు నమో దైన మొత్తం ఈటిఎఫ్ ఇన్‌ఫ్లో 313.63 మిలియన్ డాలర్లకే పరిమితమైంది. ఇది ఆగస్టులో నమోదైన 3.52 బిలియన్ డాలర్లతో పోలిస్తే చాలా తక్కువ.బిట్‌కాయిన్ ఇప్పుడు గత మేలో నమోదైన 82,850 డాలర్ల స్థాయిని దాటింది. కొనుగోళ్ల ఊపం పెరగడంతో మార్కెట్‌లో పైకి కదిలే వేగం బలపడుతోంది. అయితే రిలేటివ్‌స్ట్రెంత్ ఇండెక్స్ ఆర్ఎస్ఐ సుమా రు 71కి చేరింది. సాధారణంగా ఈ స్థాయి మార్కెట్‌లో ధరలు కొంత ఎక్కువగా విస్తరించిన పరిస్థితిని సూచిస్తుంది. బిట్‌కాయిన్ మార్కెట్ తదుపరి కీలక స్థాయిగా 90,000 డాలర్లవరకూ వెళుతుందని ట్రేడర్లు గమనిస్తున్నారు.

## టాటాగ్రూప్‌లో ఎల్ఐసి పెట్టుబడులు లక్ష కోట్లు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** ప్రభుత్వరంగంలోని అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసి దేశంలోని స్టాక్స్, మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే అతిపెద్ద డొమెస్టిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్‌గా నిలిచింది. అందుకే ఎల్ఐసీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ కూడా రూ. లక్షల కోట్లు ఉంటుందని చెప్పొచ్చు. టాటా గ్రూప్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల టాటా సన్స్ ఛైర్మన్‌గా 2022 జూన్‌లో చంద్రశేఖరన్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత టాటా గ్రూప్ వివిధ లిస్టెడ్ కంపెనీల్లో ఎల్ఐసీ తన వాటాలను గణనీ యంగా పెంచింది. ప్రైమ్ డేటా బేస్ డేటా ప్రకారం సుమారు 14 టాటా కంపెనీల్లో 10 సంస్థల్లో వాటా పెరగడంతో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ ఈ టాటా గ్రూప్‌లోనే ఏకంగా రూ. 1 లక్ష కోట్ల మార్కును అధిగమించింది. టాటా ఎల్క్సీలో ఎల్ఐసీ వాటా సుమారు 1.04 శాతంగా ఉంటే, అదే ఇప్పుడు 6.59 శాతానికి చేరింది. ఈ క్రమంలో టాటా ఎల్క్సీ షేర్ ధర 202022 మధ్య భారీగా పెరగడంతో 2022 ఆగస్ట్ సమయంలో ఏకంగా రూ. 10238 స్థాయిని తాకింది. టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్‌లో ఎల్ఐసీ వాటా 3 శాతం వరకు పెరిగి 8.23 శాతానికి చేరింది. ఇదే సమయంలో టాటా కెమికల్స్‌లో 6.79 శాతం నుంచి 9.24 శాతానికి ఎగబాకింది.

# భారత్-న్యూజిలాండ్ వాణిజ్య ఒప్పందం అక్టోబర్ 20 నుంచి అమలు

## కెనడాతో సెపా చర్చల్లో వేగం, అక్టోబర్ 5 నుంచి ఐదో విడత సమావేశం




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్ వాణిజ్య సంబంధాల్లో కీలక పరి ణామం చోటు చేసుకుంది. భారత్- న్యూజిలాం డ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబర్ 20న, విజయద శమి రోజున అమల్లోకి రానుంది. మరోవైపు కెనడాతో సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.అక్టోబర్ 20 నుంచి న్యూజిలాండ్‌తో ఎఫ్‌టిఎ, భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టిఎ అమలులోకి వచ్చే తేదీని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం వెల్లడించారు. న్యూఢిల్లీలో న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్‌క్లేతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు.ఒప్పందం అమల్లోకి వచ్చిన రోజు నుంచే భారత్ నుంచి న్యూజిలాండ్‌కు ఎగుమతి అయ్యే 100 శాతం ఉత్పత్తులకు సుంక రహిత మార్కెట్ ప్రవేశం లభించనుంది.ఈ ఒప్పందం అమలు రెండు దేశాల ఆర్థిక భాగస్వామ్యంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని గోయల్ పేర్కొన్నారు. బలమైన, మరింత విస్తృతమైన వాణిజ్య సంబంధాలను నిర్మించేందుకు భారత్, న్యూజిలాండ్‌కు ఉన్న ఉమ్మడి నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు.విజయదశమి సందర్భంగా అక్టోబర్ 20న భారత్-న్యూజిలాండ్ ఎఫ్టీయే అమల్లోకి రానుంది. ఇది ఇరు దేశాలకు విజయమేనని గోయల్ ఎక్స్‌లో పేర్కొన్నారు.ఈ ఒప్పందం కోసం కృషి చేసిన న్యూజిలాండ్ మంత్రి మెక్‌క్లే, ఇరు దేశాల చర్చల బృందాలను గోయల్ అభినందించారు. ఒప్పందం న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో భారత్-న్యూజిలాండ్ ఆర్థిక సం బంధాలు మరింత వేగం పుంజుకున్నాయి. న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ భారత్‌లో పర్యటించడం, అనంతరం 2026 జూలైలో ప్రధాని నరేంద్ర మోడీన్యూజిలాండ్‌ను సందర్శించడం ద్వైపాక్షిక సంబంధాలకు మరింత ఊతమిచ్చాయి. 2030 నాటికి భారత్-న్యూజిలాండ్ వ్యూహాత్మక భాగస్వామ్యం, రోడ్‌మ్యాప్‌లో భాగంగా రాబోయే నాలుగైదేళ్లలో వస్తువులు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని దాదాపు రూ.35,000 కోట్లకు రెట్టింపు చేయాలనే లక్ష్యం ఉంది.2026 ఏప్రిల్ 27న న్యూఢిల్లీలో భారత్-న్యూజిలాండ్ ఎఫ్టీయే పై సంతకాలు జరిగాయి. ఇదిలా ఉండగా, భారత్-కెనడా మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం సెపా చర్చలను వేగవంతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. చర్చల ఐదో విడత అక్టోబర్ 5న ప్రారంభం కానుంది.కెనడా అంతర్జాతీయ వాణిజ్య మంత్రి మానిందర్ సిద్ధూతో ముంబైలో జరిగిన సమావేశంతో సెపా చర్చల నాలుగో విడత ముగిసిందని గోయల్ తెలిపారు.చర్చలు సానుకూలంగా సాగాయని, ఇకపై చర్చల వేగాన్ని పెంచాలని ఇరు దేశాలు అంగీకరించాయని ఆయన చెప్పారు. అక్టోబర్ 5న ఐదో విడత చర్చలు ప్రారంభమవుతాయని, రాబోయే 90 రోజులు భారత్-కెనడా సంబంధాలకు కీలక కాలంగా మారవచ్చని గోయల్ పేర్కొన్నారు.

# చైనాకు మేడిన్ ఇండియా ఎగుమతులు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూహ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సం వత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్‌ఆగస్టు) చైనాకు భార త ఎగుమతులు సుమారు 40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా మేడ్ ఇన్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవ స్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు. అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

# డిజిటల్ పేమెంట్స్ రంగంలోకి యాపిల్‌పే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత డిజిటల్ చెల్లింపుల మార్కెట్లోకి ప్రపంచ టెక్ దిగ్గజం యాపిల్ అడుగుపెడుతోంది. గ్లోబల్ మార్కెట్‌లో యాపిల్ పే అందుబాటులోకి వచ్చిన దాదాపు పుష్కర కాలం తర్వాత భారత్‌లో లాంచ్ అవుతోంది. ప్రస్తుతం దేశీయంగా 84 శాతానికి పైగా మార్కె ట్‌ను శాసిస్తున్న ఫోన్‌పే, గూగుల్ పే ఆధిపత్యానికి ఇది ఎంతవరకు గండి కొడుతుందనే దానిపై ప్రస్తుతం ఉత్కంఠగా ఉంది. ప్రస్తుతం భారత్‌లో వీధి వ్యాపారుల నుంచి భారీ షాపింగ్ మాల్స్ వరకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి




నేరుగా బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు పంపే యూపీఐ పద్ధతే అత్యంత ప్రాచుర్యంలో ఉంది. యాపిల్ పే ఎలాంటి సేవలతో యూజర్స్‌ను ఆకట్టుకుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా సమాచారం ప్రకారం భారత్‌లో యాపిల్ పే ప్రారంభ దశలో ప్రధానంగా క్రెడిట్ కార్డుల ఆధారిత ట్యాప్ అండ్ పే సేవలతోనే రావచ్చని తెలుస్తోంది. ప్రాథ మికంగా యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులతో ఈ సేవలు స్టార్ట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ మొదటి దశలో క్యూఆర్ కోడ్ ఆధారిత యూపీఐ సదుపాయం లేకపోతే, నిత్యం చిన్న మొత్తాల లావాదేవీలు జరిపే సాధారణ యూజర్స్‌ను ఇది పెద్దగా ఆకర్షించలేకపోవచ్చనే అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. పైగా ఫోన్‌పే, గూగుల్ పేలు ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటిలోనూ పనిచేస్తుండగా, యాపిల్ పే కేవలం ఐఫోన్, యాపిల్ వాచ్ యూజర్లకు మాత్రమే పరిమితం కానుంది. యాపిల్ పే భారత్‌లో యూపీఐ సపోర్ట్‌తో కూడా రావచ్చని కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. ఐఫోన్ వాడుతున్న ప్రీమియం కస్టమర్లు ఫోన్‌పే, గూగుల్ పేలకు బదులుగా ఇన్‌బిల్ట్‌గా ఉండే యాపిల్ పే వైపు మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తొలి దశలో కేవలం క్రెడిట్ కార్డుల చెల్లింపులకే పరిమితమైతే, దేశీయ పేమెంట్ యాప్‌లకు తక్షణ ముప్పు లేకపోయినప్పటికీ, భవిష్యత్తులో యాపిల్ పే యూపీఐ సేవలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే మాత్రం భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో తీవ్ర పోటీ నెలకొనడం ఖాయం.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.